RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers

07 జనవరి 2025 మంగళవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:186

# చర్లపల్లి టెర్మినల్ ప్రారంభం

## 413 కోట్లతో నిర్మాణం

## వర్చువల్ గా ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ






**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జనవరి 6:** మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాలో 413 కోట్లతో నిర్మించిన చర్లపల్లి టెర్మినల్ ను భారత ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ గా ప్రారంభించి జాతికి అంకితం చేసారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ వికసిత్ భారత్ లో భాగంగా ఓడిస్సా, జమ్ము, తెలంగాణ రాష్ట్రాలలో టెర్మినల్స్ ను ప్రారంభించడం ఎంతో హర్షనీయమన్నారు. తెలంగాణలోని హైదరాబాదులో సికింద్రాబాదు, నాంపల్లి, కాచిగూడా లో ఉండే రద్దీ చర్లపల్లి టెర్మినల్ ఏర్పాటు ద్వారా తగ్గుతుందని, అంతేకాకుండా వస్తురవాణా, వాణిజ్యా వ్యాపారానికి ఎంతగానో ఉపయోగపడడమే కాకుండా ఎంతో మందికి జీవనోపాధి, ఉద్యోగ వసతుల కల్పన కలుగుతుందన్నారు. రానున్నరోజుల్లోఈ టెర్మినల్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణరాష్ట్ర గవర్నర్ జిష్టు దేవ్ వర్మ, కేంద్ర రైల్వే మంత్రి సోమన్న, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, భారత హోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు ఈటెలరాజేందర్, మాజీ శాసన సభ్యులు ప్రభాకర్ లు పాల్గొన్నారు.

సచివాలయం నుండి తెలంగాణరాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వర్చువల్ గా పాల్గొని చర్లపల్లి టెర్మినల్ ను ప్రారంభించినందుకు గాను ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణాలో మెట్రొరైల్ విస్తరణకు, ఆర్ ఆర్ ఆర్ నిర్మాణానికి కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేసారు.

ఈ కార్యక్రమంలో మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం, కీసర ఆర్డిఓ సైదులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాబలం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన దానం నాగేందర్



**జూబ్లీహిల్స్ ప్రజాబలం ప్రతినిధి:** బంజరాహిల్స్‌లోని ఖైరతాబాద్ శాసన సభ్యులు దానంనాగేందర్‌నివాసంలో ప్రజజాబలం తెలుగు దినపత్రిక 2025 క్యాలెండర్ ను ఖైరతాబాద్ శాసన సభ్యులు దానంనాగేందర్ ఆవిష్కరించినారు. ఈ సందర్భంగా దానంనాగేందర్ మాట్లాడుతూ పత్రికలు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తాయని ప్రజాసమస్యలు ప్రభుత్వానికి చేరవేయడంలో పత్రికలది ముఖ్యపాత్ర అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాబలం దినపత్రిక బ్యూరోఛీఫ్ డా॥ ఆర్వల్లి శ్రీనివాస్ వంజరి, కాంగ్రెస్ సీనీయర్ నాయకులు సంతోష్‌గుప్తా ,మాజీడైరెక్టర్ టీ.సతీష్, కాంగ్రెస్ డీసీసీ ఉపాధ్యాక్షులు మాజీ సెట్వీన్ డైరెక్టర్ ఎస్.ధన్‌రాజ్, ప్రవీణ్ ఖైరాతాబాద్,కాంగ్రెస్ నాయకులు యాదగిరి



# హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలకే దక్కుతుంధి

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి







**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గానీ, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలోగానీ హైదరాబాద్ నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో 11 కిలోమీటర్ల అత్యంత పొడవైన స్వర్గీయ పీవీ నరసింహారావు ఫ్లైఓవర్ నిర్మితమైతే, మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 4 కిలోమీటర్ల మేర రెండో అతిపొడవైన స్వర్గీయ డాక్టర్ మన్మోహన్ సింగ్ ఫ్లైఓవర్ ను నిర్మించామని, తద్వారా తమకు తామే పోటీ అని నిరూపించుకున్నట్టయిందన్నారు.

నూతనంగా నిర్మించిన ఆరాంఘర్ ఫ్లైఓవర్‌ను మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ గారు, స్థానిక ఎమ్మెల్యేలు, మేయర్ తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అలాగే చాంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధిలో రూ.301 కోట్లతో సీవరేజ్ ప్రాజెక్టు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి సీఎం మాట్లాడారు.

ఆరాంఘర్– జూపార్క్ ఫ్లైఓవర్‌కు దివంగత ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ పెరు పెడుతున్నట్లు హర్షధ్వానాల మధ్య ముఖ్యమంత్రి ప్రకటించారు.

"హైదరాబాద్ నగర అభివృద్ధే తెలంగాణ అభివృద్ధి. హైదరాబాద్ అభివృద్ధి కోసం రోడ్ల విస్తరణ, మెట్రో రైలు విస్తరణ, గోదావరి జలాలు తేవడం ద్వారా తాగునీటి సమస్యల పరిష్కారం, మూసీ పునరుజ్జీవం శాంతి భద్రతల పరిరక్షణ, నిరుద్యోగ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి అనేక కార్యక్రమాలు తీసుకుని ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటున్నాం.

హైదరాబాద్ నగరానికి లేక్స్ అండ్ రాక్ సిటీగా ప్రపంచంలోనే ఒక గొప్ప పేరు ఉంది. ఆనాడు నిజాం చేసిన అభివృద్ధిని పరిరక్షించుకొని ఉండుంటే ప్రపంచ చిత్రపటంలో హైదరాబాద్ తో పోటీ పడే నగరమే ఉండకపోయేది. కానీ కాలక్రమేణా కబ్జాదారులు, ఆక్రమణల వల్ల నగర సుందరీకరణ పూర్తిగా దెబ్బతిన్నది. ఈరోజు నగరంలో చిన్న వర్షం వచ్చినా వరదలు వస్తున్నాయి, ట్రాఫిక్ జామ్లు అవుతున్నాయి. వీటన్నిటిని కూడా పరిష్కరించుకోవాలనే ఆలోచనతోనే ప్రభుత్వం ముందుకు వెళ్తుంది.

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు. ఎన్నికల తర్వాత అభివృద్ధి గురించి మాత్రమే ఆలోచన. ఇప్పుడు హైదరాబాద్ అభివృద్ధి కోసం ఎంఐఎంతో కలిసి పనిచేస్తాం.

ఈ రోజు ప్రారంభమైన చర్లపల్లి టర్మినల్ చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. నేను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను ఒక పెద్ద రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చేసేందుకు అవసరమైన భూమి సేకరణ, ఇతర అనుమతుల పనులన్నీ పూర్తి చేశాం.

చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం సందర్భంగా కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తో మాట్లాడాను. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత 10 ఏండ్ల పాటు మెట్రో రైలు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్న విషయాన్ని గుర్తుచేశాను.

ముఖ్యంగా గౌలిగూడ, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట వరకు సుమారు 7.5 కిలోమీటర్ల మెట్రో పనులు ఏకంగా ఒక్క ఇటుక కూడా వేయలేదు. అందుకే హైదరాబాద్ మెట్రో రెండో దశ కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను గురించి చెప్పి కేంద్ర మంత్రిమండలి ఆమోదించాల్సిందిగా అభ్యర్థించాను.

ఔటర్ రింగ్ రోడ్‌తో పాటు, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం కూడా అత్యవసరం. రీజినల్ రింగ్ రోడ్ పూర్తయితే తెలంగాణ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రీజినల్ రింగ్ రోడ్‌తో పాటు, రీజినల్ రింగ్ రైలును కూడా కేంద్రాన్ని కోరాం. వికారాబాద్ %-% కొడంగల్ - కృష్ణా రైల్వే లైన్ కూడా కోరాం.

తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం ఎవరితోనైనా కలుస్తా, ఎవరితోనైనా పోరాడుతా. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం నా శక్తివంతమైన కృషిని కొనసాగిస్తాను.

హైదరాబాద్ నగరానికి సంబంధించి కొన్ని అంశాలపై మంత్రి శ్రీధర్ బాబుఒక డాక్యుమెంట్ తయారు చేసారు. కొద్దిరోజుల్లోనే హైదరాబాద్ ఎంఐఎం ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు సంబంధిత అధికారులతో ఒక సమావేశం నిర్వహిస్తాం.

హైదరాబాద్ పాత నగరం నిజానికి ఓల్డ్ కాదు.. ఒరిజినల్ సిటీ.. ఇది అసలైన నగరం. అందుకే మా ప్రభుత్వం ఒరిజినల్ సిటీ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుంది."

ప్రజాబలం

07 జనవరి 2025 మంగళవారం

# పక్షుల రక్షణతో ప్రకృతి సంరక్షణ

పక్షులు మానవునికి జీవన గమనం నేర్పుతాయి. వాటిని కాపాడటం మన కర్తవ్యం' అని భారత దేశ పక్షి శాస్త్ర పితామహుడు సలీం అలీ అన్నమాటలు జనవరి 5, జాతీయ పక్షుల దినోత్సవం సందర్భంగా నెమరు వేసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. పక్షులు ప్రకృతికి అందాన్ని, పక్షుల గానం మనస్సుకు ఆహ్లాదాన్ని ఇస్తాయి. పక్షుల జీవన విధానం మానవునికి సహనాన్ని, శ్రమను, స్వేచ్ఛను నేర్పుతాయి. వీటి కదలికలు, జీవన శైలులు పర్యావరణ పరిస్థితులపై మానవునికి స్పష్టమైన సంకేతాలను ఇస్తాయి. పక్షులు వ్యవసాయంలో ముఖ్యమైన పాత్ర వహిస్తాయి. పంటలకు హానిచేసే పురుగులను తిని పంటలను రక్షిస్తాయి. పక్షులు పుష్పించే పూలనుండి మకరందాన్ని పీల్చేక్రమంలో పరాగసంపర్కానికి సహకరిస్తాయి. ఈ ప్రక్రియ పంటల ఉత్పాదకతను పెంచుతుంది. అందుకని పక్షులను వ్యవసాయానికి సహజ మిత్రులు అని అంటాము. చనిపోయిన చిన్న జీవుల అవశేషాలను తినడం ద్వారా పక్షులు (గద్దలు, రాబందులు) వ్యాపించే రోగాలను తగ్గిస్తాయి. ఇవి పర్యావరణానికి అందాన్ని జోడించి పర్యాటకులను ఆకర్షించి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతాయి. ఇంతగా మనిషికి, ప్రకృతి, వ్యవసాయానికి విడదీయరాని అనుబంధం ఉన్న పక్షులు నేడు అడవులు అంతరించిపోవుట వలన, కమ్యూనికేషన్ రంగాలలో సాంకేతికత విప్లవాత్మకంగా అభివృద్ధి చెందడం వలన అంతరించిపోవుటకు సమీప దూరంలోఉన్నాయి. నేడు ప్రపంచ వ్యాప్తంగా అడవుల విస్తీర్ణం ఊహకు కూడా అందని వేగంతో రోజురోజుకి తగ్గిపోతుంది. దీనికి గల ప్రధాన కారణం జనాభా విస్ఫోటనం, గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యత. వీటి కారణంగా అడవులను నరికి నివాస స్థలాలను ఏర్పరుచుకుంటున్నారు. ఆహార కొరతను అధిగమించుటకు అడవులను నరికి సాగుభూమిని వృద్ధి చేసుకుంటున్నారు. నిరక్షరాస్యత కారణంగా దీని ఫలితాలను అంచనా వేయలేకపోతున్నారు. పక్షులు వాటి నివాస స్థలాలైన వృక్షాలపై అవాసాలను కోల్పోయి అంతరించిపోవుటకు దగ్గర వుతున్నాయి. ఉదాహరణకు బట్టమేక పక్షి, మన జాతీయ పక్షి నెమలి.

కమ్యూనికేషన్ రంగాలలో సాంకేతిక విప్లవం ఎంతో సంతోషకరమైన విషయం అయినప్పటికీ పక్షుల మనుగడకు నష్టం వాటిల్లుతుందనే సమాచార వ్యాప్తి పక్షి, ప్రకృతి ప్రేమికులను కలవరపెడుతోంది. చరవాణి(మొబైల్)ల సమాచార ప్రసారం కోసం రేడియోత రంగాలను విడుదల చేస్తాయి. ఈ రేడియో తరంగాలు చరవాణి (మొబైల్) ప్రసార స్తంభాల (సెల్టవర్స్) ద్వారా వ్యాప్తి చెందుతాయి. ఈ రేడియో తరంగాలు చిన్నజీవులైన పక్షులపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతాయి. చారవాణి ప్రసార స్థంభాల ద్వారా వ్యాప్తి చెందే వికిరణాల కారణంగా పక్షులు వాటి దారులను గుర్తించడంలో సమస్యలను ఎదుర్కొంటున్నాయి. వీటి కారణంగా పక్షులు ఆవాస స్థలాలు మారిపోతున్నాయి. పెరిగిన ఉష్ణోగ్రతలు, ఆహార లభ్యతలో తగ్గుదల వలన పక్షులు తమ సంతతిని పెంచటంలో ఇబ్బందులు పడుతున్నాయి. చరవాణి స్థంభాలు విడుదల చేసే రేడియా తరంగాల ప్రభావం వలన పక్షుల జ్ఞానేంద్రియాలు (సెన్స్ఆర్గాన్స్) దెబ్బతిని ఆహారాన్ని గుర్తించడంలో సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఈ మధ్యకాలంలో జరిగిన అన్ని శాస్త్రీయ పరిశోధనలు చరవాణి ప్రసార స్థంభాల చుట్టూప్రక్కల ఉన్న పక్షుల జనాభా తగ్గుముఖం పట్టిందని ఉద్ఘాటిస్తున్నాయి.

పక్షుల రక్షణ కోసం చట్టాలు

భారత దేశంలో పక్షులను రక్షించడానికి, వాటి నివాస స్థలాలను కాపాడటానికి వివిధ చట్టాలు అమలులో ఉన్నాయి. 1. వన్యప్రాణి పరిరక్షణ చట్టం -1972 ప్రకారం ఏ వ్యక్తి అయినా పక్షులను హరించడం, గూడులను ధ్వంసం చేయడం, పక్షులు పెట్టిన గుడ్లను తీయడం నేరంగా పరిగణించబడుతుంది. 2. పర్యావరణ పరిరక్షణ చట్టం - 1986 ప్రకారం పక్షులను ఆహారం, నివాసం అందించే చెట్లను నరకడం లేదా వాటి నివాస స్థలాలను ధ్వంసం చేయడం నేరంగా భావించబడుతుంది. అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాలు

1. CITES(Convention on International Trade in Endangered species) ఒప్పందం, అరుదైన పక్షుల అక్రమ వాణిజ్యాన్ని నియంత్రిస్తుంది. 2. Ramsar Convention తేమభూములను కాపాడటం ద్వారా వలస పక్షుల అవాసాన్నికల్పిస్తుంది.

పక్షుల సంరక్షణ అనేది పర్యావరణ సంరక్షణకు కీలకం. పక్షులను రక్షించడం ప్రతి మనిషి బాధ్యత. పక్షులు కనుమరుగు అవుతున్న పరిస్థితులలో వాటి జీవన ప్రదేశాలను కాపాడటం, ఆహార భద్రత కల్పించడం, పచ్చదనం పెంచడం, కృత్రిమ రసాయనాల వాడకాన్ని తగ్గించడం, పక్షుల సంరక్షణ గురించి ప్రజలలో అవగాహన పెంచడం, విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, పక్షుల రక్షణ చట్టాలను గౌరవించడం, పర్యవేక్షించడం, చరవాణి ప్రసార స్తంభాల స్థానం, రేడియో తరంగాల పరిమితిని నియంత్రించడం ద్వారా పక్షుల జనాభా సంఖ్యను వృద్ధి చేయవచ్చు. జాతీయపక్షులదినోత్సవం, పక్షుల ప్రాముఖ్యతను గుర్తుచేసుకునే ఒక మంచి సందర్భం. పక్షులను రక్షించడం కేవలం ప్రకృతికి మేలు చేయడం మాత్రమే కాదు, మన భవిష్యత్తుతరాలకు ప్రకృతి సంపదను అందించడం. ప్రతి వ్యక్తి పక్షుల రక్షణలో తమ పాత్ర గుర్తించి, వాటి జీవనాన్ని కాపాడే చర్యలు తీసుకోవాలి. పక్షుల సంరక్షణయే భవిష్యత్తుకు భరోసా.' పక్షులను కాపాడటం అంటే ప్రకృతిని కాపాడటం. ప్రకృతి లేని జీవితం అసంభవం' అని ఎల్డోలియో ఫోల్డ్ అన్న మాటలు మనం ఎప్పుడూ గమనంలో ఉంచుకుని పక్షుల సంరక్షణకు పాటు పడాలి.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 06 :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్,మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం పొట్యాల గ్రామానికి చెందిన తిరుమలేష్, అర్క నారాయణలు పొట్యాల్, కొంపల్లి గ్రామాలలో దాదాపు 300 జనాభా ఉందని, ప్రజల సౌకర్యార్థం పొట్యాల నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.భీమిని మండలం పెద్దపేట గ్రామానికి చెందిన అరికిల్ల విజయ తాను కూలీ పని చేసుకుంటూ తడకల ఇంటిలో నివసిస్తున్నామని,తమకు ఒక ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. తాండూర్ మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన జాడి (వడాల) పెంటయ్య తనకు గల వ్యవసాయ భూమి నల్లవాగు ప్రాజెక్టులో ముంపుకు గురయిందని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండల కేంద్రానికి చెందిన బన్న రోషిత్కుమార్ సరైన సమాచారం లేకపోవడంతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో తన వివరాలు ఇవ్వలేకపోయానని,అవకాశం కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.మంచిర్యాల జిల్లాకు చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తమ దరఖాస్తులో ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి పథకాలు,6 గ్యారంటీలను కళాజాతల ద్వారా ప్రజలలోకి తీసుకువెళు తున్నామని, తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. వేమనపల్లి మండలం దస్నాపూర్ గ్రామానికి చెందిన గురుండ్ల చంద్రుమెర గొర్లపల్లి గ్రామ శివారులో గల తన భూమి ఆర్ %ఆ%ఆర్ కొత్త కాలనీలో పోయినట్లుగా చూపుతుందని, తన భూమిలో ఎలాంటి భూసేకరణ జరుగలేదని, ఈ విషయమై విచారించి తనకు పట్టా పాస్ పుస్తకం ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామానికి చెందిన కుశ్నపెల్లి వనిత తాను ఇంటర్, టి.టి.సి. పూర్తి చేస్తానని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ది నేషనల్ అంబేద్కర్ సేన సంస్థ ప్రతినిధులు తమ దరఖాస్తులో మందమర్రిలో వైద్య కళాశాల, డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరారు. నస్పూర్ మండలం ఆర్%ఆ%ఆర్ కాలనీ-సింగాపూర్కు చెందిన అట్కపురం రాయమల్లు తనకు గ్రామంలో ఉన్న భూములు సింగరేణి సంస్థ ఓపెన్కాస్టులో కోల్పోయామని, తన కుమారుడికి సింగరేణిలో ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 29 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిష్కరించే విధంగా సంబంధిత అధికారుల సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వాహనదారులకు గులాబీ పూలు ఇచ్చి విద్యార్థుల వినూత్న అవగాహన

**హుజరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జనవరి 6** ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని హుజురాబాద్ టౌన్ సీఐ తిరుమల గౌడ్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ పాఠశాల విద్యార్థుల సహకారము తో ట్రాఫిక్ రూల్స్ పై వాహనదారులకు అవగాహన కల్పించారు.జమ్మికుంట-కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకుండా వస్తున్న వాహనా దారులను ఆపి గులాబీ పూలను ఇచ్చి..హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడపాలంటూ వినూత్నంగా గులాబీ పూలు ఇచ్చి అవగాహన కల్పించారు.అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు అవే మనల్ని రక్షిస్తాయని, విద్యార్థులు వాహనదారులకు సూచనలు చేశారు. అనంతరం సిఐ మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్ ను వివరించడం హర్షనీయమన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ నిబంధనల ప్రకారంగా వాహనాలను నడపాలని సూచించారు. అతివేగం అజాగ్రత్తగా నడిపి కుటుంబాలను రోడ్డుపాలు చేయవద్దని సూచించారు. వాహనాల వెంట ధ్రువీకరణ పత్రాలు ఉండాలని, మద్యం సేవించడం ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం చేయరాదని సూచించారు.



## తుది ఓటరు జాబితా ప్రచురణ
## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 06 :** ఎస్.ఎస్.ఆర్.-2025లో భాగంగా జిల్లాలోని 3 శాసనసభ నియోజకవర్గాలకు చెందిన తుది ఓటరు జాబితా విడుదల చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు.ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా నూతన ఓటరు, మార్పులు, చేర్పులు, తొలగింపుల కొరకు ఫారం 6, 7,8 ద్వారా అందిన దరఖాస్తులను భారత ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పరిశీలించి ముసాయిదా జాబితా ప్రచురణ,ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించి, పరిష్కరించి భారత ఎన్నికల సంఘం అనుమతి పొంది తుది ఓటరు జాబితా ప్రచురించడం జరిగిందని తెలిపారు.తుది జాబితా ప్రకారం 002-చెన్నూర్ (ఎస్.సి.)శాసనసభ నియోజకవర్గంలో 96 వేల 964 మంది పురుషులు,99 వేల 49 మంది మహిళలు,7 మంది ట్రాన్స్జెండర్లు,8 మంది ఎన్.ఆర్.ఐ.,141 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని,003-బెల్లంపల్లి (ఎస్.సి.)శాసనసభ నియోజకవర్గంలో 88 వేల 109 మంది పురుషులు,90 వేల 286 మంది మహిళలు,13 మంది ట్రాన్స్ జెండర్లు, ఇద్దరు ఎన్.ఆర్.ఐ.,178 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని,004-మంచిర్యాల శాసనసభ నియోజకవర్గంలో 1 లక్షా 39 వేల 306 మంది పురుషులు,1 లక్షా 42 వేల 421 మంది మహిళలు,26 మంది ట్రాన్స్ జెండర్లు,26 మంది ఎన్.ఆర్.ఐ.,364 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3 శాసనసభ నియోజకవర్గాలలో 3 లక్షల 24 వేల 379 మంది పురుషులు,3 లక్షల 31 వేల 756 మంది మహిళలు,46 మంది ట్రాన్స్ జెండర్లు,39 మంది ఎన్.ఆర్.ఐ.లు, 683 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని తెలిపారు.తుది ఓటరు జాబితాను జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలు,తహశిల్దార్, రాజస్వ మండల అధికారుల కార్యాలయాలు,సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలలో ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు.

## తేజస్వినీ ఆశీర్వదించిన ఎమ్మెల్యే
## వివేక్ వెంకటస్వామి



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 6:**మందమర్రి పట్టణంలోని అంగడి బజార్ లో నివాసముంటున్న ప్రత్యక్ష సాక్షి రిపోర్టర్ పల్లె సమ్మయ్య కుమార్తె తేజస్విని నూతన వస్త్రాలంకరణ ఫంక్షన్ కు చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరై తేజస్విని ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట ఉన్న అఖిల భారత యాదవ మహాసభ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బండి సదానందం యాదవ్ తన వంతు సహాయంగా 21,000 రూపాయలు అందించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** అయ్యప్ప పూజ బేగమ్ బజార్ వద్ద. సంతోష్ పహెల్వాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సతీష్ గౌడ్ గురుస్వామి, యోగేష్ యాదవ్, నిఖిల్ పాల్గొన్నారు.

# ప్రత్యేక చట్టాలకు దూరంగా ఆదివాసీలు

దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సాముండా, సంతాల్‌లు, తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడు తుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు. నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు, తరతరాలుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది. ప్రొఫెషనల్ అసిస్టెన్స్ ఫర్ డెవలప్‌మెంట్ యాక్షన్ ఏప్రిల్‌లో ప్రచురించిన స్టేటస్ ఆఫ్ ఆదివాసీ లైవ్లీహుడ్ రిపోర్ట్, 2021 ప్రకారం, భారతదేశం లోని ఆదివాసీ జనాభా ఆదివాసీయేతర జనాభాతో పోలిస్తే పేద జీవన ప్రమాణాలను కలిగి ఉంది. దేశ జనాభాలో 8.6% మంది షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) ఉన్నారు. వారిలో ఎక్కువ మంది 'కొండలు మరియు అడవులు' తెగలుగా వర్గీకరించ బడ్డారు. ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార?ండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 244 ఆదివాసీ సంఘాలు అధికంగా నివసించే ప్రాంతాలను గుర్తించాలని రాష్ట్రాన్ని ఆదేశిస్తుంది. ఈ ప్రాంతాలలో వారిని, వారి గుర్తింపును పెంపొందించడానికి, వారిని అభివృద్ధి ప్రక్రియలో ఏకీకృతం చేయాలని నిర్దేశిస్తుంది. ఆర్టికల్ 275 రాష్ట్రాలకు ఆర్థిక కేటాయింపులు చేయడానికి స్పష్టమైన నిబంధనలను చేస్తుంది. ఆర్టికల్ 275 కింద నిధులతో కేంద్ర మద్దతు ఉన్న గిరిజన ఉప ప్రణాళికలతో పాటు గిరిజన ప్రజల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి అనేక నిర్దిష్ట కార్యక్రమాలు రూపొందించి అమలు చేయబడ్డాయి. అయితే, ఈ ప్రయత్నాల ఫలితాలపై చాలా తక్కువ సమాచారం అందుబాటులో ఉందని నివేదిక ఎత్తి చూపింది. మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయ బడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించు కున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోని గిరిపల్లెలు నేటి ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో గత కేసీఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించింది. పోడు భూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంది కూడా. పోడు చేసుకుంటున్న ఆదివాసీలపై, పోడు భూముల్లో ఆదివాసీలు వేసుకున్న గుడిసెలను అటవీశాఖ అధికారులు తొలగించడం, దాడులు చేయడం, తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం, తమ గుడిసెలు తొలగించవద్దంటూ అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేయడం అక్కడక్కడా చోటు చేసుకుంటు న్నాయి. 1/70, పీసా, అటవి హక్కుల చట్టం అమలు చేయాలని, ఏజెన్సీలో భూ దురాక్రమణపై కమిటీ వేయాలని,ఏజెన్సీ ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా కలిపి స్వయం పాలన కల్పించాలని, ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులు సంపూర్ణంగా ఆదివాసీలకే కేటాయించాలని, గొండు, కోయ వారికి పదో తరగతి వరకు వారి మాతృభాషలోనే బోధన చేయాలని, జిఒనెం.3ని అమలు చేయాలని ఆదివాసీలు చేసే డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తూ, గిరిజన అభివృద్ధికి ఇతోధిక సంక్షేమ కార్యక్రమాల అమలు అనివార్యంగా, అత్యవసరంగా చేయాల్సి ఉంది.

## జైపూర్ కృత్రిమ కాలు సృష్టికర్త సేథీ

తెలుగు చలన చిత్ర రంగంలో ఒక మరుపురాని అద్భుత చిత్రరాజం మయూరి. ఆ రోజుల్లో ఆ సినిమా ఒక సంచలనం. సింగీతం శ్రీనివాస రావు దర్శకత్వంలో ఉషాకిరణ్ మూవీస్ పతాకంపై రామోజీరావు నిర్మించగా, 1985లో విడుదల చేసిన చిత్రం. నర్తకియైన సుధా చంద్రన్ నిజ జీవితం ఆధారంగా సహజత్వం ఉట్టిపడేలా తీసిన చిత్రం. ప్రమాదం కారణంగా ఒక కాలు కోల్పోయిన స్థితిలో, నిరాశ నిస్పృహలకు లోను కాకుండా కృత్రిమ కాలు అమర్చుకుని, కష్ట పడి సాధన చేసి, కృత్రిమ కాలు తోనే నాట్య ప్రదర్శనలు ఇచ్చి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన నాట్య మయూరి జీవితమే ఆ సినిమా కథ నేపథ్యం. ఆ నర్తకే సుధా చంద్రన్. ఆమె జీవిత నేపద్యమే మయూరి సినిమా కథా వస్తువు. ఆ సినిమాలో మయూరి పాత్ర పోషించింది స్వయాన సుధా చంద్రన్ కావడమే విశేషం. సుధా చంద్రన్ జైపూర్ వెళ్ళి కృత్రిమ కాలును అమర్చు కోవడాన్ని మయూరి సినిమాలో చూస్తాం. ఆ కృత్రిమ పాదం, కాలు రూపకర్త ఎవరో చాలా మందికి తెలియదు.

ఆయనే... కాళ్ళు కోల్పోయిన ఎందరికో, కృత్రిమ కాళ్ళు అమర్చి వారి జీవితాలలో వెలుగులు నింపిన, దేశం గర్వించ దగిన ప్రముఖ శస్త్ర వైద్యుడు పి.కె.సేథీగా పేరెన్నిక గన్న ప్రమోద్ కరణ్ సేథీ. ప్రమోద్ కరణ్ సేథీ (నవంబర్ 28, 1927 - జనవరి 7, 2007) భారతీయ శస్త్ర వైద్యుడు, జైపూర్ కృత్రిమ పాదం (జైపూర్ ఫూట్) సృష్టికర్త. 1927, నవంబర్ 28 న ఉత్తర ప్రదేశ్ లోని వారణాసిలో జన్మించాడు. కాళ్ళు కోల్పోయిన అనేక మందికి కృత్రిమ కాలు అమర్చి ఎందరికో నడక నేర్పిన సేథీ గిన్నిస్ బుక్ రికార్డులో కూడా నమోదు కా బడి, ప్రశంసాపత్రం అందుకున్నాడు. 1981లో సామా జిక సేవా రంగంలో ఆసియా లోనే అత్యుత్తమమైన మెగ్సేసే అవార్డు కూడా అయన పొందాడు. భారత ప్రభుత్వం ఆయన సేవలను గుర్తిం చి పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. పుట్టుకతోనే కాలు లేకుండా జన్మించిన వికలాంగులకు, విధి వంచితులై, ఎన్నో రకాలుగా కాళ్ళు కోల్పోయిన వారికి, ఎందరో సైనికు లకు, దాడుల్లో గాయపడిన అమా యకులకు ఇలా ఎందరికో, అంగ వైకల్యం కలుగ కుండా, తిరిగి నడక నేర్పాడు, జీవితాలలో వెలుగు ప్రసాదించాడు సేథీ. ఎముకల వైద్య నిపుణుడైన సేథీ 1969లో పరిచితుడైన, నిరక్ష్యరా స్యుడైన చేతివృత్తి నిపుణుడు రామచంద్ర శర్మతో కలిసి జైపూర్ పాదాన్ని తయారు చేశాడు. కొత్త ఆవిష్కరణకు తెర లేపాడు. అంతకు ముందు, జైపూర్ పాదం తయారు చేయడానికి ముందు కృత్రిమ కాలు అమర్చు కోవాలంటే ఖర్చు ఎక్కువగా అయ్యేది. దీన్ని దృష్టిలో పెట్టుకొని సేథీ... రబ్బరు, చెక్క, అల్యూమినియంతో కృత్రిమ పాదం తయారుచేసి తక్కువ ధరలో సామాన్యులకు అందు బాటులో ఉండేలా కృషి చేశాడు. 1975 వరకు కూడా ఈ కృత్రిమ పాదాన్ని అమర్చుకున్న వారు చాలా తక్కువే. అఫ్ఘనిస్తాన్ యుద్ధం తరువాత జైపూర్ ఫుట్ ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. ఈ యుద్ధంలో సోవియట్ యూనియన్ (ప్రస్తుత రష్యా) అమర్చిన మందు పాతరల వల్ల కాళ్ళు కోల్పోయిన అనేక మందికి అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంస్థ జైపూర్ ఫుట్‌లను అమ ర్చింది. కార్గిల్ యుద్ధంలో కాళ్ళు కోల్పోయిన అనేక సైనికులు కూడా జైపూర్ పాదాలనే అమర్చు కున్నారు. ప్రముఖ నటి సుధా చంద్రన్ కూడా జైపూర్ ఫుట్‌నే అమర్చుకొని మయూరి చిత్రంలో నటించి పలువురి ప్రశంసలు అందుకొన్న విషయం తెలిసిందే.

ప్రమోద్ కరణ్ సేథీ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించగా, అత్య ధికులకు కృత్రిమ అవయవం అమర్చినందులకు సేథీ పేరును గిన్నిస్ బుక్ లో రికార్డు చేశారు. ఆసియాలోనే అత్యుత్తమమైన మెగ్సేసే అవార్డు కూడా సేథీని వరించింది. డాక్టర్ బిసి రాయ్ అవార్డు ప్రముఖ వైద్య ఉపాధ్యాయుడిగా, 1979, పద్మశ్రీ - ప్రభుత్వం ఆఫ్ ఇండియా 1981, మాగ్సేసే అవార్డు - మనీలా, 1981, సైంటిఫిక్ అచీవ్‌మెంట్ కోసం గిన్నిస్ అవార్డు, 1982. (రాజస్థాన్ విశ్వ విద్యా లయం) 1982, అత్యుత్తమ వైద్య పరిశోధనలకు ఆర్.డి.బిర్లా అవార్డు,1984, నాడ్ జాన్సెన్ లెక్చర్ అండ్ మెడల్ వరల్డ్ కాంగ్రెస్ ఆన్ ప్రోస్తేటిక్స్ అండ్ ఆర్థోయిటిక్స్, కోబ్, జపాన్ 1989, డాక్టర్ బిసి రాయ్ నేషనల్ అవార్డు ఆఫ్ ది ఇమినెంట్ మెడికల్ మ్యాన్ ఆఫ్ ది ఇయర్ న్యూ ఢిల్లీ 1989, డాక్టర్ బి. ముఖోపాధ్యాయ ఓరేషన్ ఆర్థో పెడిక్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ - బరోడా 1998, గౌరవ ఫెలోషిప్, ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ 1999, ప్రపంచ అండర్స్టాండింగ్ మరియు శాంతికి రోటరీ అంతర్జాతీయ అవార్డు శాన్ ఆంటోనియో, యుఎస్ఎ 2001, 20 వ శతాబ్దంలో అత్యుత్తమ పరిశోధనా శాస్త్రవేత్తకు అవార్డు - ఆర్థోపెడిక్ రీసెర్చ్ అండ్ ఎడ్యు కేషన్ ఫౌండేషన్ - పాట్నా 2002, నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఇండియా - 2004, లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు ఆఫ్ ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసి యేషన్, డిసెంబర్ 2004 తదితర ఎన్నో అవార్డులను ఆయనను వరించాయి. కాళ్ళు కోల్పోయిన ఎందరికో కృత్రిమ కాళ్ళు అమర్చి వారి జీవితాలలో వెలుగులు నింపిన సేథీ 2007, జనవరి 7 న జైపూర్‌లో మరణించారు.

# చట్టసభల్లో అరుదైన నేత పాపిరెడ్డి

అవిభక్త ఆంధ్రప్రదేశ్ సీనియర్ రాజకీయ నాయకులు బెజవాడ పాపిరెడ్డి జయంతి, వర్ధంతి రెండు రోజుల తేడాతో వస్తాయి. అన్ని చట్టసభల్లో సభ్యుడిగా ఎంపికై రికార్డు సృష్టించిన నేతగా బెజవాడ బాపిరెడ్డి చరిత్ర పుటల కెక్కారు. రాజకీయాలకు చిరునామాగా, మచ్చలేని నేతగా పాపిరెడ్డి గుర్తింపు పొందారు. విలువలకు మారు పేరుగా నిలిచారు. తెలుగు దేశం స్థాపనా సమయంలో పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుకు పార్టీ గుర్తుగా సైకిల్ ను సూచించింది పాపిరెడ్డి కావడం గమనార్హం. బెజవాడ పాపిరెడ్డి 1927, జనవరి 5 న నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెంలో జన్మించారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలి, శాసనసభ, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై వివిధ చట్ట సభ లలో పనిచేసిన అనుభవం గడించారు. 1958 నుంచి 1962 వరకు శాసనమండలి సభ్యుడిగా, 1967 నుంచి 1972 వరకు అల్లూరు శాసనసభ్యుడిగా, 1972 నుంచి 1978 వరకు రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు. ఈ మూడింటిలో కూడా ఆయన ఇండిపెండెంట్‌గానే గెలవడం విశేషం. 1969-72లో బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఆంధ్ర ప్రదేశ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ బాధ్యునిగా, 1976-77లో పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ, 1977-78 పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యునిగా పని చేశారు. 1983-84 లో ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ గా ఉన్నారు. ఆదినుండి జాతీయ కాంగ్రెస్ వ్యతిరేక నేతగా రాజకీయాల్లో మన గలిగిన పాపిరెడ్డి, తెలుగు దేశం ఆవిర్భావంతో ఎన్టీఆర్ ఆహ్వానం మేరకు 1983లో ఆ పార్టీలో చేరారు. తెలుగుదేశం పార్టీని ప్రారంభించే సమయానికి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక రాజకీయాల్లో రాటు తేలిన నాయకునిగా కొనసాగుతున్న బెజ వాడ పాపిరెడ్డి గురించి తెలుసు కుని, ఆయన అనుభవాన్ని, అవసరాన్ని గుర్తించి, ఎన్టీఆర్, బెజవాడ పాపిరెడ్డిని తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించి, సముచిత గౌరవంగా పార్టీ ఉపాధ్యక్ష పదవిని అప్పగించారు. ఎన్టీ రామారావు రాజకీయ పార్టీ స్థాపించిన తర్వాత తొలిసారిగా 1983 ఎన్నికల్లో పోటీ చేసే సమయంలో ఎన్నికల గుర్తు కోసం ఆలోచిస్తున్న సమయంలో పాపిరెడ్డి సైకిల్ ను ఎన్నికల గుర్తుగా పెట్టాలని సూచించారు. 1967లో ఆయన అల్లూరు నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థి గా సైకిల్ గుర్తు'పై విజయం సాధించిన నేపథ్యంలో పాపిరెడ్డి సెంటిమెంట్ ను అనుసరించి ఈ సూచన చేయగా, ఎన్టీ రామారావు పాపిరెడ్డి సూచనను వెంటనే ఆమోదించి సైకిల్ ను తెలుగు దేశం పార్టీ ఎన్నికల గుర్తుగా ప్రకటించారు. ఆయన 1983 నుంచి 1985 వరకు తెలుగుదేశం ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 1983లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ప్రథమంగా రాజ కీయ పార్టీ పక్షాన అల్లూరు నుంచి శాసనసభకు పోటీ చేసి గెలు పొందారు. పాపిరెడ్డి పార్టీ ఆదేశాను సారం 1984లో ఒంగోలు లోక్‌సభ స్థానానికి పోటీ చేసి విజయం సాధించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నెల్లూరు జిల్లాలో సంగం ఆనకట్ట నుండి కావలి ప్రాంతానికి సాగు, తాగు నీటిని తీసుకు వెళ్లి, కావలి కాలువకు బెజవాడ పాపిరెడ్డి పేరు పెట్టడం ద్వారా ఆయనకు సముచిత గౌరవం కల్పించారు. బెజవాడ పాపిరెడ్డి అస్వస్థత కారణంగా 75 ఏట 2002, జనవరి 7 న హైదరాబాదులో మరణించారు.

## ప్రజాబలం దిన పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ





ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 06 : మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నివాసంలో ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి సుద్దపల్లి వేణుగోపాల్ అధ్వర్యంలో సోమవారం రోజున ప్రజాబలం దిన పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ శాఖ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి కాంగ్రెస్ పార్టీ ఫోర్ లీడర్ చెల్ల నాగభూషణం,మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చంద్,వైస్ చైర్మన్ ఎండీ ఆరిఫ్,లక్షెట్టిపేట మండల అధ్యక్షుడు పింగళి రమేష్,జిల్లా నాయకుడు ముద్దసాని వేణు,యంగ్ డైనమిక్ లీడర్స్ ముత్తె వేంకటేష్, చుంచు నగేష్,అత్తర్ సింగ్,రాజు,సీనియర్ నాయకుడు ముద్దసాని మౌళి సార్, మోటపలుకుల కమలాకర్,సుద్దపల్లి వెంకటేష్,బుద్దె శ్రీనివాస్,చారి,వివిధ పట్టణ,గ్రామాల నాయకులు కార్యకర్తల అధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది.

## సంక్రాంతికి సిద్ధమౌతున్న బరులు

ఏలూరు, జనవరి 6,సంక్రాంతి అంటే ఆంధ్రప్రదేశ్ లో కోడిపందేలు గుర్తుకు వస్తాయి. ఏపీలో సంక్రాంతి అంటే కోడి పందేలు లేకుండా జరగవు. అప్పుడే పందెం కోళ్లు రెడీ అయిపోయాయి. బరులు కూడా సిద్ధమవుతున్నాయి. గ్రామ స్థాయిలో ఉన్న నేతల నుంచి ఎమ్మెల్యేల వరకూ సొంత బరులను ఏర్పాటు చేసుకుని కోడిపందేలను నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నారు. సంక్రాంతి అంటేనే ఆంధ్రప్రదేశ్ లో పెద్ద పండగ. మూడు రోజుల పాటు జరిగే ఈ పండగలో అనేక విశిష్టతలున్నప్పటికీ సంక్రాంతి సంబరాల్లో ముఖ్యంగా గుర్తుకొచ్చేది కోడి పందేలు. పందె కోళ్లు కాలు దువ్వుతుంటే మీసం మీద మెలేసిన చేయి దించకుండా ఎన్నికల్లో గెలిచినట్లే ఫీలవుతారు చాలా మంది. కోడి పందేలు లేకుండా పండగ లేదు. పండగ అంటేనే కోడి పందేలు అనే రకంగా మారింది. కోడిపందేలకు ఉభయ గోదావరి జిల్లాల ప్రసిద్ధి. ప్రత్యేకంగా ఇందుకోసం బరులను తయారు చేస్తారు. ఎలా ఉంటాయంటే.. ఖరీదైన కార్లు.. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ ఈ కోడిపందేలకు హాజరవుతారు. కేవలం ఏపీ నుంచి మాత్రమే కాదు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలో ఉన్న వారితో పాటు విదేశాల్లో ఉన్న తెలుగు వాళ్లు సయితం కోడిపందేలు చూసేందుకు తరలి వస్తారు. కోడిపందేలు చూడకపోతే పండగ సక్రమంగా జరగనట్టేనని భావిస్తారు. అందుకే సంక్రాంతి పండగ వేళ జరుగుతున్న కోడి పందేల కోసం వేల సంఖ్యలో జనం ఎదురు చూస్తుంటారు. కోడి పందేల కోసం ఏడాదంతా కోడి పుంజులను బరిలోకి దింపేందుకు సన్నద్ధం చేస్తుంటారు. వాటికి బలిష్టమైన ఆహారం ఇవ్వడంతో పాటు వివిధ రకాల ఎక్సర్‌సైజులు కూడా చేయిస్తారు. స్విమ్మింగ్ కూడా చేయిస్తారు. పందెం కోళ్లను సిద్ధం చేయడానికి ప్రత్యేకంగా కొందరిని నియమించుకుంటారు. వేల రూపాయలు జీతాలిచ్చి వీరిని అందుకోసమే వినియోగిస్తారు..

ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగే కోడి పందేలలో కోట్లాది రూపాయలు చేతులు మారతాయి. కేవలం డబ్బులే కాదు... గెలిచి వచ్చిన కోడిని ఊరేగింపుగా తీసుకెళ్లి తన ఇంట్లో మనిషిగా చూసుకుంటారు. అలాంటి కోడిపందేల కోసం ఇప్పుడే అంతా సిద్ధమయింది. పోలీసులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తారు. అధికార పార్టీ నేతలు బరులను ఏర్పాటు చేయడంలో ముందుంటారు. పార్టీకి చెందిన అభిమానులు, కార్యకర్తలు ఆ బరుల వద్దకు వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే ఈ పందేలను చూసేందుకు పొరుగు రాష్ట్రాల నుంచి మంత్రులు కూడా తరలి వస్తుంటారు. కోనసీమ కూడా కోడిపందేలకు ప్రసిద్ధి. ముందుగానే భీమవరం, నరసాపురం, రాజమండ్రి ప్రాంతాల్లో హోటల్ రూమ్ లుకూడా ముందుగానే బుక్ చేసుకుని సంక్రాంతికి వెళ్లేందుకు ఇప్పటి నుంచే ప్లాన్ చేసుకుంటున్నారు అనేక మంది. ఫ్లైట్ టిక్కెట్ లు కూడా ముందుగానే బుక్ అవుతున్నాయి.అక్కడ ఏ సౌకర్యాలున్నాయన్న దానిపై సోషల్ మీడియాలో ఇప్పటికే ప్రచారం మొదలయింది. ఫుడ్ దగ్గర నుంచి అన్ని రకాలుగా వినోదాలను బరుల దగ్గర సిద్ధం చేస్తున్నారు. దీంతో సంక్రాంతి పండగకు ఉభయ గోదావరి జిల్లాలకు వెళ్లే వారికి సులువుగా సమాచారం లభిస్తుంది. ఇప్పటికే భీమవరం, ఏలూరు వంటి నగరాల్లో ప్రధాన లాడ్జీలన్నీ ముందుగానే బుక్ అయిపోయాయి. పందెంరాయుళ్లు సంక్రాంతి మూడు రోజులు కోడిపందేలు చూస్తూ కాలక్షపం చేస్తుంటారు. పందేలు కాస్తుంటారు. కొందరు అక్కడ దొరికే పసందైన ఫుడ్ ను తింటారు. మద్యంకూడా అక్కడే అందుబాటులో ఉండటంతో ఇక ముక్కతో పాటు మందు కూడా సేవించి ఫుల్లు ఎంజాయ్ చేస్తారు. పోలీసులు ఎప్పటిలాగానే ఈసారి కూడా కోడిపందేలపై ఆంక్షలున్నాయని చెబుతున్నా బరులు మాత్రం సిద్ధమవుతున్నాయి. ఇక వాటిని చూసి రావడమే మిగిలింది.

# ఆరోగ్యశ్రీ స్థానంలో ఇన్సూరెన్స్...

విజయవాడ, జనవరి 6,ఆరోగ్యశ్రీ కన్నా మెరుగైన హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తుంది కూటమి ప్రభుత్వం చెబుతోంది. అయితే ఆరోగ్య శ్రీ కంటే ఎలా మెరుగైందో చెప్పాలంటూ విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఆరోగ్య శ్రీ వల్ల ప్రభుత్వ ఖజానా పై భారం పడుతుంది. ప్రయివేటు ఆసుపత్రులకు కోట్ల రూపాయల నిధులను చెల్లించాల్సివస్తుంది. ఏటా వందల కోట్ల రూపాయలు దీనికి ఖర్చు చేయాల్సి వస్తుంది. అందుకే దీనికి విరుగుడుగా ఆరోగ్య శ్రీని ఎత్తివేసి ఎన్టీఆర్ హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని అమలుచేయాలన్న ఆలోచనను చేస్తుంది. అయితే దీనిని ప్రయివేటు ఆసుపత్రులతో పాటు బీమా కంపెనీలు కూడా ఏ మేరకు సహకరిస్తాయన్నది మాత్రం అనుమానంగానే ఉంది. సహజంగా బీమా అంటేనే పూర్తి స్థాయిలో డబ్బులు రావు.అయితే బీమా సౌకర్యం ఉంటే ముందు చికిత్స ప్రారంభిస్తారు. అలాగే ఆరోగ్య శ్రీ కార్డు ఉన్నప్పటికీ అదే తరహాలో చికిత్సను ప్రారంభిస్తారు. అయితే ఆరోగ్య శ్రీ కింద చికిత్స అందితే ఆ సొమ్మును ప్రభుత్వం ఆ ఆసుపత్రికి అందచేయాల్సి ఉంటుంది. ఆరోగ్య శ్రీ పథకం దుర్వినియోగం అయినట్లు కూడా అనేక వార్తలు వచ్చాయి. వైద్యం అందించకుండానే దొంగ బిల్లులు పెట్టి అనేక ఆసుపత్రులు ప్రభుత్వ సొమ్మును దోచుకుంటున్నట్లు గతంలో ఆరోపణలు వినిపించాయి. దీనిని అరికట్టేందుకు బీమా సౌకర్యం ఒకరకంగా మేలు చేస్తుందన్నది వాస్తవమే. ఎందుకంటే బీమా కంపెనీలు కేవలం ప్రీమియం ప్రభుత్వం చెల్లిస్తే చాలు వైద్యానికి అయ్యే ఖర్చులో కొంత మొత్తాన్ని చెల్లిస్తుంది. దాదాపు ఎనభై శాతం డబ్బులు చెల్లించే బీమా కంపెనీలున్నాయి. అయితే కొన్ని రకాల వ్యాధులకు మాత్రమే బీమా సౌకర్యం లభిస్తుంది. ఆసుపత్రి యాజమాన్యాలు ఇప్పటికే ఈ విషయాన్ని స్పష్టం చేయడం కూడా ఒకింత ఆందోళన కలిగిస్తుంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు ఒక కోటి 43 లక్షల కుటుంబాలు ఉన్నాయి వీరందరి తరుపున కూటమి ప్రభుత్వమె హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం కడుతుంది. ఒక్కొక్క కుటుంబానికి ఏడాదికి 2.5 లక్షల వరకు లబ్ది చేకూరుతుంది .అంతకు మించితే ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా మిగిలిన మొత్తం చెల్లిస్తుంది. దీని వల్ల లబ్దిదారుడికి ఒక్క రూపాయి కూడా అదనంగా పడదని చెబుతుంది. ప్రైవేట్ గా హెల్త్ ఇన్సూరెన్స్ కట్టేవారికి ఇటువంటి సదుపాయాలు వస్తాయో అంతకుమించి ప్రయోజనాలు కూటమి ప్రభుత్వం కలిస్తుంది. గత ప్రభుత్వంలో వైద్యం కోసం ఆరోగ్యశ్రీ కి సంబంధించిన నెట్ వర్క్ హాస్పిటల్స్ కి వెళ్తే చికిత్స అంత తొందరగా చేసేవారు కాదు ప్రభుత్వం నుంచి వారికి డబ్బులు అంతో ఇంతో పడితేనే చికిత్స చేసేవారు ఈ విధానినికి స్వస్తి చెప్పామని కూటమి ప్రభుత్వం చెబుతోంది.. ప్రజలకు కావాల్సింది మెరుగైన వైద్యం, విద్య ఇవ్వన్నీ కూటమి ప్రభుత్వం చేస్తుందని అధికార పార్టీ చెబుతున్నప్పటికీ బీమా అనగానే ప్రజల్లో ఒకరకమైన ఆందోళన నెలకొంది. దీంతో పాటు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో కొన్ని బీమా కంపెనీలకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఇలా బీమా సౌకర్యం ఏర్పాటు చేయడంలోనూ అనేక ఇబ్బందులున్నాయి. బీమా మొత్తం కంపెనీ చెల్లించడానికి నిరాకరిస్తే ఆ మొత్తాన్ని ఆసుపత్రి యాజమాన్యం రోగి బంధువుల నుంచి వసూలు చేసే అవకాశాలు లేకపోలేదంటున్నారు. మొత్తం మీద ఆరోగ్య శ్రీని ఎత్తివేసి దాని స్థానంలో బీమా సౌకర్యం కల్పించడంలో కొంత సర్కార్ ఖజానాకు చిల్లు పడే అవకాశం తప్పుతున్నా ప్రజలకు మాత్రం ఇబ్బందులు తప్పవని వైద్యులు చెబుతున్నారు. దీనిని అమలు చేస్తే గాని దానిలోని లోపాలు, లొసుగులు బయటకువచ్చే అవకాశం లేదు.

# సాగర తీరంలో సింగిల్ ఫ్రేమ్...

విశాఖపట్టణం, జనవరి 6, మూడు పార్టీల ముఖ్యనేతలు. మరోసారి ఒకే ఫ్రేమ్‌లో కనిపించబోతున్నారు. ఆరు నెలల కింద ఎన్నికలప్పుడు విజయవాడలో రోడ్ షో చేసిన ఆ నేతలు..ఇప్పుడు మళ్లీ సాగర తీరంలో సింగిల్ ఫ్రేమ్‌లో ఆకట్టుకోబోతున్నారు. ఆ అద్భుత సన్నివేశం కోసం మూడు పార్టీల నేతల క్యాడర్ వెయిట్ చేస్తున్నారు. మరోసారి ముగ్గురు అగ్రనేతలు ఒకే వేదిక మీద కనిపించబోతున్నారు. ఒకే ఫ్రేమ్‌లో వాళ్ల అభిమానుల్లో, పార్టీ శ్రేణుల్లో ఆనందం నింపబోతున్నారు. ఇంతకీ ఆ ముగ్గురు ఎవరంటే ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. ఈ ముగ్గురు ఒకే ఫ్రేమ్‌లో కనిపించడం సమ్‌థింగ్ స్పెషలే. ముఖ్యంగా ఏపీ ఎన్నికల సమయంలో పవన్, మోదీ డిస్కషన్.. వీడియోస్, ఫొటోస్ ఎంతగా వైరల్‌గా మారాయో తెలియంది కాదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కలిసి రోడ్ షో చేసిన ఈ ముగ్గురు నేతలు..ఇప్పుడు మరోసారి ఒకే డయాస్ మీద అట్రాక్ట్ చేయబోతున్నారు.ఈ నెల 8న ప్రధాని మోదీ విశాఖ పర్యటన ఖరారైంది. షెడ్యూల్ కూడా ఫిక్స్ అయింది. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, శంకుస్థాపన కోసం వస్తున్న ప్రధాని మోదీ.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌తో కలసి రోడ్‌షో చేయబోతున్నారు. అయితే ఏపీ ఎలక్షన్స్‌కు ముందు ఈ ముగ్గురు లీడర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. అందులో పబ్లిక్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆ తర్వాత ఎన్నికల్లో కూటమి బంపర్ విక్టరీ సాధించింది.కూటమి ప్రభుత్వం ఏర్పాటు సందర్భంగా ఏపీకి వచ్చిన ప్రధాని..ఆ తర్వాత ఈ ఏడాదిలో మొదటిసారి విశాఖకు రానున్నారు. భారీ విజయం దక్కించుకున్న కూటమి నేతలు చేయబోయే ర్యాలీపై ఇప్పుడు క్యాడర్‌లో ఎంతో ఆసక్తి ఏర్పడింది. అందుకు తగ్గట్లుగానే జనవరి 8న నిర్వహించే మోదీ, బాబు, పవన్ రోడ్‌షోకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. విజయోత్సవ ర్యాలీలాగా జరిపేలా సన్నాహాలు చేస్తున్నారు.ప్రధాని 8న మధ్యాహ్నం 3 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి నేరుగా ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌కు చేరుకుంటారు. ఔఖఅ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుతో పాటు రైల్వేజోన్ పరిపాలన భవనాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసి, బహిరంగ సభలో ప్రసంగిస్తారు.ఆర్నెళ్ల పాలనలో సాధించిన విజయాలపై వివరించేందుకు రెడీ అవుతున్నారు కూటమి నేతలు. సభకు లక్ష మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఆశీల్‌మెట్టలో గల సంపత్ వినాయక్ ఆలయం నుంచి సభా ప్రాంగణం వరకూ ఓపెన్‌టాప్ వాహనంలో ప్రధాని రోడ్‌షో నిర్వహించనున్నారు. ఆయనతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ రోడ్‌షోలో పాల్గొంటారు.ప్రధాని టూర్‌ను గ్రాండ్ సక్సెస్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తుంది ఏపీ సర్కార్. ముగ్గురు మంత్రులతో పర్యవేక్షణ కమిటీని నియమించింది రాష్ట్ర ప్రభుత్వం. జన సమీకరణ బాధ్యతను స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలకు అప్పగించారు. అయితే రోడ్ షోలో ముగ్గురు నేతలు ఒకే ఫ్రేమ్‌లో కనిపించబోతుండటంతో..కూటమి పార్టీల క్యాడర్‌లో జోష్ కనిపిస్తోంది. అటు బీజేపీ క్యాడర్, లీడర్లు కూడా మోదీ టూర్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.అటు పవన్ ఫ్యాన్స్ కూడా తమ నేత రాక కోసం వెయిట్ చేస్తున్నారు. కూటమి రథసారధిగా చంద్రబాబు ఇచ్చే స్పీచ్‌పై వైజాగ్ ప్రజల్లోకి ఆసక్తికర చర్చ జరుగుతోంది. అటు ప్రధాని మోదీ వరాలు ప్రకటిస్తారని.. స్టీల్ ప్లాంట్‌పై ఏదైనా ప్రకటన చేస్తారని భావిస్తున్నారు ప్రజలు. చూడాలి మరి మోదీ టూర్‌ను కూటమి నేతలు రేంజ్‌లో సక్సెస్ చేయబోతున్నారో.

పిన్ టూ పిన్ ప్రోగ్రామ్ ఇదే

ఏపీలో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఈనెల 8న విశాఖ రానున్నారు. ఏపీ సీఎం గా చంద్రబాబు ప్రమాణస్వీకారం కార్యక్రమానికి మోడీ హాజరయ్యారు. అటు తరువాత ఏపీకి రావడం ఇదే తొలిసారి. ఏపీలో ప్రధాని పర్యటనకు సంబంధించి షెడ్యూల్ కూడా ఖరారు అయ్యింది. లక్ష కోట్ల పెట్టుబడులకు సంబంధించి శంకుస్థాపనలు చేయనున్నారు మోదీ. అలాగే నగరంలో రోడ్ షో కూడా ప్లాన్ చేశారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్లో భారీ బహిరంగ సభ జరగనుంది. ఏపీకి సంబంధించి ప్రధాని మోదీ కీలక ప్రకటనలు చేస్తారని అంచనాలు ఉన్నాయి. సాయంత్రం 4:15 గంటలకు విశాఖలోని ఐఎన్‌ఎస్ డేగాలో దిగుతారు. ఈ సందర్భంగా ప్రధానికి రాష్ట్ర గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం, ఇతర ప్రముఖులు స్వాగతం పలుకుతారు. ఈ సందర్భంగా నేవీ నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరిస్తారు. అటు తరువాత అక్కడ నుంచి రోడ్ షో బహిరంగ సభ వేదికకు చేరుకోనున్నారు ప్రధాని మోదీ. ప్రధాని పర్యటనకు సంబంధించి ఇన్చార్జిగా మంత్రి నారా లోకేష్ వ్యవహరించనున్నారు.నగరంలోని ప్రధాన జంక్షన్ లను కలుపుతూ మోడీ పర్యటన కొనసాగనుంది. తాటి చెట్ల పాలెం జంక్షన్, సంపత్ వినాయక్ గుడి, దత్త ఐలాండ్ మీదుగా.. ఏయూ ఎకనామిక్స్ విభాగం ఎదురుగా ఉన్న వెంకటాద్రి వంటిల్లు వరకు.. రోడ్డు షోలో పాల్గొంటారు ప్రధాని మోదీ. ఓపెన్ టాప్ వాహనంపై ప్రజలకు అభివాదం చేస్తూ సాగుతారు. త్రీ టౌన్ జంక్షన్ మీదుగా ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానానికి చేరుకుంటారు.కాగా ఈ రోడ్డు షోకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఓపెన్ టాప్ వాహనంపై ప్రధాని మోదీ తో పాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ సైతం పాల్గొనే అవకాశం ఉంది. సాయంత్రం 5:30 నుంచి 6:30 గంటల వరకు ప్రధాని సభా ప్రాంగణంలోనే ఉంటారు. పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. సాయంత్రం 6:30 గంటలకు సభ ముగిసిన తరువాత రోడ్డు మార్గాన ఎయిర్పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి ఢిల్లీ బయలుదేరి వెళ్తారు. కాగా ఇది పూర్తి అధికారిక పర్యటన. రాజకీయ ప్రసంగాలు ఉండవని తెలుస్తోంది.ప్రధాని పర్యటన వేళ ఏపీకి సంబంధించి చాలా రకాల ప్రాజెక్టులకు ప్రధాని మోదీ సానుకూలత వ్యక్తం చేసే అవకాశం ఉంది. ఇప్పటికే అమరావతి తో పాటు పోలవరం అంశాల్లో కేంద్రం సాయం ప్రకటించింది. అయితే పెండింగ్ ప్రాజెక్టులు చాలా ఉన్నాయి. ముఖ్యంగా విశాఖ స్టీల్ అంశం పెండింగ్లో ఉంది. దీనిపై ప్రధాని మోదీ స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. అందుకే ప్రధాని పర్యటనపై అంత ఉత్కంఠ కొనసాగుతోంది.

# మార్చి 12 నుంచి పిఠాపురంలో జనసేన ప్లీనరి

కాకినాడ, జనవరి 6, లో సంచలన విజయం సాధించింది జనసేన పార్టీ. ఆ పార్టీ ఆవిర్భావం నుంచి డిజాస్టర్ ఫలితాలను సాధిస్తూ వచ్చింది. సుదీర్ఘ విరామం తర్వాత ఈ ఎన్నికల్లో శత శాతం విజయాన్ని సాధించింది. దీంతో ఏపీ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా మారింది. వాస్తవానికి ఆ పార్టీ విషయంలో జరిగిన విషప్రచారం అంతా అంతా కాదు. అది ఒక పార్టీయేనా అన్నంతగా ప్రచారం నడిచింది. ఎన్నెన్నో అవమానాలు పడ్డారు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్. వాటన్నింటిని అధిగమించి సాలిడ్ విజయాన్ని అందుకున్నారు. తెలుగు నాట తిరుగులేని రాజకీయ శక్తిగా జనసేన ను నిలిపారు. ఈ క్రమంలో ఆ పార్టీ ప్రతి అడుగు సాహసమే. ప్రతికూల ఫలితాలను చవిచూసిన ఆ పార్టీ.. అనతి కాలంలోనే తిరుగులేని రాజకీయ శక్తిగా మారింది. ఏపీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించింది.2014 ఎన్నికల నాటికి జనసేన ఒక సామాన్య సంస్థగా ఆవిర్భవించింది. అప్పటికే ఎన్నికలు సమీపించడంతో రాష్ట్రంలో టిడిపి, కేంద్రంలో బిజెపికి మద్దతు తెలిపింది. ఆ పార్టీ మద్దతుకు అనుగుణంగా రెండు చోట్ల అనుకూల ప్రభుత్వాలు వచ్చాయి. అయినా సరే జనసేన ఒక సామాన్య పార్టీగా ప్రజల మధ్యకు వెళ్లేందుకు ప్రయత్నించింది. తాము మద్దతు తెలిపిన పార్టీలు అధికారంలోకి వచ్చిన ఎన్నడు దానిని సొంత అవసరాలకు ఉపయోగించుకోలేదు. 2019 ఎన్నికల్లో ఒంటరిగా బరిలో దిగింది జనసేన. కనీస స్థాయిలో కూడా ఉనికి చాటుకోలేదు. దారుణ పరాజయాన్ని చవిచూసింది. అయినా సరే మొక్కవోని దీక్షతో గత ఐదేళ్లుగా ప్రజా సమస్యలపై పోరాటం చేసింది. టిడిపి తో పాటు బిజెపితో జతకట్టింది. కూటమిగా ముందుకు కదిలింది. వైసీపీకి దారుణంగా దెబ్బతీసింది. పోటీ చేసిన 21 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించి తనకు తిరుగులేదని నిరూపించుకుంది. ఏపీలో ప్రభావవంతమైన రాజకీయ శక్తిగా నిలిచింది జనసేన.అయితే తాజాగా జనసేన విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. జనసేన ప్లీనరీని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. డిప్యూటీ సీఎం పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో మార్చి 12 నుంచి మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించాలని డిసైడ్ అయ్యారు. ఈ మేరకు పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దానికి చైర్మన్గా వ్యవహరిస్తున్న నాదెండ్ల మనోహర్ ఈ విషయాన్ని ప్రకటించారు. పార్టీ తిరుగులేని విజయం కనబరచడంతో ఈసారి ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని భావిస్తున్నారు. జనసేన బలోపేతంతో పాటు పార్టీలో భారీగా చేరికలు ఉంటాయని ప్రచారం జరుగుతోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# ఫిబ్రవరి మొదటి వారంలో జగన్ టూర్లు

గుంటూరు, జనవరి 6, జగన్ జిల్లాల పర్యటన ఎప్పుడు? సంక్రాంతి మూడో వారంలోనా? తరువాత చేస్తారా? ఇప్పుడు ఇదే ఆసక్తికర చర్చ. సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వస్తానని జగన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. జనవరి మూడో వారం నుంచి జిల్లాల పర్యటన చేయనున్నట్లు జగన్ ప్రకటించారు. 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో.. వారానికి రెండు రోజులపాటు బస చేస్తానని చెప్పుకొచ్చారు. దీంతో పార్టీ శ్రేణులు ఒక రకమైన ఉత్సాహం కనిపించింది. అయితే ఇప్పుడు రెండోవారం సమీపిస్తున్న ఎటువంటి సన్నాహాలు లేకుండా పోయాయి. పైగా తాజా పరిణామాలతో జగన్ జిల్లాల పర్యటన ఇప్పుడే కాదని తేలిపోయింది. దీంతో వైసీపీ శ్రేణుల్లో ఒకరకమైన అసంతృప్తి వ్యక్తం అవుతోందిఈ ఎన్నికల్లో వైసిపి దారుణంగా ఓడిపోయింది. కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఆ పార్టీకి దక్కలేదు. దీంతో చాలామంది నేతలు బయటకు వెళ్లిపోయారు. ఇంకొందరు సిద్ధంగా ఉన్నారు. ఇంకోవైపు కూటమి దూకుడుకు పార్టీ శ్రేణులు తట్టుకోలేకపోతున్నాయి. కేసులతోపాటు దాడులు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో పార్టీ క్యాడర్ కు భరోసా కల్పించేలా జిల్లాల పర్యటన చేయాలని జగన్ భావించారు. వారంలో రెండు రోజులపాటు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో గడపాలని డిసైడ్ అయ్యారు. ఇదే విషయం జగన్ స్వయంగా ప్రకటించడంతో పార్టీ శ్రేణులు కొంత ఆనందించాయి. తమకు అండగా నిలబడేందుకు అధినేత ముందుకు రావడాన్ని ఆహ్వానించాయి.అయితే ఇప్పుడు జగన్ జిల్లాల పర్యటన జనవరిలో లేనట్టేనని తేలిపోయింది. ఈనెల 11 నుంచి 2 వారాలపాటు జగన్ విదేశీ పర్యటనకు వెళ్ళనున్నారు. ఈ మేరకు ఆయన సిబిఐ కోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారు. తన విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈనెల 8న కోర్టులో విచారణ జరగనుంది. అందుకు అనుగుణంగా జగన్ విదేశీ పర్యటన కొనసాగే అవకాశం ఉంది. కోర్టు అనుమతిస్తే ఈ నెలాఖరు వరకు ఆయన విదేశాల్లో గడుపుతారు. నెల చివర్లోనే రాష్ట్రానికి చేరుకుంటారు. అప్పటికప్పుడు జిల్లాల పర్యటన అంటే వీలు పడే పరిస్థితి లేదు. జగన్ జిల్లాల పర్యటన ఫిబ్రవరిలో కానీ.. మార్చిలో కానీ ఉంటుందని పార్టీ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. అయితే ఈ విషయంలో పార్టీ వర్గాల్లో మాత్రం ఒక రకమైన అసంతృప్తి వ్యక్తం అవుతోంది

# భారత్ లో తగ్గిన పేదరికం...

భారత్ అభివృద్ధి చెందుతున్న భారత్ కాదు.. ఇప్పుడు అభివృద్ధి చెందిన భారత్. కొన్నేళ్లపాటు భారత్ అభివృద్ధి చెందుతున్న దేశంగానే గుర్తింపు పొందింది. గతంలో ఎన్‌సీఏఈఆర్ ఓ నివేదిక విడుదల చేసింది. తాజాగా ఎస్‌బీఐ కూడా ఈమేరకు నివేదిక సమర్పించింది.దశాబ్దాల కాలంలో భారత్ పేద దేశంగా గుర్తింపు పొందింది. ఇప్పటికీ పిల్లలు భారత్ అభివృద్ధి చెందుతున్న దేశంగానే పరిగణిస్తున్నారు. నాలుగేళ క్రితం ప్రపంచాన్ని వణికించిన కరోనా కారణంగా చాలా మంది జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ ఇండియాఇర్వహించిన సర్వేలో భారత్‌లో పేదరికం గణనీయంగా తగ్గిపోయింది. మేరకు నివేదిక తాజాగాడుదల చేసింది. 2024లో దేశంలో పేదరిక రేటు 5 శాతం కంటే దిగువకు పడిపోవడంతో, ఎస్‌బిఐ అధ్యయనం కూడా దేశంలో తీవ్రమైన పేదరికం కనిష్టస్థాయికి తగ్గినట్లు స్పష్టం చేసింది. ఇది "సమగ్ర స్థాయిలో" భారతదేశంలో పేదరికం రేట్లు ఇప్పుడు 4–4.5 శాతం పరిధిలో ఉండవచ్చు. భావిస్తున్నాం. దీంతో దాదాపు తీవ్రమైన పేదరికం అత్యల్ప స్థాయిలో ఉంది అని అధ్యయనం పేర్కొంది.కుటుంబాల వినిమయ వ్యయం సర్వే (హెచ్‌సిఇఎస్) నివేదిక ఆధారంగా గత కొన్నేళ్లలో గ్రామీణ, పట్టణ పేదరిక స్థాయిలలో గణనీయమైన తేడాలు వచ్చాయని ఎస్‌బిఐ సర్వే హైలెట్ చేసింది. సర్వే ప్రకార గ్రామీణ పేదరికం 2024 ఆర్థిక సంవత్సరంలో 4.86 శాతంగా అంచనా వేయగా, ఇది 2023 ఆర్థిక సంవత్సరంలో 7.2 శాతంగా, 2012 ఆర్థిక సంవత్సరంలో 25.7 శాతం కంటే గణనీయంగా తగ్గింది. గడిచిన 12 ఏళ్ల క్రితం భారత్‌లో పేదరికం 21.2 శాతంగా ఉందని.. అది 2022?24 నాటిక ఏకంగా 12.7 శాతం మేర పడిపోయి 4.86 శాతానికి తగ్గినట్లు తెలిపింది. 2022? 24 లో దేశంలో పేదరికం 4.86 శాతంగా నమోదైనట్లు తెలిపింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సర్వే ప్రకారం.. ఈ వేవ్ 3 సహా వేవ్ 1, వేవ్ 2 సమాచారాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు సర్వే తెలిపింది. ఎస్‌బీఐ నివేదిక ప్రకారం దేశంలో 2004?05 మధ్య పేదరికం 38.6 శాతంగా ఉంది. ఇక 2011? 12 నాటికి అది 21.2 శాతానికి పడిపోయింది. తర్వాత పలు సవాళ్లు ఎదురయ్యాయి. కోవిడ్ విజృంభించడం, ప్రజల జీవన విధానంపై ప్రభావం చూపింది. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా గ్రామీణ వ్యసాయంపై కరోనా ప్రభావంత అంతగా లేదు. దీంతో పేదరిక 2022?24 నాటికి 4.86 శాతానికి తగ్గిందని వెల్లడించింది.ఇక ఇటీవల నీతి ఆయోగ్ నిర్వహించిన సర్వే కూడా దేశంలో పేదరికం 5 శాతం తగ్గినట్లు తెలిపింది. నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యన్ నిర్వహించిన వినియోగదారు వ్యయ సర్వే తెలిపింది. పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంత ప్రజల జీవన ప్రమాణం పెరుగుతుందని పేర్కొంది. పట్టణ గ్రామీణ ప్రాంతాలు సుభిక్షంగా మారుతున్నాయని పేర్కొంది. ఇండియా హ్యూమన్ డెవలప్‌మెంట్ సర్వే (ఐహెచ్‌డీఎస్) ఇటీవల పూర్తి చేసిన వేవ్ 3 సహా వేవ్ 1, వేవ్ 2 సమాచారాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు సర్వే తెలిపింది. ఐహెచ్‌డీఎస్ నివేదిక ప్రకారం దేశంలో 2004–05 మధ్య పేదరికం 38.6 శాతంగా ఉంది. అది 2011– 12 వచ్చే నాటికి 21.2 శాతానికి పడిపోయింది. ఆ తర్వాత పలు సవాళ్లు ఎదురయ్యాయి. కోవిడ్ మహమ్మారి విజృంభించి ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపింది. అయితే అలాంటి సవాళ్లు ఎదురైనా 2011–12 నుంచి చూసుకుంటే 2022– 24 వచ్చే నాటికి దేశంలో పేదరికం 8.5 శాతానికి పరిమితమైనట్లు నివేదిక తెలిపింది.అలాగే నేషనల్ శాంపుల్ సర్వే ఆఫీసుల లెక్కల ప్రకారం కుటుంబ వినియోగ ఖర్చు 2011?12తో పోలిస్తే దారిద్ర్య రేఖను గ్రామీణ ప్రాంతాల్లో రూ.447గా నిర్ణయించగా, పట్టణ ప్రాంతాల్లో రూ.579గా నిర్ణయించారు. 2004?05 మధ్య ఈ రేఖను రాష్ట్రాల వారీగా మార్చారు. 2011?12 నాటి ప్రణాళిక సంఘం ఈ విలువను రూ.860, రూ.1000 గా మార్చింది.గ్రామీణ పేదరికం తగ్గడానికి ఎస్‌బీఐ కొన్ని కారణాలను తెలిపింది. పేదలకు ప్రభుత్వం మద్దతు తెలిపింది. అదే విధంగా డీబీటీ, ప్రభుత్వ మద్దతు ధరల్లో మార్పు, మౌలిక సదుపాయాలు, జీవనోపాధి, రైతుల ఆదాయం పెంచడం వంటి కారణాలతో గ్రామీణ పేదరికం తగ్గినట్లు వివరించింది. ప్రభుత్వాలు కూడా పేదలకు సంక్షేమం కోసం పని చేస్తుండడం, విరివిగా రుణాలు అందిస్తుండడం కారణంగా కూడా పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని వెల్లడించింది. నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యన్ నిర్వహించిన వినియోగదారు వ్యయ సర్వే తెలిపింది. పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంత ప్రజల జీవన ప్రమాణం పెరుగుతుందని పేర్కొంది. పట్టణ గ్రామీణ ప్రాంతాలు సుభిక్షంగా మారుతున్నాయని పేర్కొంది. అలాగే నేషనల్ శాంపుల్ సర్వే ఆఫీసుల లెక్కల ప్రకారం కుటుంబ వినియోగ ఖర్చు 2011–12తో పోలిస్తే దారిద్ర్య రేఖను గ్రామీణ ప్రాంతాల్లో రూ.447గా నిర్ణయించగా, పట్టణ ప్రాంతాల్లో రూ.579గా నిర్ణయించారు. 2004–05 మధ్య ఈ రేఖను రాష్ట్రాల వారీగా మార్చారు. 2011–12 నాటి ప్రణాళిక సంఘం ఈ విలువను రూ.860, రూ.1000 గా మార్చింది. మరో వైపు దేశాభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలని.. అటువంటి గ్రామాల అభివృద్ధిని గత ప్రభుత్వాలు విస్మరించాయని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన గ్రామీణ భారత మహోత్సవం 2025 కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వెనుకబడిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని.. దాంతో గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు ఎక్కువయ్యాయన్నారు. ఫలితంగా పట్టణాల్లోనూ పేదరికం పెరిగిందని ప్రధాని వాపోయారు. సమాజంలో ఎన్ని మార్పులు వస్తున్నా గ్రామాలకు, పట్టణాలకు మధ్య అంతరం పెరుగుతూనే ఉన్నదని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు.దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలు ప్రస్తుతం తమ పాలనలో సమాన హక్కులు పొందుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. సమాజ సాధికారతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, పాటిస్తున్న విధానాలు గ్రామీణ భారతంలో కొత్త శక్తిని నింపుతున్నాయన్నారు. మారుమూల గ్రామాల ప్రజలను దేశాభివృద్ధిలో భాగం చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడానికి సమ్మిళిత ఆర్థిక విధానాలు అవసరమని పేర్కొన్నారు.

# నాగార్జున సాగర్, శ్రీ శైలం బ్యారేజ్ లు డ్యామేజ్ లు

నల్గొండ, కర్నూలు, జనవరి 6, రెండు తెలుగు రాష్ట్రాలను సస్యశ్యామలం చేస్తున్న నాగార్జునసాగర్ డ్యామ్ స్పిల్ వేలో పలుచోట్ల డ్యామేజ్ అయింది. ఇలా గుంతలు పడడం కలవరం కలిగిస్తోంది. దీంతో స్పిల్ వే పటిష్ఠతపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో వాటర్ లీకేజీ ఆందోళన కలిగిస్తోంది. 1వ యూనిట్ డ్రాఫ్ట్ ట్యూబ్ జీరో ఫ్లోర్ నుంచి నీటి లీకేజీ జరుగుతోంది. గతేడాది సెప్టెంబరు 18న మొదటిసారి సన్నటి ధారగా లీకేజీ ప్రారంభమైంది. ఈ లీకేజీని అరికట్టకపోతే జీరో ఫ్లోర్ శ్లాబ్ పడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు నిపుణులు. నల్గొండ జిల్లాలోని నాగార్జున సాగర్ డ్యామ్‌ని కేంద్ర జలసంఘం, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు నిపుణుల బృందం పరిశీలించింది. సాగర్ డ్యామ్ ఇంజినీర్లు గతంలో ప్రతిపాదించిన సుమారు రూ. 160 కోట్ల రూపాయల పనులు, మరమ్మతులు ఎక్కడెక్కడ అవసరమవుతాయో ఆ టీమ్ పరిశీలించింది. ఈ పనుల్లో భాగంగా, డ్యామ్ స్పిల్ వే పటిష్ఠత, గ్యాలరీ, వాటర్ లీకేజీలకు సంబంధించిన జియోగ్రాఫికల్ విశ్లేషణ, మరమ్మతులు, డ్యామ్‌లో మట్టి పూడికతీతకు సంబంధించిన ప్రాథమిక అంచనాలను కేంద్ర జలవనరుల శాఖకు అందజేయనున్నారు. మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి సీనియర్ జాయింట్ కమిషనర్ సంజయ్ కుమార్ నేతృత్వంలోని టీమ్ సాగర్‌లో పర్యటించింది. ఇదే బృందం శుక్రవారం నాడు శ్రీశైలం ప్రాజెక్టును సందర్శించి, అక్కడి పరిస్థితులను కూడా అంచనా వేసింది.ఇక శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో వారం రోజులుగా నీరు లీకవుతుండడం ఆందోళనకరంగా మారింది. నెల రోజుల నుంచి నిరంతరాయంగా విద్యుత్ ఉత్పాదనతో పాటు, పంప్ మోడ్ పద్ధతిలో శ్రీశైలం డ్యామ్‌లోకి నీటి మళ్లింపు కొనసాగుతోంది. పంపు మోడ్‌లో టర్బైన్ వేగంగా తిరుగుతుండటంతో.. డ్రాఫ్ట్ ట్యూబ్ జీరో ఫ్లోర్ శ్లాబ్ నుంచి నీటి చుక్కలు ధారలా పడుతుండటంతో జెన్‌కో అధికారులు అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే.. సర్జ్ ఛాంబర్, పెన్‌స్టాక్ గేట్లను మూసి వేసి, టర్బైన్‌లో నిలువ నీటిని పూర్తిగా తొలగిస్తే తప్ప లీకేజీ అవుతున్న ప్రాంతాన్ని గుర్తించే పరిస్థితి లేదంటున్నారు అధికారులు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాన్ని 24 ఏళ్ల క్రితం నిర్మించగా.. నీటి లీకేజీని అరికట్టకపోతే జీరో ఫ్లోర్ శ్లాబ్ పడిపోయే ప్రమాదం ఉందని కొందరు ఇంజనీర్లు, మాజీ ఉద్యోగులు చెబుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టును సందర్శించిన కేంద్రం బృందం..దీనికి ఓ పరిష్కారం సూచించనుంది. నాగార్జున సాగర్, శ్రీశైలం డ్యాముల భద్రత కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రతిపాదనలు పంపనుంది ఈ బృందం.

# ఎర్రచందనం స్మగ్లింగ్ కట్టడి ఎలా...

తిరుపతి, జనవరి 6, ఎర్రచందనం.. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన, అరుదైన చెట్టు. శేషాచలం కొండల్లోనే దొరికే గ్రేడ్ 1 ఎర్రచందనం దుంగలు దేశమంతా ఎలా చక్కర్లు కొడుతున్నాయో జస్ట్ గత నెల రోజుల రిపోర్ట్ చూస్తే అర్థమవుతుంది. అయితే ఇదంతా దొరికిన దుంగల సంగతే.

మరి ఎవరికీ దొరక్కుండా చేరాల్సిన చోటికి సాఫీగా చేరుతున్న రెడ్ శాండిల్ పరిస్థితి ఏంటి? ఇది లెక్కలకు అందట్లేదు. సిండికేట్ ముఠాలు బయట చేస్తున్న ప్రచారం ఏంటంటే.. రెడ్ శాండిల్ కు గట్టిగా డిమాండ్ ఉన్న చైనా, జపాన్ లో ఆర్థిక పరిస్థితులు బాగోలేవని, అందుకే డిమాండ్ తగ్గిందంటున్నారు. అక్కడి డీలర్లు భారీ రేటు పెట్టి కొనేందుకు ఇష్టం చూపట్లేదంటున్నారు.ఎర్రగా నిగనిగలాడుతూ కనిపించే ఈ రెడ్ శాండిల్ వుడ్ శేషాచలం కొండల్లో వెరీ వెరీ స్పెషల్. పుష్ప సినిమా వచ్చాక ఈ చెట్టు చుట్టూ సీన్ మరింతగా పెరిగింది. అసలు మ్యాటర్ ఏంటంటే.. చైనా, జపాన్ లో ఎర్రచందనానికి డిమాండ్ తగ్గిందన్న ప్రచారం చేస్తూనే.. ఇంకోవైపు అక్రమంగా తరలిస్తూనే ఉన్నారు. అటు ప్రభుత్వ డిపోల్లో నిల్వలు మాత్రం అలాగే పేరుకుపోతున్నాయి. తిరుమల శ్రీనివాసుడి కొండపై నుంచే ఎర్రచందనం స్మగ్లింగ్ ఎలా జరుగుతుందో చూస్తున్నారుగా.. ఇది నిన్నటికి నిన్న జరిగిన ఘటన. పక్కా ఇన్ఫర్మేషన్ తో పట్టుకున్న పరిస్థితి. ఇన్ఫర్మేషన్ రాకపోతే.. నిగనిగలాడుతూ కనిపిస్తున్న ఈ ఎర్రబంగారం బండి కొండ దిగేదే. అక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలో వెళ్లిపోయేదే. పారిపోయేందుకు ప్రయత్నించిన డ్రైవర్ ను చాకచక్యంగా పట్టుకున్నారు. సో ఈ ఘటన చెబుతున్నదేంటంటే.. రెడ్ శాండిల్ స్మగ్లింగ్ నాన్ స్టాప్ గా జరుగుతోందనడానికి జస్ట్ ఎగ్జాంపుల్ మాత్రమే.అడవి అంటేనే తెరిచిన ఖజానా మాదిరి. ఎవరు ఎటు నుంచైనా రావొచ్చు.. ఎవరు ఎటు నుంచైనా వెళ్లొచ్చు. ఏదైనా తేవొచ్చు.. ఏదైనా కొల్లగొట్టొచ్చు. అయితే ఈ సీన్ లో మాత్రం ఏకంగా తిరుమల శ్రీనివాసుడి కొండ నుంచే ఎర్రచందనం దింపుతున్నారంటే సిండికేట్ స్కెచ్ మామూలుగా లేదుగా. ఇక్కడి నుంచే ఇలా ఉంటే.. శేషాచలం కొండల చుట్టూ పరిస్థితి ఏమిటి? చెక్ పోస్టులకు చెక్ పెడుతూ ఎర్రచందనం దొంగల ముఠా ఎలా దుంగల్ని కొండలు దాటిస్తుందో అర్థం చేసుకోవచ్చు.డిమాండ్ లేనప్పుడు స్మగ్లింగ్ ఎందుకు జరుగుతోంది? ఎందుకు రిస్క్ తీసుకుని తరలించుకెళ్తున్నారు? ఎక్కడ దాస్తున్నారు? ఏం చేస్తున్నారు? డిమాండ్ పెరిగినప్పుడు బయటకు తీసేందుకు నిల్వ చేసుకుంటున్నారా? ఇవన్నీ ఇప్పుడు డీకోడ్ చేయాల్సిన అంశాలు. ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చాక రెడ్ శాండిల్ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతోంది. రెడ్‌శాండల్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ మళ్లీ యాక్టివేట్ అయింది.

పక్కాగా తిరుగుతూ కూపీ లాగుతున్నారు.అఫీషియల్ గా వేలంలో రెడ్ శాండిల్ వుడ్ కొని సప్లై చేస్తే సవాలక్ష ట్యాక్సులు, పర్మిషన్లు తీసుకోవాలి. ఇందులో లాస్ ఉంటుంది. రెడ్ శాండిల్ డీలర్ అని నలుగురికీ తెలుస్తుంది. ముమ్ముందు స్మగ్లింగ్ కు ఛాన్స్ ఉండదు. అదే గుట్టుచప్పుడు కాకుండా అమ్మేస్తే డబ్బంతా కింగ్ పిన్ లకే చేరుతుంది. ఇదే ఫార్ములాను సిండికేట్ నమ్ముకుందా అంటే అవునన్న సమాధానమే వస్తోంది. ఎక్కడ అమ్మాలో అక్కడే అమ్ముకుంటున్నారన్న డౌట్లు పెరుగుతున్నాయి. రెడ్ శాండిల్ ముఖ్యంగా ఔషధాల్లో, సౌందర్య ఉత్పత్తుల్లో, డెకొరేషన్ పర్పస్, ఫర్నీచర్, గిఫ్ట్స్ తయారీలో వాడుతారు. చైనా, జపాన్, థాయ్ లాండ్, మలేషియా, దుబాయ్ వంటి చోట్ల లగ్జరీతో పాటు ఎర్రచందనం ఓ అవసరం కూడా. అందుకే అంత డిమాండ్.నిజానికి ఎర్రచందనం ఎక్కువ రోజులు నిల్వ చేయడానికి ఉండదు. క్వాలిటీ తగ్గుతుంటుంది. అందుకనే ముఠాలు తొందరపడుతున్నట్లుగా డౌట్లు పెరుగుతున్నాయి. నిజానికి గత ఐదేళ్లు ఎర్రచందనం స్మగ్లింగ్ అడ్డుకోవడానికి ఏర్పాటైన వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయన్న వాదన వినిపిస్తోంది. రెడ్‌శాండల్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ కు ఇప్పుడిప్పుడే మళ్లీ ఫుల్ రైట్స్ ఇస్తున్నారు. గతంలో అటవీశాఖ ఫాలో అయిన వ్యూహాలు, ఏర్పాటు చేసిన వ్యవస్థలన్నీ పక్కకు పోయాయి. సీసీ కెమెరాల సిస్టమ్ కూడా పక్కన పెట్టేశారు. ఫారెస్ట్ చెక్ పోస్టుల దగ్గర సీసీ కెమెరాలు మాయమయ్యాయి. తనిఖీ కేంద్రాల్లో వాహనాల స్కానర్ల జాడ లేకుండా పోయింది. అడవుల చుట్టూ తవ్విన కందకాలు కూడా ఖతమయ్యాయి. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన వాచ్ టవర్లు అడ్రస్ లేకుండా పోయాయి. బేస్ క్యాంపుల్ని మూసేశారు. సో ఇప్పుడు వీటిని మళ్లీ యాక్టివేట్ చేసే పనిలో కూటమి ప్రభుత్వం ఉంది. మొదట ఎర్రచందనం స్మగ్లింగ్ కు అడ్డుకట్ట వేసేలా ప్రయత్నాల్ని ముమ్మరం చేసిందిఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల పరిధిలో శేషాచలం కొండలు దాదాపు 5.5 లక్షల హెక్టార్లలో విస్తరించి ఉన్నాయి.

శేషాచలం, వెలుగొండల్లో మాత్రమే ఎర్రచందనం ఎక్కువగా పెరుగుతుంది. అందులోనూ శేషాచలం కొండల్లో పెరిగే ఎర్రచందనానికే ఎక్కువ రంగు, పవర్ ఉండడంతో ఇంటర్నేషనల్ మార్కెట్ లో మంచి డిమాండ్ ఉంది. అందుకే రకరకాల రూపాల్లో స్మగ్లింగ్ జరుగుతుంటుంది. ఇది 7 దశల్లో జరుగుతుంది. ఫస్ట్ ఉడ్ కట్టర్, తర్వాత మేస్త్రీ, ఆ తర్వాత పైలట్, నెక్ట్స్ ట్రాన్స్‌పోర్టర్, గోడౌన్ కీపర్, ఎక్స్ పోర్టర్, చివరగా ఇంటర్నేషనల్ స్మగ్లర్స్ ఇలా దశల వారీగా రెడ్ శాండిల్ వుడ్ తరలుతుంది. ఇదంతా చాలా సీక్రెట్ గా నడుస్తుంటుంది. ఎవరికీ ఎవరితోనూ సంబంధాలు ఉండవు. ఒకరికొకరు తెలియరు. అలా డీల్ చేస్తారు. పైగా పోలీసులు, టాస్క్ ఫోర్స్, అటవీ సిబ్బందిని కన్ఫ్యూజ్ చేసేందుకు కొంత ఎర్రచందనం దొరికేలా చూసుకుంటారు. వారిని అక్కడే ఆగిపోయేలా చేస్తారు. ఫైనల్ గా ఏపీ బార్డర్ దాటిస్తారు.ప్రభుత్వ గోడౌన్లలో ఎర్రచందనం దుంగలు మూలుగుతున్నాయి. ప్రస్తుతం 7 వేల టన్నుల సరుకు రెడీగా ఉంది. పట్టుబడ్డ ఎర్ర చందనాన్ని వేలం ద్వారా అమ్మి రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు వరంగా మార్చాలని ప్రభుత్వం భావించింది. 2014 నుంచి ఆ దిశగా ప్రయత్నాలు చేసింది. 2018 సెప్టెంబరులో అత్యధికంగా 5 వేల టన్నుల ఎర్రచందనాన్ని విక్రయించి భారీగానే ఆదాయాన్ని సమకూర్చుకుంది. 2020లో మాత్రం 300 టన్నులు, ఆ తర్వాత మూడేళ్లలో 450 టన్నులు మాత్రమే అధికారికంగా అమ్మారు. ఓవైపు ప్రభుత్వ డిపోల్లో ఉన్న సరుకు ఉన్నట్లుగానే ఉంటే స్మగ్లర్లు మాత్రం కోట్లు గడిస్తున్నారు. ఈ లాజిక్ ఎక్కడ మిస్ అవుతోందో ఇప్పుడు చూద్దాం.

ప్రస్తుతం తమిళనాడు, కటికెనహల్లి స్మగర్లు మాత్రమే ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారంటున్నారు. ఎపిలోని టాప్ టెన్ స్మగ్లర్లు దందాకు దూరమయ్యారన్న టాక్ కూడా వినిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ తమ దగ్గర 7 వేల టన్నులు స్టాకుంది.. టన్ను 50 లక్షలకు కూడా కొనేందుకు ఎవరూ ఎవరూ ముందుకు రావడంలేదని అంటోంది. ప్రతి ఏటా 2 వేల టన్నులకు పైగా ఎర్రచందనం చెన్నై, ముంబై, కోల్ కతా, ట్యూటికోరన్ రేవుల మీదుగా నేపాల్, టిబెట్ లకు, అక్కడి నుంచి చైనా ఇతర దేశాలకు రవాణా అవుతోంది. ఉపాది లేక ఖాళీగా ఉన్న వారిని కూలీలుగా నియమించుకుని ఎర్రచందనం అక్రమ రవాణాను ఒక వ్యాపారంగా నిర్వహించడం మొదలు పెట్టి వేల కోట్లు సంపాదించారు. లారీ క్లీనర్లుగా జీవితం ప్రారంభించిన వారు స్మగ్లర్లుగా మారి వందల కోట్లు సంపాదించారు. ఇక తమిళనాడులో అయితే స్మగ్లర్లు దుబాయి కేంద్రంగా పనిచేస్తారంటారు. గత పదేళ్లలో లక్ష కోట్ల రూపాయల విలువైన ఎర్రచందనం అక్రమ రవాణా జరిగిందన్న లెక్కలున్నాయి.2014 నుంచి 19 మధ్యం కాలంలో ఎర్రచందనం అక్రమ రవాణాపై నాటి టీడీపీ ప్రభుత్వం ఉక్కు పాదం మోపింది. 20మంది ఎన్ కౌంటర్ కూడా అయ్యారు. క్షేత్ర స్థాయి నుంచి కింగ్ పిన్ ల వరకు ఆరా తీసింది. టాప్ టెన్ స్మగర్ల లిస్టు తయారు చేసింది. వారి అస్తుల వివరాలను ఈడీ వరకు తీసుకెళ్లింది. దేశ విదేశాలలో ఉన్న స్మగర్ల లిస్టునుబయటపెట్టింది. అక్రమార్కుల గుండెల్లో వణుకు పుట్టించింది. మరో వైపు తమిళ కూలీలకు కౌన్సిలింగ్ ఇచ్చింది. దేశంలో ఎర్రచందనం ఎక్కడ పట్టుబడ్డా అది ఏపీకే వచ్చేలా చర్యలు చేపట్టింది. పొలిటికల్ గా ఎవరు ఈ దందాకు సపోర్ట్ ఇస్తున్నారో గుర్తించారు. కానీ గత ఐదేళ్లలో మాత్రం సీన్ మొత్తం రివర్స్ గా మారింది. అందుకే ఎర్రచందనం స్మగ్లింగ్ మళ్లీ పెరిగింది.తాజాగా ఎపి స్మగర్ల కంటే తమిళ స్మగ్లర్లతో పాటు పీలేరు, రాయచోటి ప్రాంతానికి వారే ఎక్కువగా అక్రమ దందాలో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎర్రచందనం వేలంలో చైనాకు చెందిన 10-15 మంది వ్యాపారులు పాల్గొంటుంటారు. అటవీశాఖ టన్ను ధర 70 లక్షలుగా నిర్ణయించింది. కానీ ఎక్కువ మంది 50 లక్షలకు మించి బిడ్లు వేయలేదు. టెండర్ రేటుకు బిడ్లు వేసిన ఒకరిద్దరు వ్యాపారులు కొనుగోలు చేసిన సరుకు కూడా 30 టన్నులు మించలేదు.

2022లో 500 టన్నులు వేలం వేయగా.. ఇంకా 4,900 టన్నులు మిగిలి ఉంది. అందులో 2023లో లాట్‌ల వారీగా 400-500 టన్నుల చొప్పున రెండు సార్లు ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచారు.

కానీ టెండర్ రేటు కన్నా తక్కువ కోట్ చేస్తూ బిడ్లు వచ్చాయి. అత్యధికంగా 2016-19 మధ్య టన్ను ధర 70-75 లక్షలు పెట్టి వేలంలో వ్యాపారులు కొనుక్కున్నారు.చైనా, జపాన్, మలేషియా, సింగపూర్, అరబ్ దేశాల్లో లగ్జరీ వస్తువులు కొనడం తగ్గిందంటున్నారు. ఆయా దేశాల్లో విలాసవంతమైన భవన నిర్మాణాలు, ఖరీదైన ఫర్నిచర్ వినియోగం తగ్గడంతో ఎర్రచందనానికి డిమాండ్ తగ్గిందంటున్నారు. కాస్త ధర తగ్గించి అమ్మాలని అధికారులు ప్రతిపాదించినట్లు తెలిసింది. ఏపీలో కొనుగోలు చేసే ఎర్రచందనాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అన్ని అనుమతులు తీసుకుని, తిరుపతి గోడౌన్ నుంచి విశాఖ పోర్టుకు తరలించి, అక్కడి నుంచి షిప్‌లో చైనాకు తరలిస్తుంటారు. దీనికి రవాణా ఖర్చులు కూడా పెరగడంతో డిమాండ్ లేనప్పుడు ఎక్కువ ధరకు కొనుగోలు చేయడం ఎందుకని వ్యాపారులు వెనుకాడుతున్నట్లు తెలిసింది. దీంతో అటవీశాఖ సెంట్రల్ స్టోర్స్ లో సుమారు 7వేల టన్నులకు పైగా ఎర్ర చందనం దుంగలు నిల్వలున్నాయి.ఇక్కడి ఎర్రచందనం కొనేకంటే తమ దగ్గరే పెంచుకుంటే ఖర్చులు చాలా కలిసి వస్తాయి కదా అని చైనా, జపాన్ వంటి దేశాల్లో వ్యాపారులు అనుకున్నారు. ఇక్కడి నుంచి మొక్కలు తీసుకెళ్లి పెంచే యత్నం చేశారు. కానీ వర్కవుట్ కాలేదు. అంతే కాదు మొక్కలు చాలా లేట్ అవుతున్నాయని టిష్యూ కల్చర్ ద్వారా వీటిని పెంచడానికి ప్రయత్నించారు. అదీ కుదరలేదు. పైగా ఇలా పెంచిన మొక్కల్లో ఔషధ గుణాలు తక్కువగా కనిపించాయి. ఎర్రచందనంలో ఎరుపు లేకుండా పోయింది. కర్ర కూడా బలహీనంగా ఉండడంతో వర్కవుట్ కాలేదు. అదే శేషాచలం కొండల్లో యురేనియం, ఐరన్, గ్రాఫైట్, కాల్షియం లాంటివి వివిధ నిష్పత్తుల్లో ఉన్నాయి. ఈ మొక్కకి ఈ కాంబినేషన్ అనుకూలమైంది. అందుకే శేషాచలం కొండల్లో ఈ చెట్లు బాగా పెరుగుతున్నాయి. మంచి చేవతో ఉంటాయి. సో ప్రస్తుతం ఇంటర్నేషనల్ గా జరుగుతున్న స్మగ్లింగ్, దొరుకుతున్న దుంగలు చూస్తుంటే.. ఎర్రచందనానికి డిమాండ్ తగ్గలేదు కానీ, ప్రభుత్వ డిపోల్లో ఉన్న వాటికే డిమాండ్ తగ్గిందా అన్నది ఇంట్రెస్టింగ్ గా మారింది.చైనా, జపాన్‌లో వంటింట్లో వాడే పాత్రలు, గిన్నెలు కూడా ఎర్రచందనంతో చేసినవి వాడుతుంటారు. సంగీత వాయిద్యాలు తయారు చేసి పెళ్లిళ్ల లో బహుమతిగా ఇస్తుంటారు.

కాస్మెటిక్స్, ఫేస్ క్రీమ్స్ లాంటి వాటిలో వీటిని వాడుతారు. అల్సర్ ను తగ్గించే గుణం, కిడ్నీ సమస్యలు, రక్తాన్నిశుద్ధి చేయడం వంటి లక్షణాలు ఎర్ర చందనంలో ఉంటాయంటున్నారు. రెడ్ శ్యాండిల్ తో చేసిన ఫర్నిచర్, నేమ్ ప్లేట్స్ గా పెట్టుకుంటే మంచి జరుగుతుందని నమ్ముతుంటారు. అందుకే ఇంత డిమాండ్ ఉంటుంది. కింగ్ పిన్ ల స్కెచ్ ల మధ్య.. ప్రభుత్వ గోడౌన్ లో ఉన్న సరుకు ఎక్కువ రేటుకు అమ్ముడుపోతుందా.. లేదా అన్నది కీలకంగా మారింది.

## 18 కోట్లతో హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్ట సుందరీకరణ అభివృద్ధికి శంఖు స్థాపన

### హుస్నాబాద్ మున్సిపాలిటీ లో భారీగా సీసీ రోడ్లు ,మురికి కాలువల నిర్మాణానికి శంకుస్థాపన

### భవిష్యత్ ప్రణాళికలను దృష్టిలో పెట్టుకొని హుస్నాబాద్ ను అన్ని రంగాల్లో ముందుంచుతా

### వ్యవసాయ రైతు సంక్షేమమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యం

జనవరి 26 నుండి పెరిగిన రైతు భరోసా ౘ భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ కానుక అమలు - మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ మున్సిపాలిటీనీ మరింత అభివృద్ధి చేయడానికి దాదాపు 26.60 కోట్లతో పలు అభివృద్ధి పనులకు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపనలు చేశారు. 18 కోట్లతో హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్ట సుందరీకరణ మరియు అభివృద్ధికి శంఖు స్థాపన చేశారు. 6 ,7,11,12,13,17,19 ,20 వార్డు లలో ప్రతి వార్డు కి 50 లక్షల చొప్పున సీసీ రోడ్ల నిర్మాణం , మురికి కాలువలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్వర్ణకార కమ్యూనిటీ మినీ స్పోర్ట్స్ హాల్ , అయ్యప్ప నగర్ లో యాదవ కమ్యూనిటీ రీడింగ్ రూం , మెడలయ్య వద్ద రజక కుట్టు యంత్ర శిక్షణ కేంద్రాలను శంఖు స్థాపన చేశారు.,బురుజు వద్ద 3 కోట్ల రూపాయలతో నిర్మించిన నూతన రైతు బజార్ ను ప్రారంభించారు. కోటి రూపాయలతో వ్యవసాయ మార్కెట్ లో నిర్మించిన కవర్ షెడ్ గోదాం ను ప్రారంభించారు.అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్ ప్రాంతానికి తలమానికమైన ఎల్లమ్మ చెరువు అభివృద్ధికి 18 కోట్లు టెండర్ అయి పనులు ప్రారంభం అయ్యేలా శంఖు స్థాపన చేసుకున్నమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. భవిష్యత్ లో ఇతర ప్రాంతాల నుండి ప్రజలు ఇక్కడికి వచ్చేలా ఎల్లమ్మ చేరవు అభివృద్ధి చేస్తామన్నారు. పక్కనే గౌరవెల్లి ప్రాజెక్టు హుస్నాబాద్ లో చుట్టూ కొండలు పర్యాటకానికి ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

హుస్నాబాద్ పట్టణంలో మరో రెండు కోట్లతో అంబేద్కర్ , గాంధీ ,అనబేరి ప్రభాకర్ ,కొండా లక్ష్మణ బాపూజీ విగ్రహాలను ఏర్పాటు చేసి జంక్షన్ లకు 50 లక్షల చొప్పున కేటాయించుకొని సుందరీకరణ చేస్తున్నామని తెలిపారు.ప్రతి వార్డు కి 50 లక్షలతో అభివృద్ధి, ప్రతి కుల సంఘాలకు 45 లక్షలతో కమ్యూనిటీ హాల్ లు నిర్మిస్తున్నామని తెలిపారు.

## ఆంధ్రకు స్పెషల్ ట్రైన్స్...

హైదరాబాద్, జనవరి 6, సంక్రాంతి అంటేనే తెలుగు ప్రజలకు పెద్ద పండుగ. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఆ 3 రోజులూ తమ కుటుంబంతో సంతోషంగా గడిపేందుకు సొంతూళ్లకు పయనమవుతారు. ఈ క్రమంలో రద్దీ దృష్ట్యా ద.మ రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్ చెప్పింది. 52 అదనపు రైళ్లు నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. నగరంలోని సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి రైల్వే స్టేషన్ల నుంచి కాకినాడ, నర్సాపూర్, తిరుపతి, శ్రీకాకుళం ప్రాంతాలకు ఈ సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. ఈ నెల 6 నుంచి 18వ తేదీ వరకూ ఆయా ప్రాంతాలకు ఇవి అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

ఈ నెల 8, 9, 11, 12, 15, 16 తేదీల్లో చర్లపల్లి - తిరుపతి - చర్లపల్లి (02764/02763) మొత్తం 6 సర్వీసులు అందుబాటులో ఉంటాయి.

ఈ నెల 13న వికారాబాద్ - కాకినాడ టౌన్ (07037), ఈ నెల 14న కాకినాడ టౌన్ - చర్లపల్లి (07038).

ఈ నెల 9, 10, 16, 17 తేదీల్లో కాచిగూడ - తిరుపతి - కాచిగూడ మొత్తం 4 సర్వీసులు నడపనున్నారు.

ఈ నెల 11, 12, 18, 19 తేదీల్లో చర్లపల్లి - నర్సాపూర్ - చర్లపల్లి (07035/07036)

ఈ నెల 12, 19 తేదీల్లో కాకినాడ టౌన్ - సికింద్రాబాద్

ఈ నెల 7, 8, 9, 10, 13, 14, 15, 16, 17, 18 తేదీల్లో చర్లపల్లి - నర్సాపూర్ - చర్లపల్లి (07033/07034) మొత్తం 10 సర్వీసులు అందుబాటులో ఉంటాయి.

ఈ నెల 8, 9, 10, 11, 12, 13, 14, 15 చర్లపల్లి - కాకినాడ టౌన్ - చర్లపల్లి (07031/07032) మొత్తం 8 సర్వీసులు నడపనున్నారు.

ఈ నెల 6, 7, 13, 14 తేదీల్లో నాందేడ్ - కాకినాడ టౌన్ - నాందేడ్ (07487/07488).

ఈ నెల 9, 10, 12, 13, 14, 15 తేదీల్లో చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్ - చర్లపల్లి (07025/07026) 6 సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి.

ఈ నెల 7, 8 తేదీల్లో కాచిగూడ - శ్రీకాకుళం రోడ్ - కాచిగూడ (07041/07042) రైళ్లు నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## చైనాలో కొత్త వైరస్... తెలుగు రాష్ట్రాలు అలెర్ట్

హైదరాబాద్, జనవరి 6, చైనాలో పుట్టిన మరో కొత్త వైరస్ ప్రచంచాన్ని భయపెడుతోంది. ఇప్పటికే చైనాను గడగడలాడిస్తోంది. వైరస్‌తో ఇప్పటికే చైనాలో అనేక మంది ఆస్పత్రులపాలయ్యారు. మరణాలు కూడా సంభవిస్తున్నాయి. అయినా చైనా కనీసం విషయం బయటకు చెప్పడం లేదు. ఇప్పటికే 2019లో చైనాలోని వూహాన్ ల్యాబ్‌లో పుట్టిన కరోనా వైరస్ కారణంగా ప్రపంచ దేశాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆర్థికంగా నష్టపోయాయి. లక్షల మంది చనిపోయారు. కోట్ల మంది వైరస్ బారిన పడ్డారు. కొత్తగా పుట్టిన హ్యూమన్ మెటానిమో వైరస్ మరో కారోనాలా మాచే అకాశం ఉండడంతో ప్రపంచ దేశాలు అలర్ట్ అవుతున్నాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కూడా ఇప్పటికే కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది ప్రజలకు కీలక హెచ్చరిక జారీ చేసింది. హెచ్‌ఎంపీవీ ఒక సాధారణ శ్వాసకోశ వైరస్. ఇది శీతాకాలంలో జలుబు, ఫ్లూ వంటి లక్షణాలకు కలిగిస్తుంది. చిన్న పిల్లలు, వృద్ధుల్లో వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

తెలంగాణలో కేసులు లేవు..

ఇదిలా ఉంటే.. తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదని రాష్ట్ర ఆరోగ్య శాఖ తెలిపింది. 2024, డిసెంబర్‌లో శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల డేటాను విశ్లేషించగా, 2023తో పోలిస్తే గణనీయమైన పెరుగుదల కనిపించలేదుని పేర్కొంది. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లను నివారించేందుకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ సూచించింది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

దగ్గుతున్నప్పుడు లేదా తుమ్ముతున్నప్పుడు నోటిని, ముక్కును రుమాలుతో లేదా టిష్యూతో మూసుకోవాలి.

సబ్బు లేదా ఆల్కాహాలిక్ ఆధారిత శానిటైజర్‌తో తరచూ చేతులు కడుక్కోవాలి.

గుంపులుగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండాలి.

జ్వరం, దగ్గు, తుమ్మలు వంటి లక్షణాలు ఉంటే.. బహిరంగ ప్రదేశాలకు వెళ్లడం నివారించాలి.

నీరు ఎక్కువగా తాగాలి. పోషకాహారం తీసుకోవాలి.

శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు తగ్గేందుకు గదులు బాగా గాలి పీల్చుకునేలా చూసుకోవాలి. అస్వస్థతకు గురైతే ఇంట్లోనే ఉండి ఇతరులను కలవొద్దు.

చేయకూడనివి..

చేతులు కలపడం..

టిష్యూ పేపర్ లేదా రుమాలును పునర్వినియోగం చేయడం.

అనారోగ్యంతో ఉన్న వ్యక్తులతో సన్నిహితంగా ఉండొద్దు.

కళ్లు, ముక్కు, నోటిని తరచూ తాకొద్దు.

బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మరాదు.

డాక్టర్ సూచనల మేరకు ఇన్‌ఫెక్షన్లకు మందులు వాడాలి.

## మహాకుంభమేళకు అంతా సిద్ధం

లక్నో, జనవరి 6, (న్యూస్ పల్స్) మహా కుంభ మేళా 2025 హిందువులు దీనిని ఎంతో ఘనంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ సంవత్సరం 2025లో కుంభమేళా జనవరి 13వ తేది నుంచి ఫిబ్రవరి 26వ తేదివరకు అలహాబాద్ (ప్రయాగ)లో జరగనుంది. అయితే అసలు ఈ కుంభ మేళాను ఎందుకు నిర్వహిస్తారు అమృతాన్ని గెలుచుకునేందుకు దేవతలు, అసురల సముద్ర మథనం చేస్తారు. ఆ సమయంలో ప్రయాగ్ రాజ్, హరిద్వార్, నాసిక్, ఉజ్జయిని నదులపై అమరత్వాన్ని ఇచ్చే అమృతం పడిందని చెప్తారు. జ్యోతిష్యశాస్త్రం ప్రకారం, నక్షత్రాల స్థానం ప్రకారం.. కుంభ మేళా సమయంలో ఆ పవిత్ర నదుల నీరు అమృతంగా మారుతుందని భక్తులు భావిస్తారు. అందుకే ఈ కుంభ మేళా సమయంలో హిందువులు తమ పాపాలను పోగొట్టుకోవడానికి పవిత్ర నదుల వద్దకు వెళ్తూ ఉంటారు. కుంభ అంటే సంస్కృతంలో కుండ, కలశం అనే అర్థాలను ఇస్తుంది. అలాగే రాశుల్లో కూడా కుంభ రాశి ఉంటుంది. ఈ రాశిలోనే కుంభ మేళాను నిర్వహిస్తారు. మేళా అంటే జన సమూహం, కూటమి, జాతరను సూచిస్తుంది. పవిత్ర నదుల దగ్గర ఇలా కూటమిగా రావడాన్నే కుంభ మేళాగా పిలుస్తున్నారు. సాధారణంగా కుంభ మేళా అనేది ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారు. అర్ధ కుంభ మేళా అనేది ప్రతి ఆరు సంవత్సరాలకు చేస్తారు. హరిద్వార్, ప్రయాగలలో ఈ అర్ధ కుంభ మేళా జరుగుతుంది. పూర్ణ కుంభ మేళా అనేది ప్రతి పన్నెండు సంవత్సరాలకు చేస్తారు. ప్రయాగ, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్లలో ఈ పూర్ణ కుంభ మేళా జరగుతుంది. ఇలాంటి పూర్ణ కుంభ మేళాలు పన్నెండు పూర్తి అయిన తర్వాత అంటే నూట నలభై నాలుగు సంవత్సరాలకు ఓసారి మహా కుంభ మేళా జరుగుతుంది. ఇది అలహాబాద్లో నిర్వహిస్తారు. ఇప్పుడు జరిగేది మహా కుంభ మేళానే. దీనిని అలహాబాద్గా చెప్తోన్న ప్రయాగ్లో నిర్వహిస్తున్నారు. సూర్యుడు, బృహస్పతి గ్రహం స్థానాల ఆధారంగా కుంభ మేళాను నిర్వహిస్తారు. సూర్యుడు, బృహస్పతి సింహ రాశిలో ఉన్నప్పుడు కుంభ మేళాను నాసిక్లోని త్రయంబకేశ్వర్లో నిర్వహిస్తారు. సూర్యుడు మేష రాశిలో ఉన్నప్పుడు హరిద్వార్లో చేస్తారు. బృహస్పతి, సూర్యుడు వృశ్చిక రాశిలో ఉన్నప్పుడు ఉజ్జయినిలో నిర్వహిస్తారు. ఇలా ప్రతి స్థలంలోనూ కుంభ మేళా నిర్వహించే తేదీలను సూర్యుడు, బృహస్పతి స్థానాల ఆధారంగా లెక్కిస్తారు.2013లో అలహాబాద్లో జరిగిన కుంభ మేళాకు 30 మిలియన్లకు పైగా భక్తులు హాజరయ్యారు. ఇది గిన్నిస్ ప్రపంచ రికార్డును నెలకొల్పింది. ఈ ఏడాది సుమారు 40 కోట్ల మంది భక్తులు ప్రయాగ్ రాజ్కు వస్తారని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తుంది. దానికి సంబంధించిన అంశాలపై దృష్టి సారిస్తుంది. భక్తులకు అసౌకర్యం కలగకుండా.. వసతులు కల్పించడం వంటి పనుల్లో నిమగ్నమైంది. మహా కుంభ మేళాను ఆధ్యాత్మిక మేల్కొల్పుగా చూస్తారు. ఇది మతసామర్యాన్ని పెంచే వేడుకగా చెప్తారు. ఈ కుంభ మేళా సమయాల్లో పవిత్ర నదుల్లో స్నానం చేస్తారు. తమ పాపాలను కడిగి.. ఆధ్యాత్మికంగా వృద్ధి చెందుతారని భావిస్తారు. ఈ కుంభ మేళాల్లో సాధువులు, ఋషులు, ఆధ్యాత్మిక నాయకులు కూడా హాజరవుతారు. సాంస్కృతిక గొప్పతనానికి ప్రతీకగా ఈ కుంభ మేళా ప్రతిబింబిస్తుంది. ఈ మేళాలో నాగ సాధువులు నగ్నంగా.. సన్యాసులు బూడిద రాసుకుని కనిపిస్తారు. వివిధ ప్రాంతాలు, కులాలు, మతాల

# భక్తులపై దూసుకెళ్లిన 108 అంబులెన్స్

## ఇద్దరు మృతి .... ముగ్గురికి గాయాలు

తిరుపతి ఒక అంబులెన్స్ అదుపు తప్పి భక్తులపై దూసుకుపోయింది. ఘటనలొఓ ఇద్దరు మృతి చెందారు. ముగ్గురికి గాయాలయ్యాయి. చంద్రగిరి మండలం నరశింగాపురం నారాయణ కళాశాల వద్ద ఘటన జరిగింది. మృతి చెందిన వ్యక్తులు అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చెంపాలపల్లికి చెందిన పెద్దరెడ్డమ (40), శేగంవారిపల్లికి చెందిన లక్ష్మమ్మ (45) గా గుర్తించారు. అంబులెన్స్ లో మదనపల్లి నుంచి తిరుపతి రూయా ఆసుపత్రికి రోగిని తీసుకొస్తున్నారు. బాధిత భక్తులు పుంగనూరు నుంచి తిరుమల కు పాదయాత్ర చేస్తున్నారు.

# బిఆర్ఎస్, బిజెపిపై మంత్రి పొన్నం మండిపాటు

సిద్దిపేట హుస్నాబాద్ లో మీడియా సమావేశంలో బిఆర్ఎస్, బిజెపిపై మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 4 వ తేది జరిగిన క్యాబినెట్ లో తెలంగాణ రైతులకు ఎన్నికల ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా, భూమిలేని పేదలకు 12 వేలు జనవరి 26 నుండి అమలు చేయాలని నిర్ణయించింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అమలు చేస్తున్నాం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ,500 కీ గ్యాస్ అందిస్తున్నామని అన్నారు.

2 లక్షల రూపాయల వరకు రైతు రుణమాఫీ చేశాం. 40 శాతం డైట్ చార్జీలు పెంచాం. 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. నిన్న రైతు భరోసా ఇస్తామని ప్రకటించాం.. దానిని 12 వేలకు పెంచాం. భూమి లేని పేదలకు సంవత్సరానికి 12 వేలు ఇవ్వాలని నిర్ణయించాం. 10 సంవత్సరాలుగా బిఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డులు ఇవ్వలేదు. కొత్త రేషన్ కార్డులు ఇస్తాం. బీజేపీ, బీఆర్ఎసక కలిసి ఒకే ఎజెండా తో రాజకీయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు.తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. రైతు సంఘం నాయకుడు దల్జీర్ సింగ్ 20 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు.. మీ నిర్వాకం వల్లే కదా. రైతు వ్యతిరేక చట్టాలు తెస్తున్నారు. మీరు పాలిస్తున్న రాష్ట్రాల్లో సన్న వడ్లకు 500 బోనస్ ఇస్తున్నారా...? 2 లక్షల రుణమాఫీ పూర్తి చేశారా. కిషన్ రెడ్డి, బండి సంజయ్, కేటీఆర్ ఒకే స్వరం తో మాట్లాడుతున్నారు. పీఎం కిసాన్ సమ్మన్ యోజన కింద అప్లై మళ్ళీ చేసుకోవాలా. రైతులను అవమానిస్తుంది మీరా..మేమా..? ఐటీ కడుతున్న వాళ్ళకి లేదు..ప్రభుత్వ ఉద్యోగులకు కిసాన్ సమ్మాన్ మీరు ఇవ్వడం లేదని అన్నారు.

రాష్ట్రంలో ఉన్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఇస్తామన్న ప్రతి హామీ అమలు చేశాం. బిఆర్ఎస్ హయాంలో ఆర్థిక పరిస్థితుల పై అనేక సందర్భాల్లో శ్వేత పత్రం అడిగాం..అప్పుడు ఏనాడు చెప్పలేదు.పైన పటారం లోనా లోటారం అన్న విధంగా వ్యవహరించారు. మీరు ఇచ్చిన హామీల పై ఒకసారి సమీక్ష చేసుకోండి మేము చర్చకు సిద్ధం. .ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి చూస్తున్నారు. మేము మాట తప్పమా లేదా ప్రజలు నిర్ణయిస్తారు. గుట్టలకు ,రోడ్లు ,రాళ్ళు,వ్యవసాయ యోగ్యం లేని భూములకు రైతు భరోసా ఇవ్వాలని చెప్తుందా, బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. యూపీఏ ప్రభుత్వంలో 72 వేల కోట్ల రుణమాఫీ చేశాం. నరేంద్ర మోడీ డ్రెస్సింగ్ మీద తప్ప దేశం కోసం ఏం నిర్ణయం తీసుకున్నారు. బీజేపీ ప్రభుత్వం కి రైతుల మీద ప్రేముంటే మేము ఇస్తున్న రైతు భరోసా కి మీరు 12 వేలు జమ చేయండి. తెలంగాణ రాష్ట్రం తెలంగాణ ప్రయోజనాలకు ఏం చేస్తారో చెప్పండి. మేము రైతుల కోసం చేస్తున్న సన్న వడ్లకు 500 బోనస్ ,భూమి లేని పేదలకు 12 వేలు ,రైతు రుణమాఫీ మీరు పాలిస్తున్న రాష్ట్రాల్లో ఎక్కడైనా అమలు చేశారా అని ప్రశ్నించారు.

# పంచాయతీలతోపాటే మున్సిపల్ ఎన్నికలు..

హైదరాబాద్, జనవరి 6,తెలంగాణలో పంచాయతీల కాలపరిమితి ముగిసి ఏడాది కావస్తోంది. మరోవైపు ఈనెల 26తో మున్సిపాలిటీల పదవీకాలం ముగియనుంది. దీంతో పంచాయతీ ఎన్నికలతోపాటే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే 11 నెలలుగా ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అభివృద్ధి కుంటుపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లు సవరించాలని నిర్ణయించింది. బీసీలకు 40 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. సంక్రాంతి తర్వాత రిజర్వేషన్లు ప్రకటించే అవకాశం ఉంది. అయితే జనవరి 26న మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు కూడా ముగియనుంది. దీంతో రాష్ట్రం ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలతోపాటే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఇప్పటికే సంక్రాంతి తర్వాత పంచాయతీ ఎన్నికల నోటిపికేషన్ ఇచ్చి.. ఫిబ్రవరిలో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. కులగణన వివరాలు ఇప్పటికే బీసీ డెడికేషన్ కమిషన్‌కు చేరడంతో త్వరలోనే రిపోర్ట్ ప్రభుత్వానికి ఇవ్వనుంది. దీని ప్రకారం రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఆ తర్వాత పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉంది. బీసీ రిజర్వేషన్ల అంశం పెండింగ్‌లో ఉండడంతోనే ఎన్నికలు ఆలస్యం అవుతున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు ఆ సమస్య లేదు. దీంతో పంచాయతీ ఎన్నికలతోపాటే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.రాష్ట్రంలో ఇప్పటికే 141 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లు ఉన్నాయి. ఇటీవల కొత్తగా 12 మున్సిపాలిటీలు, రెండు(మహబూబ్‌నగర్, మంచిర్యాల) కార్పొరేషన్లను ప్రబుత్వం ఏర్పాటు చేసింది. దీనిపై రెండు రోజుల్లో గెజిట్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఇందులో 129 మున్సిపాలిటీల పదవీకాలం జనవరి 26న ముగుస్తుంది. మరో ఏడు మున్సిపాలిటీలు కార్పొరేషన్ల టర్మ్ మే వరకు ఉంది. జీహెచ్ఎంసీ పదవీకాలం ఫిబ్రవరి వరకు ఉంది. ఈ ఏడాది డిసెంబర్, లేదా వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. గతంలో 138 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి 5 మున్సిపాలిటీలు(పాల్వంచ, జహీరాబాద్, మణుగూరు, ఆసిఫాబాద్, మంమర్రి)కు ఎన్నికలు జరగలేదు.ప్రభుత్వం ఇటీవల 12 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్లతోపాటు కరీంనగర్ కార్పొరేషన్ పరిధి పెంచింది. ఈ మేరకు అసెంబ్లీలో ప్రకటన చేసింది. 12 మున్సిపాలిటీల్లో కోహిర్, గుమ్మడిదల, గడ్డ పోతారం, ఇస్నాపూర్(సంగారెడ్డి జిల్లా), చేవెళ్ల, మెయినాబాద్(రంగారెడ్డి జిల్లా), మద్దూర్(కొడంగల్ నియోజకవర్గం), దేవకద్ర (మహబూబ్‌నగర్ జిల్లా), కేసముద్రం, స్టేషన్ ఘన్‌పూర్(వరంగల్ జిల్లా), అశ్వారావుపేట,(కొత్తగూడెం జిల్లా) ఏదులాలాపురం(ఖమం జిల్లా) ఉఆన్నయి. వీటిలో జనాభా, ఓటర్ల ప్రకారం ఈ ప్రాసెస్ పూర్తి కానున్నట్లు సమాచారం. మరోవైపు హైదరాబాద్ శివారులో ఉన్న 58 6గామ పంచాయతీలను సైతం శివారు మున్సిపాలిటీల్లో సర్కార్ విలీనం చేసింది. ఇక్కడ కూడా వార్డుల విభజన చేయనుంది. ఇవన్నీ నెల రోజుల్లో కొలిక్కి ఆరనున్నాయి. పంచాయతీ ఎన్నికలతోపాటు మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సమస్య ఉండదనే అభిప్రాయం కూడా ఉంది.లోకల్ బాడీల్లో బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు ప్రభుత్వం ఇటీవలే కుల గణన చేపట్టింది. ఇందుకు సంబంధించిన డేటా ఎంట్రీ పూర్తయింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు బీసీ డెడికేటెడ్ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వారంలోగా నివేదిక అందే అవకాశం ఉందని సమాచారం. దీని ప్రకారం రిజర్వేషన్లు ప్రకటించే అవకాశం ఉంది. ఆ తర్వాత పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది.

# బీజేపీ కొత్త అధ్యక్షుడు ఎవరు..

హైదరాబాద్, జనవరి 6, తెలంగాణ బీజేపీలో రాష్ట్ర అధ్యక్షుడి ఎంపికపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కొత్త అధ్యక్షుడిగా ఎవరిని నియమిస్తారు? ఈ నియామకం ఎప్పుడు జరుగుతుంది? అనేది ఆశావహులతో పాటు బీజేపీ సీనియర్ నేతలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా మరోవైపు తెలంగాణ బీజేపీ స్టేట్ ఇంఛార్జ్ సునీల్ బన్సల్ స్వయంగా రంగంలోకి దిగడం ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకుంది.ఈ క్రమంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సునీల్ బన్సల్ ఆ పార్టీ నేతలతో భేటీ కానున్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో పాటు బీజేపీ నేతలతో సునీల్ బన్సల్ వరుసగా భేటీ కావడం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపై ఆసక్తిని రేపుతోంది. తెలంగాణలో బీజేపీ గెలుపే లక్ష్యంగా జాతీయ నాయకత్వం ప్రణాళికలు రచిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరిని నియమిస్తే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని జాతీయ నాయకత్వం యోచిస్తోంది.ఆదివారం ఉదయం నుండి కూడా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్.. వరుసగా తెలంగాణ బీజేపీ నేతలతో సమావేశం అవుతున్నారు. జాతీయ నాయకత్వం స్వయంగా తెలంగాణపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టింది. బూత్ కమిటీల నుండి రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక వరకు పూర్తిగా తమ కనుసన్నల్లోనే నియామకం జరిగే విధంగా ప్రణాళికలు రచించారు. ఇప్పటికే బూత్ కమిటీలు పూర్తవగా, మండల కమిటీలు దాదాపుగా అన్ని జిల్లాల్లో పూర్తి కావస్తోంది. జిల్లా కమిటీలు కూడా నియమించుకోనున్నారు.గత మూడు రోజులుగా జిల్లాలకు వెళ్లి రాష్ట్ర నాయకత్వం అక్కడ మండల కమిటీలను పూర్తి చేసింది. జిల్లా అధ్యక్షుల ఎంపికపైన కూడా కసరత్తు నడుస్తోంది. ఇదే అంశంపై సునీల్ బన్సల్ ఆయా జిల్లాల ముఖ్య నేతలతో సమావేశం అవుతున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎవరైతే బాగుంటుంది అనే అంశంపై అభిప్రాయాలు సేకరణ చేస్తున్నారు. ప్రతి జిల్లా నుంచి మూడు పేర్లు తీసుకుని, జిల్లా అధ్యక్షుడిగా ఒకరిని ఫైనల్ చేయనున్నారు.వచ్చే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ.. అందుకు అనుగుణంగా సంస్థాత నిర్మాణం మొదలు పెట్టింది. ముఖ్యంగా 2025లో తీసుకునే నిర్ణయాలు వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో.. కచ్చితమైన నిర్ణయాలు తీసుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది బీజేపీ అగ్ర నాయకత్వం. చిన్న స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పదవులు భర్తీ చేయనుండగా.. వ్యక్తుల ఎంపికపై ప్రత్యేకంగా దృష్టి సారించారు సునీల్ బన్సల్. జిల్లా, మండల అధ్యక్షుల ఎంపికపైనా జాతీయ నాయకత్వం ఫోకస్ పెట్టిందంటే.. ఏ స్థాయిలో తెలంగాణ నాయకత్వంపై బీజేపీ హైకమాండ్ దృష్టి సారించిందో అర్థం చేసుకోవచ్చు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డ, సునీల్ బన్సల్, ఎన్నికల ఇంచార్జ్ అరవింద్ మీనన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ తివారీలు.. పార్టీ నేతలతో సమావేశం అవుతున్నారు. జిల్లా అధ్యక్షుల ఎంపిక పూర్తి కాగానే, రాష్ట్ర అధ్యక్షుడి ఎంపికపైనా దృష్టి సారించనున్నారు. ఇప్పటికే దానిపై అభిప్రాయ సేకరణ మొదలైనట్లు తెలుస్తోంది. ఈటల రాజేందర్, బండి సంజయ్, అరవింద్, రఘునందన్ రావు, రామచందర్ రావు, మనోహర్ రెడ్డి పేర్లు బీజేపీ అధ్యక్షుడి రేసులో వినిపిస్తున్నాయి.

# లోయలో పడి నలుగురు దుర్మరణం

తిరువనంతపురం కేరళలోని ఇడుక్కిలో ఘోర ప్రమాదం జరిగింది. విహారయాత్రకు వెళ్లి తిరిగివస్తుండగా సోమవారం ఉదయం ఓ ఆర్టీసీ బస్సు లోయలో పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు సహా నలుగురు మృతి చెందారు. 23 మంది క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కొంతమంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో 34 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. మృతులను అరుణ్ హరి, రమా మోహన్, బిందు నారాయణన్, సంగీత్గా గుర్తించారు.

# హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణం

హైదరాబాద్, జనవరి 6,హైదరాబాద్‌తోపాటు తెలంగాణ అభివృద్ధిలో గేమ్‌ఛేంజర్‌గా భావించే హైదరాబాద్ రీజినల్ రింగ్‌రోడ్డును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వాలు ప్రక్రియను వీలైనంత త్వరగా చేపట్టాలని చూస్తున్నాయి. ఇప్పటికే నార్త్‌కు సంబంధించిన టెండర్లకు సంబంధించిన నోటిఫికేషన్ కూడా రానే వచ్చింది. దీంతో ఈ ట్రిపుల్ ఆర్‌పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు ఇవ్వాల్సిన పరిహారం విషయంలో కూడా ఉదారంగా ఉంటాలంటూ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్లు, స్థానిక ప్రతినిధులు రైతులు, ప్రజలతో మాట్లాడి అవగాహన కల్పించాలని వారి సమస్యలు అడిగి తెలుసుకోవాలని హితవుపలికారు. ఓవైపు ట్రిపుల్ ఆర్‌కు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేస్తూనే మరోవైపు దానికి అనుసంధానంగా ఉండే రోడ్ల నిర్మాణం, వాటికి అవసరమయ్యే భూసేకరణపై కూడా రేవంత్‌రెడ్డి ఫోకస్ పెట్టారు. హైదరాబాద్‌ను కలిపే 11 రోడ్లకు ఆంటంకం లేకుండా రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. హ్యామ్ విధానంలో ఆర్ అండ్ బీ పరిధిలో 12 వేల కిలోమీటర్లు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 17,700 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించాలని ఆదేశించారు. దీని కోసం పాత జిల్లాలను యూనిట్‌గా తీసుకోవాలన్నారు. హ్యామ్ అంటే... హైబ్రీడ్ యాన్యుటీ మోడల్‌ను హ్యామ్ అంటారు. ట్రిపుల్ విధానంలో ఇదో రకం అన్నమాట. అంటే పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ద్వారా నిర్మించే వాటిని హ్యామ్ పద్ధతిలో చేపడుతుంటారు. ముఖ్యంగా దేశంలోని జాతీయ రహదారులను ఈ హ్యామ్ విధానంలో నిర్మిస్తున్నారు. ఒక ప్రాజెక్టుకు సంబంధించిన మొత్తం ఖర్చులో 40 శాతం పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు ముందుగానే చెల్లిస్తారు. ఇవ్వాల్సిన మిగతా డబ్బులను విడతల వారీగా పనులు చేసిన తర్వాత ఇస్తారు. ఇలా హైబ్రీడ్ విధానంలో చెల్లింపులనే హ్యామ్ విధానం అంటారు.ఇప్పటి వరకు భారత్‌లో అమలులో ఉన్న బీవోటి యాన్యుటీ, ఇఖఅ మోడల్‌ల మిశ్రమం. బీవోటీ యాన్యుటీ విధానంలో ఓ ప్రాజెక్టును కాంట్రాక్టర్ పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించిన తర్వాత డబ్బులను విడతల వారీగా ఆరు నెలల్లో చెల్లిస్తారు. ఇఖఅ మోడల్‌లో ప్రభుత్వం నిర్మాణ ఖర్చు మాత్రమే భరిస్తుంది. టెక్నికల, సాంకేతిక సేవల ఖర్చు, యంత్రాల ఖర్చు మొత్తం కాంట్రాక్టర్ భరిస్తాడు. ప్రజాక్టు పూర్తి అయిన తర్వాత ప్రభుత్వం చెల్లింపులు చేస్తుంది. ఇందులో ప్రైవేటు వ్యక్తుల పాత్ర చాలా తక్కువగా ఉంటుంది. ఈ రెండింటిని మేళవించే హ్యామ్ విధానం తీసుకొచ్చారు. దీని ప్రకారం మొదటి ఐదేళ్లలో వార్షిక చెల్లింపులు ద్వారా ప్రభుత్వం ప్రాజెక్ట్ వ్యయంలో 40% వాటా చెల్లించేస్తుంది. డెవలపర్ పనితీరు ఆధారంగా మిగిలిన చెల్లింపు ప్రాజెక్టు తర్వాత చెల్లిస్తారు. మొదటి 40% చెల్లింపు ఐదు వాయిదాల్లో క్లియర్ చేస్తారు. మిగిలిన 60% ప్రాజెక్ట్ పూర్తైన తర్వాత మొత్తంగా ఇచ్చేస్తారు. ఈ విధానంలో ప్రభుత్వం 40% మాత్రమే చెల్లిస్తుంది కాబట్టి నిర్మాణ దశలో డెవలపర్ మిగిలిన మొత్తానికి సర్దుకోవాల్సి ఉంటుంది. డెవలపర్‌కు తర్వాతా ఎలాంటి రైట్ ఉండవు. ఇక్కడ ప్రయోజనం ఏంటంటే డెవలపర్‌కు తగినంత నగదును ముందుగా ఇస్తుంది. ఎక్కువ ఆర్థిక నష్టాన్ని ప్రభుత్వం భరిస్తుంది. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం లోకల్ రోడ్ల నిర్మాణానికి ఈ విధానాన్ని అనుసరించబోతున్నారు. మూడేళ్లలో ఆర్ అండ్ బీ, పంచాయతీ రోడ్ల నిర్మాణం పూర్తి కావాలని చెబుతున్న ప్రభుత్వం అందుకే సరైన విధానం హ్యామ్ పద్ధతి అని భావిస్తోంది. ఈ విధానంలో అమరావతిలో కొన్ని ప్రాజెక్టులు చేపట్టారు. తర్వాత జగన్ సర్కారు కూడా తాగునీటి సరఫరా ప్రాజెక్టును కూడా ఈ విధానంలో చేపట్టింది. అయితే కేంద్ర ప్రభుత్వం చేపట్టే జాతీయ రహదారులు తప్ప వేరే ఏ పెద్ద ప్రాజెక్టులు కూడా ఈ విధానంలో త్వరితగతిన పూర్తి కాలేదు. జాతీయ రహదారుల నిర్మాణానికి అనురిస్తున్న హ్యామ్ విధానాన్నే రాష్ట్ర రహదారులకు వర్తింపజేయాలని రేవంత్ సర్కారు భావిస్తోంది. వరదలకు పాడైన రోడ్లు, శిథిలావస్థకు చేరిన వంతెనలు, రిపేర్లకు అవసరమైన నగదు విడుదల చేసి కేంద్రం రావాల్సిన నిధులను కూడా సాధించుకోవాలని సూచించారు.

# ఒత్తిడి నుంచి బయిట పడేదెలా...

## రేవంత్ వ్యూహం ఏమిటీ..

హైదరాబాద్, జనవరి 6,ఆంధ్రప్రదేశ్ లో సినిమా ధరలను పెంచేశారు. సంక్రాంతి పండగకు విడుదలయ్యే సినిమాలకు అధిక ధరలకు విక్రయించేందుకు ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చేసింది. రోజుకు ఐదు షోలకు కూడా అనుమతి ఇచ్చింది. తెలంగాణలో సంధ్య థియేటర్ జరిగిన తర్వాత కూడా ఏపీ ప్రభుత్వం టాలీవుడ్ ను దూరం చేసుకోలేక ఈరకమైన నిర్ణయం తీసుకుందన్న విమర్శలు సోషల్ మీడియాలో బహిరంగంగా వినిపిస్తున్నాయి. అయితే ఆ సంఘటన ఏపీలో జరగకపోవడంతో అక్కడి ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేస్తుందనుకోవాలి. అలాగే హీరోలు, సినీ నటులు థియేటర్లకు రాకుండా కూడా ముందు జాగ్రత్త చర్యలు తీసుకునే అవకాశముంది. ఒక్కొక్క టిక్కెట్ ధరను ఆరువందల రూపాయల వరకూ పెంచారు. అయితే తెలంగాణలో ఇప్పటి వరకూ సంక్రాంతి సినిమాలకు సంబంధించి టిక్కెట్ల ధరలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నెల 10వ తేదీన గేమ్ ఛేంజర్ విడుదల కానుండటంతో పాటు బాలకృష్ణ సినిమా డాకూ మహారాజ్, వెంకటేశ్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాలు విడుదలవుతున్నాయి. ఈ సినిమాలకు టిక్కెట్ల ధరలను పెంచాలని నిర్మాతలు సహజంగా కోరే అవకాశముంది. ఇప్పటికే తెలంగాణ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు పోలీసు ఉన్నతాధికారులతో చర్చించి టిక్కెట్ల ధరల పెంపు, అదనపు షోలకు అనుమతులపై చర్చించినట్లు చెబుతున్నారు. అయితే నిర్ణయం మాత్రం ఇంకా బయటకు వెల్లడి కాలేదు. ఒకవేళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం టిక్కెట్ ధరల పెంపునకు అనుమతి మంజూరు చేస్తే మాత్రం మొన్న పెరిగిన పరపతి మాత్రం దిగజారే అవకాశముంటుంది. ఎందుకంటే అల్లు అర్జున్ అరెస్ట్ తో కొంత ఇమేజ్ పెంచుకున్న తెలంగాణ సర్కార్ తిరిగి అదే తప్పును చేస్తే మాత్రం ప్రజలు ఓస్ ఇంతేనా? అన్న రీతిలో పెదవి విరుస్తారన్నది గ్యారంటీ. ఇటీవల టాలీవుడ్ పెద్దలతో జరిగిన సమావేశంలోనూ టిక్కెట్ల ధరల పెంపుదల, బెనిఫిట్ షోలకు అనుమతి లేదని చెప్పినట్లు వార్తలు వచ్చాయి.

ఒకవేళ ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంటే కేవలం దిల్ రాజు కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారన్న విమర్శలను ఎదుర్కొనక తప్పదు. ఇప్పటికే సోషల్ మీడియాలో దీనిపై కామెంట్స్ కనపడుతున్నాయి. ఏపీలో ధరలు పెంచడంతో ఇక్కడ కూడా ధరలు పెంచాలని నిర్మాతలు కోరుతున్నారు. మరి రేవంత్ సర్కార్ ఏం చేస్తుందన్నది వేచి చూడాల్సిందే.

పోలవరంపై అధ్యయనం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ గురువైన చంద్రబాబుకు మాస్టర్ స్ట్రోక్ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణ పై పడే ప్రభావాన్ని అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ కు చెందిన ఐఐటీబృందంతో వెంటనే అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. నెల రోజుల్లోగా దీనిపై తమకు సమగ్రమైన నివేదికను సమర్పించాలని కోరారు. ఇందుకోసం రేవంత్ రెడ్డి ఐఐటీ బృందంతో సమన్వయం చేసుకునేందుకు ప్రత్యేక అధికారిని కూడా నియమించనున్నారు. ప్రధానంగా పోలవరం కారణంగా భద్రాచలానికి ఏర్పడే ముప్పును తెలియజేయాలని రేవంత్ రెడ్డి కోరారు. 2027లో గోదావరి వరదల కారణంగా భద్రాచలం మునిగిపోయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు బనకచర్ల ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభ్యంతరం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీకి మన అభ్యంతరాలను తెలియజేయాలని తెలంగాణ చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. వరద జలాల ఆధారంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఆ ప్రాజెక్టును నిర్మిస్తున్నారని రేవంత్ రెడ్డి తెలంగాణ మంత్రి వర్గ సమావేశంలో అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అవసరమైతే కేంద్ర జలనరుల శాఖకు, కేంద్ర ప్రభుత్వానికి కూడా లేఖ రాయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గోదావరి నది నుంచి నీటిని కృష్ణానదికి తరలించి అక్కడి నుంచి బనకచర్ల ప్రాజెక్టుకు మళ్లించి అక్కడి నుంచి రాయలసీమలోని అన్ని జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాకు కూడా నీటిని సరఫరా చేయాలన్నది ఈ ప్రాజెక్టు ఉద్దేశ్యమన్నారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు కారణంగా భద్రాచలంలో పాటు అనేక గ్రామాలు నీట మునుగుతున్నాయని, గోదావరి నీటిని ఎలాంటి అనుమతులు లేకుండా ప్రాజెక్టులను నిర్మించి తరలించడంపై రేవంత్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి “గేమ్ ఛేంజర్” అని చెప్పిన ప్రాజెక్టుపై అభ్యంతరాలను తెలియజేస్తూ లేఖలను రాయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అయితే ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల కేవలం వరద నీటిని మాత్రమే తరలిస్తున్నామని, వృథాగా పోయే నీటిని మాత్రమే రాష్ట్రానికి వినియోగించాలని నిర్ణయమని ఏపీ తరుపున వాదన వినిపిస్తుంది. కానీ దానివల్ల తెలంగాణకు కూడా నష్టమేనని ఆ ప్రాంత అధికార పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

# 26 నుంచి కొత్త రేషన్ కార్డులు

వరంగల్, జనవరి 6,లంగాణ ప్రజలకు ఇదొక సువర్ణవకాశం. ఎన్నేళ్ల నుండో మీ ఎదురుచూపులకు ఫుల్ స్టాప్ పడనుంది. ఆ ఒక్కటి లేక మీరు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అందుకే తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. మీరు అర్హులైతే ఈ విషయం తెలుసుకోండి. మిస్ మాత్రం కావద్దు. ఎందుకంటే మళ్లీ ఎప్పుడో ఈ అవకాశం రావచ్చు. సీఎం రేవంత్ రెడ్డి అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఏ పథకం వర్తించాలన్న ఈ ఒక్కటి ప్రామాణికం కాబట్టి, అర్హత ఉంటే చాలు దరఖాస్తు చేసుకోండి.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ఏ పథకం వర్తించాలన్న, రేషన్ కార్డు తప్పనిసరని మనందరికీ తెలుసు. రేషన్ కార్డు ఉంటే నెలవారీ రేషన్ ఒక్కటే కాదు, పింఛన్ ఇలా ఒకటి కాదు ఎన్నో పథకాలతో లబ్ది పొందవచ్చు. అర్హత ఉండి కూడ రేషన్ కార్డు లేని వారు ఎందరో ఉన్నారు. వారి సమస్యలను గుర్తించిన సీఎం రేవంత్ సర్కార్, కీలక నిర్ణయం తీసుకుంది. అయితే మొన్నటి వరకు నూతన రేషన్ కార్డులు అందజేస్తారా లేదా అన్నది ప్రజలకు ఉన్న అనుమానం. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ఇచ్చిన మాటకు కట్టుబడి గుడ్ న్యూస్ చెప్పేశారు.సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు ప్రక్రియ మొదలవుతుందన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని సీఎం అన్నారు. సీఎం మాటతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్ లు సంబంధిత అధికారుల ద్వార ఎన్ని కుటుంబాలకు నూతన రేషన్ కార్డులు అవసరమో ఆరా తీశారు. అయితే ఈ నెల 15 నుండి రేషన్ కార్డుల మంజూరుకు దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరిస్తారని సమాచారం.ఏ పథకం వర్తించాలన్న రేషన్ కార్డు ప్రామాణికం కాబట్టి, అర్హులు ఎప్పటికప్పుడు రెవిన్యూ అధికారుల ద్వార సమాచారం తెలుసుకొని దరఖాస్తులు సమర్పించాల్సి ఉంది. ఎందుకంటే మళ్లీ మళ్లీ అవకాశం రాదు కాబట్టి, ప్రభుత్వం కల్పించిన బృహత్తర అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ కోరుతోంది. మరి మీరు అర్హులైతే దరఖాస్తు చేసేందుకు సిద్ధం కండి!

# గెలిచినా గుర్తింపు ఏదీ...

హైదరాబాద్, జనవరి 6, పార్టీ అధికారంలో లేకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పరిస్థితి గమ్మత్తుగా మారింది. పేరుకే ఎమ్మెల్యే కానీ ప్రజలకు, కార్యకర్తలకు ఏ పని చేసి పెట్టలేని పరిస్థితుల్లో ఉన్నారట కారు పార్టీ ఎమ్మెల్యేలు. తమ నియోజకవర్గాల్లో..హస్తం పార్టీ నేతల హవా కొనసాగుతుండటాన్ని తట్టుకోలేకపోతున్నారట. అధికార యంత్రాంగం హస్తం పార్టీ నేతలకే ప్రయారిటీ ఇస్తుండటంపై కూడా మండిపడుతున్నారు.కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అయితే తమ హక్కుల కోసం న్యాయపోరాటం చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్, కోరుట్ల, కరీంనగర్, సిరిసిల్ల నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. అయితే ఈ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల కంటే..ఓడిన కాంగ్రెస్ నేతల హవాను ఎక్కువ నడుస్తుందట.అధికారం చేతులు మారితే ఎలా ఉంటుందనేది ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాలే ఓ ఉదాహరణగా కనిపిస్తోంది. దశాబ్దకాలం పాటు అధికారంలో ఉన్నప్పుడు సిరిసిల్లలో కేటీఆర్ హవా కొనసాగింది. కానీ ఇప్పుడు సిరిసిల్లలో సీన్ మారిపోయిందట. కేటీఆర్ కనుసన్నల్లోనే నడిచిన సిరిసిల్ల రాజకీయాలను..కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ తమ గుప్పిట్లో పెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారట.కేటీఆర్‌కు ప్రాధాన్యత లేకుండా చేసేందుకు నేతన్నలతో పాటుగా..కేటీఆర్ ఫాలోవర్స్‌ను తమ వైపు తిప్పుకునేందుకు ప్లాన్ చేస్తున్నారట. ఇక కరీంనగర్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ లేకుండానే రివ్యూలు జరుగుతుండటం చర్చనీయాంశంగా మారింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రోటోకాల్ పాటించడం లేదంటూ బీఆర్ఎస్ శ్రేణులు గరమ్ అవుతున్నాయి.ఇక హుజురాబాద్, కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ కుమార్ మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. నియోజకవర్గంలో తమకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవాలని తాపత్రయపడుతున్న ఈ ఇద్దరు శాసనసభ్యులకు..కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్‌లు బ్రేకులు వేస్తున్నారట.హుజురాబాద్ నియోజకవర్గంలో కౌశిక్ రెడ్డిపై పోటీ చేసి ఓడిన కాంగ్రెస్ నేత ప్రణవ్ బాబు నియోజకవర్గ రాజకీయాలను తన గుప్పిట్లో పెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారట. అధికార యంత్రాంగం కూడా ప్రణవ్ బాబు చెప్పిన పనులను వెంటనే చేస్తూ..ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆదేశాలను పట్టించుకోవడం లేదట. దీంతో తన మాట వినని అధికారులపై ఆగ్రహంతో ఊగిపోతున్నారట ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి.ఇటీవల కళ్యాణ లక్ష్మి చెక్కుల వ్యవహారంలో తన హక్కులకు భంగం కలిగిస్తున్నారంటూ కోర్టును ఆశ్రయించారు. ప్రోటోకాల్ పాటించకపోతే ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తానంటూ ఎమ్మెల్యే కౌశిక్ హెచ్చరిస్తున్నా ఫలితం లేకుండా పోతుందట.ఇక కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమారా..? లేక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ రావా.. అన్నట్లుగా ఉందట పరిస్థితి. ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్ కంటే..పోటీ చేసి ఓడిన నర్సింగరావు హవానే కొనసాగుతుండటంతో బీఆర్ఎస్ క్యాడర్, లీడర్లకు ఏ మాత్రం మింగుడు పడటం లేదట. ఈ నియోజకవర్గాల్లో అటు ఎమ్మెల్యేలు, ఇటు హస్తం నేతల మధ్య అధికారులు నలిగిపోతున్నారట.కొందరు అధికారులు ఓవరాక్షన్ చేస్తుండటంతో భవిష్యత్‌లో వచ్చేది తమ ప్రభుత్వమేనంటూ హెచ్చరిస్తున్నారట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు. పవర్ చేతులు మారితే..సీన్ ఎలా మారిపోతుందో కాంగ్రెస్ నేతల హవా చూస్తేనే అర్థమవుతుందన్న చర్చ జరుగుతోంది.

# ఒక్క విద్యార్థి కూడా లేని 2097 పాఠశాలలు

హైదరాబాద్, జనవరి 6, దేశంలో విద్యా వ్యవస్థ రోజు రోజుకు మరింత దిగజారిపోతున్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడీఐఎస్ఈ) ప్లస్ ఒక నివేదిక రిలీజ్ చేసింది. అందులో ఆసక్తి గొలిపే వాస్తవాలు వెలుగు చూశాయి. ఒక వైపు వసతి గృహాలు, మరో వైపు గురుకులాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ విద్యా విధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని చెప్తున్న అధికారులకు సాధారణ పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడం ఇబ్బందిగా మారుతోంది. గురుకులాల కోసం కార్పొరేట్ స్థాయిలో భవనాలను నిర్మించి పేద, మధ్య తరగతి పిల్లలకు విద్య అందిస్తోంది. ప్రైవేట్ కు ధీటుగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను మారుస్తామని చెప్తున్న ప్రభుత్వాధికారులకు కొన్ని పాఠశాలలు తలనొప్పిగా మారాయి. తెలంగాణ రాష్ట్రంలో పాఠశాల విద్య మరింత దిగజారుతుందనేందుకు నిదర్శనంగా 2,000 పాఠశాలల్లో విద్యార్థులు లేరని ఖాళీ తరగతి గదులు మాత్రమే ఉన్నాయని విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా (జఆమోఇ) నివేదిక చెప్తోంది.2023-24కి సంబంధించిన జఆమోఇ ప్లస్ నివేదిక ప్రకారం.. మొత్తం 2,097 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా లేదని పేర్కొంది. ఇది రాష్ట్రంలో పాఠశాల విద్య పరిస్థితిని హైలైట్ చేస్తుంది. పశ్చిమ బెంగాల్ 3,254, రాజస్తాన్ 2,167 పాఠశాలల తర్వాత జీరో ఎన్‌రోల్‌మెంట్‌లతో అధిక సంఖ్యలో పాఠశాలలతో తెలంగాణ దేశంలోనే మూడో రాష్ట్రంగా నిలిచింది. జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్నప్పటికీ, పాఠశాలల్లో 2,000 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.మొత్తం 88,429 మంది విద్యార్థులతో 5,985 పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఉన్నాడని వెలుగులోకి వచ్చిన మరో ఆశ్చర్యకరమైన సమాచారం. 2023-24 విద్యా సంవత్సరంలో అన్ని మేనేజ్‌మెంట్ల కింద మొత్తం 72,93,644 మంది విద్యార్థులు, 3,41,460 మంది టీచర్లతో రాష్ట్రం 42,901 పాఠశాలలకు నిలయంగా మారింది. ఇంకా, ప్రభుత్వ పాఠశాలల్లో 2021-22లో 33,03,699 నుంచి 2022-23లో 30,09,212కి 2023-24 విద్యా సంవత్సరంలో 27,79,713కి తగ్గింది.రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాల స్థాయి వరకు సున్నా డ్రాపౌట్ రేటు నమోదైంది. అయినప్పటికీ సెకండరీ స్థాయిలో 13.3 శాతం బాలురు, 9.5 శాతం బాలికలు పాఠశాలకు రావడం మానివేయడంతో డ్రాపౌట్ రేటు 11.4 శాతానికి పెరిగింది. పై స్థాయికి వెళ్లేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. ఇంకా, 42,901 పాఠశాలల్లో 11.8 శాతం 10 కంటే తక్కువ విద్యార్థుల నమోదు చేసింది కేవలం 8.7 శాతం పాఠశాలల్లో మాత్రమే 500 కంటే ఎక్కువ మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు.బాలికలు, బాలురకు మరుగుదొడ్లు లేని పాఠశాలల గురించి కూడా నివేదిక పేర్కొంది. 29,383 బాలికల పాఠశాలల్లో 2,017 మరుగుదొడ్లు లేవని, మిగిలిన వాటిలో 2,277 మరుగుదొడ్లు పనిచేయడం లేదని, బాలుర విషయానికొస్తే 28,689 పాఠశాలల్లో 4,823 పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవని, 2,618 పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్నాయని తెలిపింది.

# తెలంగాణలో 55 శాతం బీసీలే...

హైదరాబాద్, జనవరి 6, బీసీలకు రాజ్యాధికారం ఇవ్వాలన్నది కాంగ్రెస్ నినాదం. దాని ప్రకారం అడుగులేస్తోంది. తన యాత్రలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పదేపదే ఈ విషయాన్ని నొక్కి వక్కానించారు. అంతేకాదు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కుల గణన చేపట్టింది. గతేడాది నవంబర్‌లో రేవంత్ సర్కార్ తెలంగాణ వ్యాప్తంగా కులగణన చేపట్టింది. ఇందులో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.దేశ జనాభాలో అధికంగా ఉన్న బీసీలకు చట్టసభల్లో అడుగుపెట్టే ఛాన్స్ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నినాదం. దీన్ని నెరవేర్చాలంటే కచ్చితంగా దేశవ్యాప్తంగా జనాభా గణనతోపాటు కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తోంది. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఈ నినాదాన్ని ప్రజల్లో తీసుకెళ్లారు. కాంగ్రెస్ ఎత్తుకున్న ఈ నినాదాన్ని కొన్ని ప్రాంతీయ పార్టీలు అందిపుచ్చుకున్నాయి. ఈ క్రమంలో పలు రాష్ట్రాలు కుల గణన సైతం చేశాయి. రిపోర్టు మాట కాసేపు పక్కనబెడదాం.ఏడాది కిందట తెలంగాణలో రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చింది. గత నవంబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా కుల గణన చేపట్టింది. ఈ సర్వేలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చినట్టు ప్రభుత్వ వర్గాల నుంచి ఓ వార్త బయటకు వచ్చింది. రాష్ట్ర జనాభాలో 55 శాతం బీసీలేనట. మరో 45 శాతం ఎస్టీ, ఎస్సీ, ఓసీ ఉన్నట్లు తేలింది. దీనికి సంబంధించిన నివేదికను రాష్ట్ర ప్రణాళిక సంఘం రెడీ చేసిందని సమాచారం.ఈ సర్వేను ఆపేందుకు విపక్షాలు తీవ్ర ప్రయత్నాలు చేశాయి. చివరకు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. అన్ని అడ్డంకులు అధిగమించి సర్వే చేపట్టింది రేవంత్ సర్కార్. మొత్తం కోటి 17 లక్షల 47 వేల ఇళ్లకు స్టిక్కర్లు వేశారు. అందులో 98 శాతం వరకు వివరాలు సేకరించినట్టు వెల్లడించింది ప్రభుత్వం. దీనికి సంబంధించిన రిపోర్టును రేపో మాపో ప్రభుత్వం వెల్లడించనుంది.సీఎం రేవంత్ అధ్యక్షతన శనివారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరగనుంది. ఇందులో కులగణన సర్వే నివేదికపై చర్చించే అవకాశమున్నట్లు ప్రభుత్వ వర్గాల నుంచి బలంగా వినిపిస్తోంది. ఫిబ్రవరిలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని సర్కార్ భావిస్తోంది. ఇవాళ జరగనున్న కేబినెట్‌లో మొత్తం 18 అంశాలు అజెండాలో ఉన్నట్లు సమాచారం. అందులో కులగణన కూడా ఉన్నట్లు తెలుస్తోంది.ఇక రాజకీయ పార్టీల విషయానికొద్దాం. రేపో మాపో స్థానిక సంస్థలకు నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో పార్టీలు యాక్టివ్ అయ్యాయి. వారం రోజులుగా బీసీల మంత్రాన్ని జపిస్తున్నాయి పార్టీలు. ఓ అడుగు ముందుకేసిన బీఆర్ఎస్.. స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ తెరపైకి తెచ్చింది.గడిచిన పదేళ్లు బీఆర్ఎస్ ఏం చేసిందంటూ అధికార పార్టీతోపాటు మేధావుల నుంచి కౌంటర్ల మీద కౌంటర్లు పడిపోతున్నాయి. గతంలో ఉన్న రిజర్వేషన్లు తగ్గించిన ఘనత బీఆర్ఎస్‌కే చెల్లుతుందని కుండబద్దలు కొడుతున్నాయి.ఇక బీజేపీకి దగ్గరకు వద్దాం. బీసీని ప్రధానిమంత్రి చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందం టూ ఆ పార్టీ నేతలు మీడియా ముందు ఒకటే రీసౌండ్. అలాంటప్పుడు కుల గణన చేయడానికి ఎందుకు వెనుకాడుతోందని విపక్షాల నుంచి ప్రశ్నలు రైజ్ అవుతున్నాయి. అయినా కులగణనపై ప్రధాని మీన మేషాలు లెక్కిస్తున్నారు. మొత్తానికి కులగణన అంశం ప్రధానికి కంటి మీద కునుకులేకుండా చేస్తోంది.

# పాస్ బుక్ లేకుండా వేల కోట్ల రుణాలు

## మాయలు ఇంతింతకాదయా...

నల్గొండ, జనవరి 6, రుణమాఫీ.. సాగు చేసే రైతన్నకు ఎలాంటి కష్టం రాకూడదని ప్రభుత్వం తీసుకున్న సంచలన నిర్ణయం. ఎంతో మంది రైతుల జీవితాల్లో వెలుగునింపిన ఈ నిర్ణయాన్ని.. కొందరు తమకు అనుకూలంగా మలుచుకున్నారు. ఈ సంక్షేమ పథకాన్ని అడ్డుగా పెట్టుకొని లక్షలు వెనకేసుకున్నారు. రుణమాఫీ తర్వాత ప్రభుత్వం బ్యాంకర్ల నుంచి తెప్పించుకున్న డేటాను డీకోడ్ చేస్తే సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అసలు ఎలాంటి పాస్‌బుక్స్ లేకుండానే వేల కోట్ల క్రాప్ లోన్లను మంజూరు చేసినట్టు గుర్తించారు. ఏకంగా 9.68 లక్షల బ్యాంక్ అకౌంట్లకు సంబంధించి 13 వేల 419 కోట్ల క్రాప్ లోన్లను మంజూరు చేసినట్టు గుర్తించారు.గతేడాది రుణమాఫీ అమలు చేసిన ప్రభుత్వం.. క్రాప్ లోన్ల వివరాలు ఇవ్వాలని అప్పట్లో బ్యాంకర్లను కోరింది. అయితే ఇందులో పాసు పుస్తకాలు కూడా లేకుండా ఇచ్చిన క్రాప్‌లోన్లు ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించింది. నకిలీ పాస్ బుక్స్ పెట్టి కొన్ని, ఫోర్జరీ సంతకాలతో తప్పుడు పాస్ బుక్స్ పెట్టి మరికొన్ని, అసలు పాస్ బుక్స్ కూడా లేకుండా ఇంకొన్ని రుణాలు పొందినట్టు ప్రాథమికంగా నిర్ధారించింది. అక్రమ ముఠాలతో పాటు కొందరు బ్యాంక్ అధికారులు కుమ్మక్కై‌లో వేల కోట్ల క్రాప్‌లోన్లను కొల్లగొట్టినట్టు గుర్తించింది. ఈ అక్రమ పంట రుణాలపై ప్రభుత్వం ఇంటర్నల్‌గా ఎంక్వైరీ చేయిస్తున్నట్టు సమాచారం. బ్యాంకులు కూడా ఏ మేనేజర్ ఉన్నప్పుడు ఆ క్రాప్లోన్లు మంజూరు చేశారనే దానిపై వివరాలు తీస్తున్నట్టు తెలిసింది.ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందన్న ధైర్యంతోనే అక్రమార్కులు బ్యాంకర్ల కలిసి ఈ తరహా దోపిడికి పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. లక్ష పంట రుణం తీసుకుంటే, అందులో 60:40 రేషియోలో అక్రమార్కులు, బ్యాంకర్లు పంచుకుంటున్నారు. ఇటీవల రుణమాఫీ సందర్భంగా ప్రభుత్వం లబ్ధి పొందిన రైతులకు మెసేజ్ పంపించడంతో క్రాప్ లోన్ తీసుకోకున్నా తమకు మెసేజ్ వచ్చిందని కొందరు చెప్పడంతో ఇలాంటి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.'32 బ్యాంకులు, 3 వేల 992 బ్రాంచ్‌ల నుంచి పంట రుణాల వివరాలు సేకరిస్తే వేల కోట్లు ఉన్నట్టు తేలింది. అసలు పట్టాదారు పాసు పుస్తకం తనఖా పెట్టుకోకుండా, నేరుగా ఆన్‌లైన్లోనే వివరాలను యాక్సెస్ చేసి ఆ భూములకు పంట రుణాలు ఇచ్చే ఫెసిలిటీ అందుబాటులోకి వచ్చింది. ఇదే ఇప్పుడు కొందరు బ్యాంకర్ల పాలిట వరంగా మారింది.

# తెలంగాణలో హరిగోస పడుతున్న వైద్య విద్యార్థులు

--- కళాశాలల్లోనే ఒరిజినల్ సర్టిఫికెట్స్

---- కస్టోడియన్ సర్టిఫికెట్ ఇచ్చి గెంటివేత

--- ఒరిజినల్స్ కు లక్షల్లో డిమాండ్ చేస్తున్న వైనం

---అవకాశాలు చేజారి పోతున్నాయంటూ విద్యార్థుల ఆవేదన

---రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తులు.

---ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతున్న బాధిత విద్యార్థులు




వైద్యో నారాయణ హరి అంటారు కానీ తెలంగాణ రాష్ట్రంలో అదే వైద్య విద్యార్థులు హరిగోస పడుతున్నారు అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.భారతదేశంలో గొప్ప ప్రజాస్వామ్యం పరిడవిల్లుతోందని ప్రపంచ వేదికల పైన ఉచిత ప్రసంగాలు చేస్తున్న స్థితిని చూసిన మన భారతమాత కన్నీరు పెడుతోందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. తొండ ముదిరి ఊసరవెల్లి ఐన చందంగా చిరు వ్యాపారస్తులుగా తమ ప్రయాణాన్ని ప్రారంభించి బడా వ్యాపారస్తులుగా అనతి కాలంలోనే ఎదిగిపోతున్నారు. అంతటితో ఆగకుండా వారి వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత రెట్టింపు చేసుకోవడానికి రాజకీయాల్లోకి రంగ ప్రవేశం చేస్తున్నారు. అనంతరం అసెంబ్లీ, పార్లమెంట్లలో అడుగు పెట్టి వారి వ్యాపార సామ్రాజ్యానికి అనుకూల చట్టాలను తయారు చేసుకుంటున్నారు. ఆ చట్టాలను వారి చుట్టాలుగా వాడుకుంటున్నారు. ముఖ్యంగా ఈ అప్రజాస్వామిక,అసాధారణ పోకడలు ఈ తెలుగు రాష్ట్రల్లో జోరందుకున్నాయి.గత అర్ధ దశాబ్ద కాలంగా తెలంగాణ రాష్ట్రంలో చోటు చేసుకున్న అసహజ పరిణామాలే ఇందుకు చక్కని ఉదాహరణ. తమ పిల్లల్ని డాక్టర్లుగా చూడాలనే పేద,మధ్య తరగతి తల్లిదండ్రుల కోరికనే తెలంగాణలోని ప్రైవేట్ మెడికల్ కాలేజీల కు అందివచ్చిన అవకాశంగా మారింది.ఉదాహరణకు "ఏ" అనే ఒక కోర్సు కు అప్పటివరకు ఆరు లక్షల చిల్లర ఉన్న ఫీజును అమాంతం 12 లక్షల వరకు పెంచి తీసుకోవడానికి అప్పటి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలు ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడకుండా , స్వార్థ ప్రయోజనాల కోసం,రాజకీయ మిత్రుల స్వప్రయోజనాల కోసం మాత్రమే తీసుకున్న నిర్ణయం అని ఇట్టే అర్థం అవుతుంది.ఒకవేళ పెంచాల్సిన అవసరం వస్తే యాభై వేలో,లక్షనో పెంచాలి కానీ అమాంతం ఉన్న ఫీజును రెట్టింపు చేయడం అంటే మమ్మల్ని దారి దోపిడీ చేసి దండుకోవడమేనని బాధిత వైద్య విద్యార్థినీ,విద్యార్థులు వారి ఆవేదనను వెలిబుచ్చుతున్నారు.ఇదిలా ఉండగా కొంతమంది విద్యార్థులు ఇదే అంశంపై న్యాయస్థానాలను ఆశ్రయించగా విద్యార్థులకు అనుకూలంగా తీర్పులు సైతం వచ్చినట్లు తెలుస్తోంది. న్యాయస్థానాల తీర్పులు సైతం గత ప్రభుత్వ హయాంలో అమలుకు నోచుకోలేదని వైద్య విద్యార్థులు వాపోతున్నారు. తెలంగాణలోని ప్రైవేట్ మెడికల్ కళాశాలలు ఏ మాత్రం వెనక్కి తగ్గకపోగా పెంచిన ఫీజులు కట్టాల్సిందేనని తెగేసి చెబుతున్నారు.న్యాయస్థానం తీర్పు వచ్చింది కదా అని ఎవరైనా ఎదురు మాట్లాడే ప్రయత్నం చేస్తే,మేము సుప్రీంకోర్టుకు వెళ్తున్నాం అక్కడ చూసుకుంటామని వైద్య విద్యార్థుల తల్లిదండ్రులను భయాందోళనకు గురి చేస్తున్నారు.కొంతమంది తల్లిదండ్రులు బ్యాంకు గ్యారంటీలను సైతం ఇచ్చి ఉన్నారు కనుక భవిష్యత్తులో ఉన్నత న్యాయస్థానాలు ఏ తీర్పు ఇచ్చిన ,ఆ తీర్పుకు కట్టుబడి అదనపు ఫీజు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని తల్లిదండ్రులు చెబుతున్న మాటలను ప్రవేట్ మెడికల్ కళాశాలల యాజమాన్యాలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

----అక్రమంగా కళాశాలల వద్దే ఒరిజినల్ సర్టిఫికెట్స్ .

ఎస్సెస్సి నుండి మొదలుకొని అన్ని స్టడీ సర్టిఫికెట్స్ తాము వైద్య విద్యను అభ్యసించిన ప్రైవేటు మెడికల్ కళాశాలలోనే ఉండడంతో అన్ని అర్హతలు ఉండి అనర్హులుగా మారామని వారి ఆవేదనను, ఆందోళన వెలిబుచ్చున్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్ లేని కారణంగా మాకు అందివచ్చిన అవకాశాలు సైతం చేజారి పోతున్నాయంటున్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్ కోసం కళాశాలల వద్దకు వెళ్తే కస్టోడియన్ సర్టిఫికెట్ ఇచ్చి గెంటి వేస్తున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన సైతం పనిచేయడానికి కూడా ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఉంటేనే అవకాశాలు కల్పిస్తున్నారు.ఏ మాత్రం పనికిరాని కస్టోడియన్ సర్టిఫికెట్ ను విద్యార్థుల చేతిలో పెట్టి తమ పని అయిందని చేతులు దులుపుకుంటున్నారన్నారు.దీంతో అన్ని అర్హతలు ఉండి అనర్హులుగా తమ పిల్లలు మిగిలిపోతున్నారని తల్లిదండ్రులు పడుతున్న బాధ వర్ణనాతీతం అనే చెప్పవచ్చు.

--- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలి.

గత ప్రభుత్వం ప్రైవేట్ మెడికల్ కళాశాలలకు అనుకూలంగా, ఉన్న ఫీజుని అమాంతం రెట్టింపు చేసి మమ్మల్ని ఆర్థిక దోపిడీ చేసే ప్రయత్నం చేసిందన్నారు.గత ప్రభుత్వానికి పలుమార్లు మా సమస్యను విన్నవించినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఈ దఫా రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని మా యొక్క పిల్లల ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇప్పించాలని వైద్య విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులకే ప్రవేట్ మెడికల్ కళాశాలలు ఉన్నందున మా గోడును పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. అన్ని వైద్య విద్య అర్హతలు ఉండి,రోడ్డున పడ్డ మా పిల్లల భవిష్యత్తును కాపాడాలని తెలంగాణ ముఖ్యమంత్రిని సవినయంగా వేడుకుంటున్నారు.

బిబిబిఉద్యమ కార్యాచరణకు సమాలోచనలు

గత అనేక పర్యాయాలుగా విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు పెడచెవిన పెడుతుండడంతో బాధిత వైద్య విద్యార్థిని,విద్యార్థులు ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. ఈ మధ్యలో ఖమ్మం కేంద్రంగా బాధిత వైద్య విద్యార్థిని,విద్యార్థులు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను ఏ విధంగా చేయాలి అనే దానిపై సమాలోచనలు చేసుకున్నట్లు తెలుస్తోంది.ఒరిజినల్ సర్టిఫికెట్స్ , ప్రభుత్వం ద్వారా కళాశాలలు పొందిన ఫీజు రియంబర్స్మెంట్ అక్రమాలపై, తదితర సమస్యలపై ఆందోళనలు చేయడానికి టైం టేబుల్ తయారు చేసుకున్నట్లు తెలుస్తోంది.

# ఇంటర్ విద్యాశాఖను ముట్టడించిన

## జూనియర్ లెక్చరర్ల అభ్యర్థులు

హైదరాబాద్ జూనియర్ లెక్చరర్ల అభ్యర్థులు ఇంటర్ విద్యాశాఖను ముట్టడించారు. ఎంపికైన జూనియర్ లెక్చరర్స్ అభ్యర్థులకు వెంటనే అపాయింట్ మెంట్ ఆర్డర్స్ ఇవ్వాలని జూనియర్ లెక్చరర్ల అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. 2008 తరువాత 2022 లో జూనియర్ లెక్చరర్ నోటిఫికేషన్ వచ్చింది. 14సంవత్సరాల తరువాత వచ్చిన జెఎల్ నోటిఫికేషన్ 2023లో పరీక్షలు నిర్వహించారు. 2024లో జులై లో టిజిపిఎస్ ఫలితాలు ప్రకటించింది. ఫలితాలు ప్రకటించి ఎంపికైన అభ్యర్థుల జాబితాను బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కు పంపడం జరిగింది. 2025 జనవరి6 న ఎంపికైన అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్స్ ఇస్తామని అభ్యర్థులకు సమాచారం ఇచ్చారు. కానీ 6న జరగవలసిన కౌన్సిలింగ్ ను నిలిపివేస్తున్నట్లు ఇంటర్ బోర్డ్ ప్రకటించింది. దీం తో 17సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న అభ్యర్థుల ఆశలపై నీళ్లు చాలడంతో అభ్యర్థులు మండిపడ్డారు. ప్రజాపాలనలో ఎవరికి అన్యాయం చేయం అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాకు ఎందుకు అన్యాయం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సంక్రాంతి లోపు 1392మంది నూతన జూనియర్ లెక్చరర్ లకు నియమకాపాత్రలు అందజేసి విధుల్లోకి చేర్చుగుకోవలని డిమాండ్ చేసారు.

# స్కూల్ బస్సు బోల్తా

నెల్లూరు బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని సాల్మాన్ పురం మినగల్లు గ్రామాల మార్గమధ్యంలో నెల్లూరు రూరల్ ప్రాంతానికి చెందిన శ్రీ నికేతన్ పాఠశాల బస్సు కాలువలో బోల్తా పడింది. వివరాల్లోకి వెళ్తే నెల్లూరు వైపు నుండి మినుగల్లు గ్రామానికి వెళ్లిన స్కూల్ బస్సు సోమవారం ఉదయం విద్యార్థులను ఎక్కించుకుని బయలుదేరింది. ఈ క్రమంలో రోడ్డుపై గుంతలు ఉండడంతో డ్రైవర్ బ్రేక్ వేసిన స్టీరింగ్ కంట్రోల్ కాకపోవడంతో బస్సు పంట కాలువలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాద సమయంలో స్కూల్ బస్సులో సుమారు 25 మంది విద్యార్థులు, పలువురు గ్రామస్తులు ఉన్నారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు విద్యార్థులను బయటకు తీశారు. మినుగల్లు గ్రామానికి చెందిన క్రాంతి సందేశ్ విద్యార్థికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులకు ప్రాణాపాయం తప్పడంతో స్థానికులు ఊపిరి పిలుచుకున్నారు. ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న స్కూలు యజమాన్యం ప్రమాద ఘటనను చిత్రీకరిస్తున్న మీడియాపై దురుసుగా ప్రవర్తించారు. దీంతో అక్కడే ఉన్న స్థానికులు పాఠశాల యాజమాన్యం పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సినిమా





## 'డాకు' కోసం దుల్కర్‌ను అనుకున్నారు కానీ



ప్రస్తుతం పెద్ద సినిమాల్లో ప్రత్యేక అతిథి పాత్రలను క్రియేట్ చేసి పేరున్న నటులతో వాటిని చేయించడం ట్రెండుగా మారింది. ఈ కోవలోనే 'డాకు మహారాజ్'లో దుల్కర్ సల్మాన్‌తో ప్రత్యేక ప్రాత్ర చేయిస్తున్నట్లు ఈ సినిమా మేకింగ్ ఆరంభ దశలో వార్తలు వచ్చాయి. కానీ తర్వాత ఏమైందో తెలియదు. దుల్కర్ ఈ మూవీలో భాగం కాలేదు. సినిమాలో ఇంకెవరైనా ఈ పాత్రను చేశారా అని చూస్తే.. ట్రైలర్లో అలాంటి సంకేతాలేమీ కనిపించలేదు. ఇదే విషయమై దర్శకుడు బాబీని ఓ ఇంటర్వ్యూలో అడిగితే.. దుల్కర్ క్యామియో వెనుక రహస్యాన్ని వెల్లడించాడు. ముందు ఈ చిత్రంలో ఒక ప్రత్యేక పాత్రను అనుకున్నామని.. దాన్ని దుల్కర్‌తో చేయించాలని చూసిన మాట వాస్తవమే అని బాబీ తెలిపాడు. అప్పటికి దుల్కర్ కూడా ఈ పాత్ర చేయడానికి సుముఖంగానే ఉన్నాడని అతనన్నాడు. ఐతే ఆ పాత్రను డెవలప్ చేసే క్రమంలో కథకు ఆ క్యారెక్టర్ అవసరం లేదని అనిపించిందని బాబీ చెప్పాడు. అందుకే ఆ పాత్రను కథ నుంచి తీసేశామని.. దీంతో దుల్కర్ తమ సినిమాలో నటించలేకపోయాడని బాబీ తెలిపాడు. 'డాకు మహారాజ్'ను నిర్మించిన సితార సంస్థలోనే దుల్కర్ 'లక్కీ భాస్కర్' లాంటి స్పెషల్ మూవీ చేశాడు. రెండూ ఒకేసారి చిత్రీకరణ జరుపుకున్నాయి. కాబట్టి నిర్మాత నాగవంశీ అడిగితే దుల్కర్ నో చెప్పకుండా 'డాకు మహారాజ్'లో నటించేవాడే. కానీ దర్శక నిర్మాతలకే ఆ పాత్ర అవసరం లేదనిపించి పక్కన పెట్టినట్లున్నారు. సంక్రాంతి కానుకగా భారీ అంచనాల మధ్య 'డాకు మహారాజ్' రిలీజవుతోంది. లేటెస్ట్‌గా రిలీజైన ఈ సినిమా ట్రైలర్ మాస్‌నే కాక మిగతా ప్రేక్షకుల దృష్టినీ ఆకర్షిస్తోంది. సంక్రాంతికి మాస్ ట్రీట్ ఖాయమనే సంకేతాలు ఇచ్చింది ట్రైలర్. జనవరి 14న, ఆదివారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తుంది.

## సీఎం కావాలనుంది..!



హీరోయిన్లు రాజకీయాల్లోకి రావాలనే ఆకాంక్షను వెల్లడించడం.. అందుకు అనుగుణంగానే సినిమాల్లో కెరీర్ ముగుస్తున్న దశలో ఆ రంగంలోకి అడుగు పెట్టడం కొత్తేమీ కాదు. ఈ కోవలో ఎంతోమందిని చూశాం. కానీ సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి అడుగు పెట్టి అత్యున్నత స్థాయికి చేరుకున్న వ్యక్తిగా జయలలిత పేరే చెప్పుకోవాలి. ఐతే ఆమె నేరుగా సీఎం అయిపోవాలన్న లక్ష్యంతో ఏమీ రాజకీయాల్లోకి రాలేదు. ఎంజీఆర్ అనుయాయురాలిగా తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్న క్రమంలో పట్టుబట్టి రాజకీయాల్లోకి వచ్చారు. మొండి పట్టుదలతో పోరాడి అత్యున్నత పదవిని స్వీకరించారు. ఆమెకు ముందు, తర్వాత సీఎం పదవి గురించి ఏ కథానాయిక కల కూడా కని ఉండదు. ఐతే ఇప్పుడు తమిళ స్టార్ హీరోయిన్ త్రిష తనకీ లక్ష్యం ఉన్నట్లు వెల్లడించి అందరినీ షాక్‌కు గురి చేసింది. ఎప్పటికైనా తమిళనాడు సీఎం కావాలన్నది తన కోరిక అని ఆమె ఆశ్చర్యకర ప్రకటన చేసింది. ప్రజాసేవతో పాటు సామాజిక మార్పులు రాజకీయాల వల్లే సాధ్యమని అభిప్రాయపడింది. త్రిష వ్యాఖ్యలు తమిళ రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. త్రిష 20 ఏళ్ల కెరీర్‌ను పూర్తి చేసుకుంది ఇటీవలే. ఆమె చాలా ఏళ్ల కిందటే సినిమాలు వదిలేసి వ్యక్తిగత జీవితంలో స్థిరపడాలని అనుకుంది. కానీ వరుణ్ మణియన్‌తో ఎంగేజ్మెంట్ రద్దవడం.. మళ్లీ కెరీర్ పుంజుకోవడంతో సినిమాల్లో కొనసాగింది. ఇప్పుడు వయసు 40 పైబడ్డా వరుస సినిమాలతో దూసుకెళ్తోంది. కానీ ఇప్పటిదాకా ఎన్నడూ త్రిష రాజకీయాల గురించి పెద్దగా మాట్లాడింది లేదు. తాను ఆ రంగంలోకి వస్తాననే సంకేతాలు కూడా ఇవ్వలేదు.

## విశాల్ ఇలా కనిపించడం ఆందోళనే



నిన్న చెన్నైలో జరిగిన మదగజరాజ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో హీరో విశాల్ లుక్స్ చూసి అందరూ షాక్ తిన్నారు. బాగా సన్నబడిపోయి స్టేజి మీద మాట్లాడుతున్నప్పుడు మైకు పట్టుకున్న చెయ్యి వణుకుతూ ఉండటం చూసి ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. మొన్నటికి మొన్న మార్క్ ఆంటోనీ, రత్నం సినిమాల్లో విశాల్ ఆరోగ్యంగా ఉన్నాడు. తుప్పరివాలన్ 2 (డిటెక్టీవ్)ని స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్నాడు. అలాంటిది హఠాత్తుగా ఇంత అనారోగ్యం ఎలా కలిగిందనే సందేహం రావడం సహజం. చెన్నై మీడియా ప్రకారం విశాల్ తీవ్రమైన వైరల్ ఫీవర్ తో బాధపడుతున్నాడని అయినా వచ్చాడని చెబుతున్నారు. కేవలం జ్వరమే అయితే పర్వాలేదు కానీ ఏదైనా సమస్య ఉంటే మాత్రం మంచి చికిత్స తీసుకోవడం అవసరం. ఎందుకంటే గతంలో విశాల్ ఇలా కనిపించిన దాఖలాలు ఎప్పుడూ లేవు. ఎక్కడైనా సరే దూసుకెళ్ళిపోతూ స్ట్రెయిట్ ఫార్వార్డ్ గా మాట్లాడే హీరో ఇలా కావడం ఎవరికైనా టెన్షన్ కలిగించే విషయమే. 12 సంవత్సరాల తర్వాత రిలీజవుతున్న మదగజరాజకు సోషల్ మీడియాలో అనూహ్యంగా మద్దతు దక్కుతోంది. సంతానం కామెడీ, అంజలి %-% వరలక్ష్మి శరత్ కుమార్ గ్లామర్, విజయ్ ఆంటోనీ సంగీతం తదితర అంశాలు క్రమంగా హై పెంచుతున్నాయి. సుందర్ సి దర్శకుడు కావడం మరో ప్లస్. ప్రస్తుతం విశాల్ తుప్పరివాలన్ 2 మాత్రమే చేస్తున్నారు. మరో రెండు సినిమాలు ఫైనల్ చేయాల్సి ఉంది. మదగజరాజకు తొలుత హైప్ ఉండదేమో అనుకున్నారు కానీ అనూహ్యంగా బజ్ రావడం పట్ల సదరు టీమ్ సంతోషంగా ఉంది. పాత సినిమా అయినా ఎంటర్ టైన్మెంట్ ఫ్రెష్ గా ఉంటుందని సుందర్ హామీ ఇస్తున్నారు.

## అకీరా అరంగేట్రంపై రేణు



ఓవైపు నందమూరి వారసుడు మోక్షజ్ఞ అరంగేట్రానికి రంగం సిద్ధమవుతుండగా.. ఆ తర్వాత మోస్ట్ అవైటెడ్ డెబ్యూ అంటే అకీరా నందన్‌దే. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అంటే మెగా అభిమానులు ఎలా ఊగిపోతారో తెలిసిందే. ఆయనేమో ఫిలిం కెరీర్ మీద ఫోకస్ తగ్గించేసి రాజకీయాల్లో బిజీ అయిపోయారు. ప్రస్తుతం చేతిలో ఉన్న సినిమాలను పూర్తి చేసి, ఆ తర్వాత సినిమాలకు గుడ్ బై చెప్పేసేలా ఉన్నారు. ఆ లోపు పవన్ తనయుడు అకీరా తెరంగేట్రం చేస్తే బాగుంటుందన్నది అభిమానుల ఆకాంక్ష. ఐతే అకీరా అయితే ప్రస్తుతానికి సినిమాల మీద పూర్తి స్థాయిలో దృష్టిసారించినట్లు కనిపించడం లేదు. ఓవైపు చదువు సాగిస్తూనే.. ఇంకోవైపు సంగీతం మీద ఫోకస్ చేస్తున్నాడు. నటనలోనూ శిక్షణ తీసుకుంటున్నట్లు భావిస్తున్నారు కానీ.. దాని గురించి సమాచారం ఏదీ బయటికి రాలేదు. ఈ నేపథ్యంలో కొడుకు అరంగేట్రం గురించి రేణు దేశాయ్ మాట్లాడ్డం మీడియా దృష్టిని ఆకర్షించింది. అకీరా సినిమాల్లోకి రావాలని తాను కూడా కోరుకుంటున్నానని రేణు అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఐశ్వర్యా ఫుడ్ ఇండస్ట్రీస్ అనే సంస్థ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా వాళ్లు కొడుకు తెరంగేట్రం గురించి అడిగితే.. "అకీరా నందన్ ఎప్పుడు సినిమాల్లోకి వస్తారోనని అభిమానులందరూ ఎదురుస్తున్నారు. తన తల్లిగా ఆ ఆతృత నాకూ ఉంది. అకీరా నందన్ తన ఇష్టపూర్వకంగానే సినీ రంగ ప్రవేశం చేస్తాడు" అని రేణు వ్యాఖ్యానించారు.

## చిరు పవన్ మధ్య కపూర్ ప్రస్తావన



నిన్న గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో పవన్ కళ్యాణ్ తన అన్నయ్య చిరంజీవి గురించి గొప్పగా చెప్పడం చూసి అభిమానులు ఎంతగా మురిసిపోయారో చూశాం. ఇది జరిగి ఇరవై నాలుగు గంటలు గడవక ముందే మెగాస్టార్ పాల్గొన్న మరో సందర్భం ఫ్యాన్స్ ని మరింత సంతోషంలో ముంచెత్తేలా చేసింది. హైదరాబాద్ లో జరుగుతున్న ఆప్టా బిజినెస్ క్యాటలిస్ట్ కాన్ఫరెన్స్ కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన చిరంజీవి ఆహుతులతో పలు కబుర్లు పంచుకున్నారు. నేరుగా సినిమాలకు సంబంధించిన వేడుక కాకపోయినా ప్రసంగంలో వచ్చిన సందర్భానికి అనుగుణంగా ఒక ముఖ్యమైన ముచ్చట చెప్పుకొచ్చారు. చాలా ఏళ్ళ క్రితం పవన్ తో చిరంజీవి ఓ మాట అన్నారు. బాలీవుడ్ లో రాజ్ కపూర్ ఫ్యామిలీ ఎలా అయితే ఒక లెగసిని సృష్టించి ఎంతో మంది స్టార్లను ఇచ్చిందో అదే తరహాలో తెలుగులో మన కుటుంబం కూడా ఆ స్థాయికి చేరుకోవాలని అన్నారు. తర్వాత కాలం గడిచేకొద్దీ దాన్ని ఆయన మర్చిపోయారేమో కానీ పవన్ గుర్తుపెట్టుకున్నారు.

ముందు పవన్ కళ్యాణ్, ఆ తర్వాత రామ్ చరణ్ అటుపై సాయి ధరమ్ తేజ్, వరుణ్ తేజ్, వైష్ణవ్, నీహారిక ఇలా వరసగా తమ టాలెంట్లతో ఋజువు చేసుకున్నారు. ఇటీవలే పవన్ కలిసినప్పుడు చిరంజీవితో ఇది గుర్తు చేసి మంచి మనసుతో నువ్వు కోరుకున్నది ఇప్పుడు నెరవేరిందని సంతోషంగా చెప్పారు. ఒక ఇంగ్లీష్ మ్యాగజైన్ లో కపూర్స్ అఫ్ సౌత్ ఇండియా అంటూ తమ గురించి వచ్చిన ఆర్టికల్ ని ప్రస్తావించారు చిరంజీవి. ఏదైతేనేం మరో అరుదైన జ్ఞాపకాన్ని షేర్ చేసుకున్న చిరు తన తమ్ముడి పేరు ఎత్తిన ప్రతిసారి ఆ సభలోనూ ఈలలు, కేకలు హోరెత్తిపోవడం విశేషం. ప్రస్తుతం విశ్వంభర చివరి దశలో ఉన్న మెగాస్టార్ త్వరలోనే అనిల్ రావిపూడి స్క్రిప్ట్ ని ఫైనల్ చేయబోతున్నారు. అది ఓకే అయ్యాక సెట్స్ పైకి వెళ్లనుంది. ఇవన్నీ ఎలా ఉన్నా అన్నదమ్ముల మధ్య బాండింగ్ ఏ స్థాయిలో ఉందో రుజువు చేసేందుకే పలు ఈవెంట్లు వేదికగా మారడం ఫ్యాన్స్ కి మాములు సంతోషాన్ని ఇవ్వడం లేదు.

## గేమ్ ఛేంజర్‌పై దిల్ రాజు కాన్ఫిడెన్స్!



సంక్రాంతికి రెండు పెద్ద సినిమాలను నిర్మించి రిలీజ్ చేయడంతో పాటు మరో భారీ చిత్రాన్ని డిస్ట్రిబ్యూట్ చేస్తున్న నిర్మాత దిల్ రాజుకు వీటి వ్యవహారాలతో మాములు ఒత్తిడి ఉండటం లేదు. అయినా సరే బ్యాలన్స్ తప్పకుండా వాటిని ప్రశాంతంగా ప్లాన్ చేసుకుంటున్న తీరు ఎక్కడా అపశ్రుతి లేకుండా చూసుకుంటోంది. ఈ సందర్భంగా హైదరాబాద్ లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో కొన్ని ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు దిల్ రాజు. గేమ్ ఛేంజర్ నిర్మాతగా తనకు, దర్శకుడిగా ఖచ్చితంగా కంబ్యాక్ అవుతుందనే నమ్మకాన్ని ధీమాగా వ్యక్తం చేశారు. గతంలో వచ్చిన నెగటివిటీని ప్రస్తావించి వివరణ ఇచ్చారు. ఇండియన్ 2 ఫలితం, శంకర్ ఇప్పుడు ఎలాంటి సినిమా ఇస్తాడోననే అనుమానాలు, జడ్జ్ మెంట్ తప్పుతున్న ప్రొడ్యూసర్ గా తన మీద వస్తున్న కామెంట్లు అన్నీ తెలుసని, కానీ గేమ్ ఛేంజర్ విషయంలో తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ వాటిని సమూలంగా తుడిచిపెడుతుందని కుండబద్దలు కొట్టేశారు. రిలీజ్ కు ముందు గేమ్ ఛేంజర్ నిర్మాణంలో ఉన్నప్పుడు ఒక్క హీరో గురించి తప్ప మిగిలిన అన్ని విషయాల మీద జనంలో ఆసక్తి కనిపించేది కాదని ఇప్పుడు మొత్తం మారిపోయిందని, ఒక ప్రాపర్ కమర్షియల్ మూవీని పండగ కానుకగా ఇస్తున్నామని, విజిల్స్ వేయించే బోలెడు కంటెంట్ చూస్తారని నమ్మకంగా చెప్పారు. సో మెగా ఫ్యాన్స్ కి ఇంతకన్నా కావాల్సింది ఏముంటుంది. వెంకటేష్ సంక్రాంతికి వస్తున్నాంని నిన్నే చూశానని చెప్పిన దిల్ రాజు సూపర్ హిట్ గ్యారెంటీ అనే కాన్ఫిడెన్స్ వచ్చిందని అన్నారు.



# క్రీడలు



## ఆ సిరీస్ కోసం ఐపీఎల్ నుంచి తప్పుకోనున్న కోహ్లీ?



విరాట్ కోహ్లి రిటైర్మెంట్ గాసిప్స్ మధ్య తన ప్రస్థానాన్ని కొనసాగించాలనే పట్టుదలతో ఉన్నాడు. అతని తాజా ఫామ్ కొన్ని అనుమానాలు రేకెత్తించినప్పటికీ, అతను తన మానసిక బలం పెంచుకుని కొత్త ఒరవడి చూపేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఐపీఎల్‌లో తన కలను సాకారం చేసుకోవడం అతనికి ప్రాముఖ్యం. ఇంగ్లాండ్ టూర్‌కు సన్నద్ధం కావడంలో అతని మోర్ ఆధారపడుతుంది. విరాట్ కోహ్లి, భారత క్రికెట్‌లో సుదీర్ఘ కాలంగా ఆకర్షణీయమైన ఆటగాడు, రిటైర్మెంట్ గాసిప్స్ మధ్య తన సుదీర్ఘ ప్రయాణాన్ని కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఇటీవల జరిగిన టెస్టు సిరీస్‌లలో అతని ప్రదర్శన కొంతదూరం దిగజారినట్లుగా కనిపించినా, పెర్త్‌లో సాధించిన సెంచరీ అతని అసమాన ప్రతిభను మరోసారి చాటింది. అయితే, అతని ఇన్నింగ్స్‌లలో ఉన్న అసమానత్వం అతనిపై ఆత్మవిశ్వాసం తగ్గనిచ్చింది. విరాట్ పునరుద్ధరించలేనిదిగా భావించిన తన టెక్నికల్ సమస్యలను అధిగమించేందుకు తన మానసిక బలాన్ని మరింత పెంచుకోవాలని కోరుకుంటున్నాడు. ఇంగ్లాండ్ టూర్‌కు సన్నద్ధం కావడానికి రంజీ ట్రోఫీ లేదా దేశీయ క్రికెట్ ఆడాలని సెలెక్టర్ల నుంచి ఒత్తిడి ఎదుర్కొంటున్నాడు. ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్ కోసం అసలుసిసలు క్రికెట్ ఆడేందుకు ఐపీఎల్‌ను పక్కనబెట్టే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఐపీఎల్ ట్రోఫీ గెలుచుకోవడమనే కోహ్లి కల ఇంకా నెరవేరలేదు. అయితే, అతని గొప్పతనాన్ని, కఠోరమైన పోరాటస్ఫూర్తిని చూస్తే, అతని కథలో ఇంకా మలుపులు మిగిలి ఉండవచ్చని అభిప్రాయపడవచ్చు.

## 3 బౌండరీలు, 6 సిక్సర్లతో ఆటగాడి అరాచకం



టిమ్ డేవిడ్ తన దూకుడైన ఇన్నింగ్స్‌తో హెూబర్ట్ హరికేన్స్‌కు అద్భుత విజయం అందించాడు. 28 బంతుల్లో 62 పరుగులు చేసిన అతని బ్యాటింగ్ ప్రత్యర్థులను ఆశ్చర్యపరిచింది. హరికేన్స్ లక్ష్యాన్ని 18.4 ఓవర్లలో చేధించి పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. డేవిడ్ ఆటతీరుకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. బిగ్ బాష్ లీగ్‌లో హెూబర్ట్ హరికేన్స్ తరపున ఆడిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కొత్త ఆటగాడు టిమ్ డేవిడ్ అద్భుత ప్రదర్శనతో క్రికెట్ అభిమానుల మనసులు దోచాడు. అడిలైడ్ స్ట్రైకర్స్‌పై జరిగిన మ్యాచ్లో 28 బంతుల్లో మూడు బౌండరీలు, ఆరు సిక్సర్లతో 62 పరుగులు చేసి, హరికేన్స్ విజయానికి మద్దతుగా నిలిచాడు. అతను క్రీజులోకి వచ్చినప్పుడు జట్టు 101/4తో నిలిచింది, ఆటపై ఒత్తిడి ఎక్కువగా ఉంది. కానీ తన దూకుడైన బ్యాటింగ్‌తో డేవిడ్ పవర్ సర్జ్‌లో పూర్తి ప్రయోజనం పొందాడు. అతని పరుగుల్లో 77% పైగా బౌండరీల ద్వారా వచ్చాయి, ప్రతి మూడు బంతులకు ఒక సిక్సర్‌తో ప్రత్యర్థులను ఔరా అనిపించాడు. డేవిడ్ నాటౌట్ ఇన్నింగ్స్‌తో జట్టుకు అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. అతని శక్తివంతమైన షాట్లు మ్యాచ్‌ను పూర్తిగా మలుపుతిప్పాయి. ఈ ఫెంటాస్టిక్ ప్రదర్శనకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నాడు. మరోవైపు, హెూబర్ట్ హరికేన్స్ స్ట్రైకర్స్‌ను ఐదు వికెట్ల తేడాతో ఓడించి పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరుకుంది. ఈ విజయం వరుసగా నాలుగో గేమ్ గెలుపు కావడం విశేషం. డేవిడ్ దూకుడైన ఆటతీరుతో హరికేన్స్ విజయయాత్రలో కీలక పాత్ర పోషిస్తున్నాడు.

## 6 చెత్త రికార్డులతో మొదటిసారి ఇలా..



ఆస్ట్రేలియా 3-1 తేడాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని గెలుచుకుంది. 10 ఏళ్ల తర్వాత తొలిసారి ఈ సిరీస్‌ను దక్కించుకుంది. టీమిండియా ఆటగాళ్ల పేలవ ఫాంతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని కోల్పోవాల్సి వచ్చింది. కొత్త ఏడాదిని ోటమితో భారత్ మొదలుపెట్టింది. దీంతో సిడ్నీలో భారీ రికార్డులు నమోదయ్యాయి. భారత్-ఆస్ట్రేలియా మధ్య ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో మూడో రోజు భారత్ ఆరు వికెట్ల తేడాతో ఘోర ఓటమిని చవిచూసింది. భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య సిడ్నీ టెస్టు మ్యాచ్ మూడు రోజుల పాటు మాత్రమే జరగడంతో 162 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా విజయం సాధించింది. దీని కారణంగా 10 సంవత్సరాల తర్వాత తొలిసారిగా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని ఆస్ట్రేలియా 3-1 తేడాతో గెలుచుకుంది. దీనితో సిడ్నీలో భారీ రికార్డులు నమోదయ్యాయి. భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన సిడ్నీ టెస్టు మ్యాచ్‌లో మూడు రోజుల పాటు కేవలం 1141 బంతులు మాత్రమే వేయగలిగింది. దీంతోనే మ్యాచ్ ముగిసింది. ఇది సిడ్నీలో అతి తక్కువ బంతుల్లో ముగిసిన మూడో టెస్టు మ్యాచ్‌గా నిలిచింది. 1888 నుంచి ఇంత త్వరగా సిడ్నీలో ఏ టెస్టు కూడా ముగిసిపోలేదు. సిడ్నీ మైదానంలో టీమ్ ఇండియా బ్యాట్స్‌మెన్ 673 బంతులు ఆడారు. ఇది సిడ్నీ మైదానంలో టీమ్ ఇండియా ఆడిన అతి తక్కువ బంతులుగా నిలిచింది. ఇంతకు ముందు 1981లో సిడ్నీ టెస్టులో భారత్ 692 బంతులు ఆడింది. 162 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే సమయంలో, ఆస్ట్రేలియా రన్ రేట్ 6.00గా నిలిచింది. ఇది ఆస్ట్రేలియా గడ్డపై టెస్ట్ క్రికెట్‌లో 150 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేసిన జట్టు తరపున వేగవంతమైన పరుగుల ఛేజింగ్‌గా చెప్పవచ్చు.టెస్టు క్రికెట్‌లో భారత్‌పై స్కాట్ బోలాండ్ బౌలింగ్ సగటు 16గా నిలిచింది. ఈ సెంచరీలో టీమ్ ఇండియాపై ఏ బౌలర్ చేయని అత్యల్ప (కనీస 15 వికెట్లు) ఇదే. 2003 తర్వాత సిడ్నీలో పది వికెట్లు తీసిన తొలి ఫాస్ట్ బౌలర్‌గా కూడా బోలాండ్ నిలిచాడు. ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు మ్యాచ్‌ల బోర్డర్ గవాస్కర్ టెస్ట్ సిరీస్ సందర్భంగా, ఈ సిరీస్‌లో టీమిండియా 7 సార్లు 200 కంటే ఎక్కువ స్కోర్ చేయడంలో విఫలమైంది. 2000-01 సంవత్సరంలో ఆస్ట్రేలియాపై వెస్టిండీస్‌కు ఇదే విధమైన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు టీమిండియా పేరు కూడా దానితో ముడిపడి ఉంది.

## టీమిండియా ఆటగాళ్ల సాక్షిగా గవాస్కర్‌ను అవమానించిన ఆస్ట్రేలియా?



సునీల్ గవాస్కర్, బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ట్రోఫీ అందజేతలో భాగస్వామ్యం లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశాడు. బోర్డర్‌తో కలిసి ట్రోఫీ ఇవ్వాలని తన ఆకాంక్షను వ్యక్తం చేశాడు. ఈ వ్యాఖ్యలు నెటిజన్లలో చర్చలకు దారితీశాయి. 1996 నుండి ట్రోఫీ క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపు సాధించింది. సిడ్నీ వేదికగా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ఫైనల్ ముగిసిన తర్వాత క్రికెట్ లెజెండ్ సునీల్ గవాస్కర్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఈ సిరీస్ ట్రోఫీని ఆసీస్ మాజీ కెప్టెన్ అలెన్ బోర్డర్ చేతుల మీదుగానే అందజేయడం, తనను పిలవకపోవడం పట్ల గవాస్కర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 10 ఏళ్ల తర్వాత ఆసీస్ జట్టు ట్రోఫీ గెలుచుకున్నప్పటికీ, ఇది ఒక పరస్పర గౌరవానికి సంకేతంగా ఉండాల్సిన సందర్భమని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. గవాస్కర్ మాట్లాడుతూ, “నన్ను పిలవకపోవడం నాకు బాధగా అనిపించింది. బోర్డర్‌తో కలిసి ట్రోఫీ అందజేయడం ఎంతో ప్రత్యేకమై ఉండేది. ఇది ఒక భారత క్రికెట్ అభిమానిగా నాకు కూడా గౌరవంగా అనిపించేది. అయినప్పటికీ, నేను విజయాన్ని అభినందిస్తాను, కానీ నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకోవడం సరైనదిగా అనిపించలేదు” అన్నారు. అతని వ్యాఖ్యలపై నెటిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు. కొందరు గవాస్కర్ భావనను సమర్థిస్తుంటే, మరికొందరు “సిరీస్ ఓడిపోయిన జట్టు సభ్యుడిగా ఎలా ట్రోఫీ అందజేస్తాడు?” అని ప్రశ్నిస్తున్నారు. కొన్ని సెటైరికల్ కామెంట్లు కూడా వెలువడ్డాయి, “అలిగావా గవాస్కర్?” అంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యాయి. 1996-97 సీజన్ నుంచి ప్రారంభమైన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ప్రపంచ క్రికెట్‌లో ఎంతో ప్రాధాన్యమయినది. 17 సిరీస్‌లలో భారత జట్టు 10 సార్లు విజేతగా నిలవగా, ఆస్ట్రేలియా 6 సార్లు ట్రోఫీ గెలుపొందగా, ఒక్క సారి సిరీస్ డ్రా గా ముగిసింది. కానీ తాజా సీజన్‌లో ఆసీస్ తమ ఆధిపత్యాన్ని చూపించింది.

## సెలెక్టర్లకు షాకిచ్చిన టీమిండియా పేసర్



మహ్మద్ షమీ తన బౌలింగ్ నైపుణ్యాలను మాత్రమే కాదు, బ్యాటింగ్‌లో కూడా మెరిసి 2025 ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక దిశగా దృష్టి సారిస్తున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో విజయవంతమైన ప్రదర్శనలతో షమీ తన ఫామ్‌ను నిలబెట్టుకుంటున్నాడు. అయితే, అతని ఫిట్‌నెస్ అతని ఎంపికలో ప్రధాన అంశంగా ఉంది. ఫిబ్రవరి 19న ప్రారంభమయ్యే ఈ ట్రోఫీలో, షమీ అఖరికి జట్టులో చోటు సంపాదిస్తాడా అనేది ఆసక్తికరంగా మారింది. భారత క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంటూ వెటరన్ పేసర్ మహ్మద్ షమీ తన ప్రతిభను మళ్లీ నిరూపించుకుంటున్నాడు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ముందుకొస్తున్న సమయంలో, షమీ తన బౌలింగ్‌తోనే కాకుండా, బ్యాట్‌తోనూ తన ప్రాభవాన్ని చూపిస్తున్నాడు. మడమ గాయం నుంచి కోలుకున్న తర్వాత దేశవాళీ క్రికెట్‌లో తిరిగి అడుగుపెట్టిన షమీ, రంజీ ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీల్లో బెంగాల్ తరపున అత్యద్భుత ప్రదర్శనలు కనబరిచాడు. ఆదివారం మధ్యప్రదేశ్‌తో జరిగిన విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లో, 8వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన షమీ కేవలం 34 బంతుల్లోనే 42 పరుగులు సాధించాడు. ఐదు బౌండరీలు, ఒక సిక్సర్‌తో రాణించిన అతని ఇన్నింగ్స్ బెంగాల్‌కు మంచి స్కోరు అందించడానికి సహాయపడింది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ సమయంలోనూ షమీ తన బ్యాటింగ్ నైపుణ్యాలను ప్రదర్శించి, చండీగఢ్‌పై 17 బంతుల్లో 32 పరుగులు సాధించాడు. బ్యాట్‌తో అనూహ్యమైన ప్రదర్శన చేయడం ద్వారా, అతను ప్రత్యర్థి బౌలర్లను షాక్‌కు గురిచేశాడు. తన 34 ఏళ్ల వయసులోనూ, దేశవాళీ క్రికెట్‌లో షమీ నిరంతరం మెరుగైన ప్రదర్శనలు చేస్తూ, సెలక్షన్ కమిటీ దృష్టిని ఆకర్షిస్తున్నాడు. రంజీ ట్రోఫీలో నాలుగు వికెట్లు, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 11 వికెట్లు సాధించడం షమీ ఫామ్‌లో ఉన్నాడని స్పష్టమవుతోంది. అయితే, అతని సెలక్షన్‌కి అడ్డంకి అతని ఫిట్‌నెస్. ఛాంపియన్స్ ట్రోఫీకి కొద్ది రోజులే మిగిలి ఉండగా, షమీ పూర్తిగా ఫిట్‌గా ఉంటాడా అనే ప్రశ్న ఇప్పటికీ మిగిలే ఉంది. భారత సెలక్షన్ కమిటీ జట్టును ప్రకటించే ముందు షమీ తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంది.

## ఘనంగా భారత అభ్యుదయ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం

### సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



భారత అభ్యుదయ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం 1998-99 బ్యాచ్ కు చెందిన విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి మృతులను స్మృతులను గుర్తు చేసుకున్నారు ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు అప్పటి స్మృతులను గుర్తు చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు శాలువా జ్ఞాపిక లతో ఘనంగా సన్మానించి వారి వద్ద నుండి ఆశీర్వాదం తీసుకున్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి సోమశేఖర్ రెడ్డి విజయసేనారెడ్డి శేఖర్ రెడ్డి రామకృష్ణ బాలాజీ కిషన్ జి చంద్రశేఖర్ దేవేందర్ పూర్వ విద్యార్థులు లక్ష్మీనారాయణ,కేశవ్,సుష్మ, ప్రసన్న,నర్సింగ్ రావు, సత్యనారాయణ,బాబు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు

## అథ్లెటిక్ పోటీలలో మెడల్స్ సాధించిన సమ్మయ్య

### -అభినందించిన జీఎం జి.దేవేందర్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 6**హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన 11 తెలంగాణ స్టేట్ లెవెల్ అథ్లెటిక్ పోటీలలో మందమర్రి ఏరియా సింగరేణికి చెందిన పి .సమ్మయ్య పాల్గొని పలు బహుమతులు సాధించిన సందర్భంగా సోమవారం మందమర్రి జిఎం జి. దేవేందర్ తన కార్యాలయంలో ఘనంగా సన్మానించి అభినందించారు. ఎ.ఎస్. ఓ సర్వే చైర్మన్ గా పనిచేస్తూ క్రీడ పట్ల ఆసక్తితో గచ్చిబౌలిలో జరిగిన అథ్లెటిక్ పోటీలలో పాల్గొని 5కె రన్ లో గోల్డ్, 1500 మీటర్స్ రన్ లో సిల్వర్, 800 మీటర్స్ రన్ లో బ్రాంజ్ మెడల్స్ ను సాధించారు. ఈ కార్యక్రమంలో ఏరియా సర్వే ఆఫీసర్ ఉజ్వల్ బందోపాధ్యాయ, ప్రసాద్, నరేష్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మల్ ఉత్సవాలలో అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా**..నిర్మల్ ఉత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం ఎన్.టి.ఆర్.స్టేడియంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేశ్,నిర్మల్, ముధోల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్, ఎస్పీ జానకి షర్మిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,నిర్మల్ జిల్లా చరిత్ర, సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే సంకల్పంతో ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు.నిర్మల్ ఉత్సవాలలో పాల్గొన్న ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అధికారులు,ప్రజా ప్రతినిధులు, ప్రజలందరికి భాగస్వామ్యంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.జిల్లాకు చెందిన పలువురు కళాకారులు, విద్యార్థులచే ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. జిల్లా చరిత్రకు సంబంధించిన వివరాలను ప్రొఫెసర్ డా.మురళి ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను కలెక్టర్,ఎస్పీ, ఎంపీ, శాసనసభ్యులు, అదరపు కలెక్టర్లు, అధికారులు, తదితరులు సందర్శించారు. అనంతరం ప్రజా ప్రతినిధులను జిల్లా కలెక్టర్,శాలువాతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లు, అదనపు ఎస్పీలు రాజేష్ మీనా, ఉపేంద్ర రెడ్డిలు,బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, సందర్శకులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా భారత అభ్యుదయ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం

### సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



భారత అభ్యుదయ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల (25 సంవత్సరాలలు) సమ్మేళనం 1998-99 బ్యాచ్ కు చెందిన విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి స్మృతులను గుర్తు చేసుకున్నారు ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు అప్పటి స్మృతులను గుర్తు చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు శాలువా జ్ఞాపిక లతో ఘనంగా సన్మానించి వారి వద్ద నుండి ఆశీర్వాదం తీసుకున్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, సోమశేఖర్ రెడ్డి, విజయసేనారెడ్డి, శేఖర్ రెడ్డి, రామకృష్ణ,బాలాజీ,కిషన్%ు%జి, చంద్రశేఖర్, దేవేందర్ ,పూర్వ విద్యార్థులు లక్ష్మీనారాయణ,కేశవ్,సుష్మ, ప్రసన్న,నర్సింగ్ రావు, సత్యనారాయణ,బాబు, రాఘవేందర్ , శ్రీనివాస్, వారి ఆధ్వర్యంలో తదితరులు పాల్గొన్నారు

## ప్రధాన రహదారిపై ఉన్న ఇనుప బెడ్డును తొలగించాలి

### -కమీషనర్ కు విన్నవించిన ఆది జాంబవ సంఘం



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్, జనవరి 6 :**మందమర్రి పట్టణంలోని సింగరేణి హై స్కూల్ ముందర గల కోల్ బెల్ట్ రహదారిపై ఉన్న ఇనుప బెడ్ ను తొలగించాలని కోరుతూ ఆది జాంబవ సంఘం నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ నీలిగొండ వెంకటేశ్వలును కలిసి వినతిపత్రం అందజేశారు. ఇనుప బెడ్ ఉండడం వల్ల రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయనీ వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మందమర్రి మార్కెట్, పాలచెట్టు ఏరియాలలో ఆదివారం రోజున జరిగే మార్కెట్ కు చాపల మార్కెట్ కి వెళ్లేందుకు రోడ్డు ఇరుకుగా ఉండటం వల్ల ప్రజలు, మోటార్, సైకిల్ వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని వాటికి పార్కింగ్ స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని వారు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆది జాంబవ సంఘం ప్రెసిడెంట్ కంబాల రాజనర్సు, వర్కింగ్ ప్రెసిడెంట్ బిధునూరి శంకర్, జనరల్ సెక్రటరీ ఆవునూరి పోశం, ఆర్గనైజింగ్ సెక్రటరీ దాసరి రాజనర్సు, విరుగురాళ్ల వెంకటి, రేగుంట రాజయ్య, వేల్పుల రవి, అంతర్పుల మధు లు పాల్గొన్నారు.

## మీ స్వార్థం కోసం అంబేద్కర్ సంఘాన్నే బలి చేస్తారా.

ప్రోటోకాల్ పాటించకుండా, మెజారిటీ నాయకుల అభిప్రాయాన్ని గౌరవించకుండా అవమానించింది మీరే కాదా..?

అధికార పార్టీలో ఉండి ప్రతిపక్ష నాయకుల మాటేందుకు వింటున్నారు..?

అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు రాందాస్ సమాధానం చెప్పాలి.

అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు తొగరు రాజు డిమాండ్



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 06 :** కొంతమంది తమ స్వార్థం కోసం అంబేద్కర్ సంఘాన్నే బలి చేస్తారా అని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు తొగరు రాజు పేర్కొన్నారు.సోమవారం పట్టణంలోని గురునానక్ ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ...పట్టణంలోని రోడ్లు వెడెల్పు చేయాలని మున్సిపల్ అధికారులకు వినతిపత్రం ఇస్తే మీరెందుకు బాధపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు.వార్డు కమిటీలు వేసి సంఘాన్ని బలోపేతం చేద్దామంటే ఆడుకున్నది మీరే కదా.రోడ్డు కాంట్రాక్టర్ భవనాన్ని వాడుకున్నందుకు అంబేద్కర్ భవనానికి ఇస్తానన్న సిమెంట్, ఇసుక, కంకర ఏ కాకులు ఎత్తుకు పోయాయో సంఘ సభ్యులకు తెలపలన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ప్రతిపక్ష నాయకులకు అనుకూల నిర్ణయం ఎందుకు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మెజారిటీ సభ్యుల అభిప్రాయాన్ని గౌరవించకుండా,ఏకపక్షంగా నిర్ణయాలు ఎందుకు తీసుకుంటున్నారో చెప్పాలన్నారు.నిజమైన అంబేద్కర్ వాదులు తమ స్వార్థాన్ని వదిలి ప్రజా సమస్యలపై పోరాడు తారన్నారు.పట్టణ కమిటీ అదే చేస్తుందని,పట్టణంలో ఉత్కూర్ చౌరస్తాకు అంబేద్కర్ చౌక్ గా నామకరణం చేయాలని,ఎండలో నిల్చున్న ప్రయాణికులకు బస్ షెల్టర్ లు నిర్మించాలని,రోజు రోజు పెరుగుతున్న వాహనాల వల్ల ట్రాఫిక్ ఎక్కువైయిందని,రోడ్డు వెడెల్పు చేయాలని,ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పోరాటం నిర్వహించామని తెలిపారు.మండల కమిటీ అధ్యక్షులు ఏమీ చేశారో సంఘ సభ్యులకు చెప్పాలన్నారు. ఎక్కడ ఒక్క గ్రామ కమిటీ వేసిన పాపాన పోలేదన్నారు. దండలేసి దండం పెట్టడం తప్ప మీ నాయకత్వంలో జరిగింది శూన్యమన్నారు.గత మూడేళ్ళ నుండి భవనం అలాగే ఉందని, మీకేమైన చిత్తశుద్ధి ఉంటే ఆ పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి అంశం పైన బహిరంగ విచారణకు మండల అధ్యక్షులు రాందాస్ సిద్ధమా అని సవాల్ విసిరారు. పట్టణ కమిటీని రద్దు చేసే అధికారం మండల కమిటీకి లేదని, పట్టణ కమిటీ ఎల్లప్పుడూ కొనసాగుతుందని, పట్టణ కమిటీ సభ్యులు ఆందోళన చెందావద్దన్నారు.అంబేద్కర్ వాదులు, మేధావులు, ఉద్యోగ సంఘ నాయకులు, బహుజనులు తప్పుడు మాటలు వినొద్దని, నిజానిజాలు పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, పెండెం రాజశేఖర్,కండె మొగిలి,మగ్గిడి సాయి, అలుగునూరి నరేష్,బత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## బహుజన సాహిత్య జాతీయ అవార్డు గ్రహీత శ్రావణ్ కుమార్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 6 :**మందమర్రి పట్టడానికి చెందిన దాసరి శ్రావణ్ కుమార్ చేస్తున్న సామాజిక సేవలకు గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అవార్డు దక్కింది. హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు నల్లాల రాధాకృష్ణ జాతీయ అవార్డును శ్రావణ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా దాసరి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ నేను చేస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉందని భవిష్యత్తులో మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేసేందుకు ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని ఆయన పేర్కొన్నారు. హ్యాపీ ఎవరు బాధ్యతలు జాతీయ అవార్డు సాధించిన దాసరి శ్రావణ్ కుమార్ ను పలువురు అభినందించారు.

## మొలకలచెరువులో లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

అన్నమయ్య లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు మొలకల చెరువు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. స్థానిక బస్టాండు కూడలి వద్ద కూర్చొన్న సుమారు 53 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఎస్సై ఘటన స్థలం వద్దకు చేరుకుని మృతదేహం పరిశీలించి, పోస్టుమార్టం కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు

# మల్టీ పర్పస్ హాల్ పనులను పరిశీలించిన డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి



**ఉప్పల్ ప్రజాబలం ప్రతినిధి:హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి మరియు టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి తో కలిసి, జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ రవి కిరణ్ మరియు జిహెచ్ఎంసి అధికారులతో కలిసి తార్నాక డివిజన్‌లోని మల్టీ పర్పస్ హాల్ పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా, మల్టీ పర్పస్ హాల్ పనుల నాణ్యత మరియు పూర్తి చేసే గడువు పై సమీక్ష నిర్వహించారు. అనంతరం, ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో నిర్మాణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను కూడా తనిఖీ చేసి, పనుల పురోగతిపై ఆరా తీశారు.

పనులు నాణ్యతగా మరియు సమయానికి పూర్తి చేయాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పలు కాంగ్రెస్ నాయకులు స్థానికులు అధికారులు పాల్గొన్నారు.

# తార్నాక ఎక్స్ రోడ్ ఓపెనింగ్ పనుల పరిశీలన



**ఉప్పల్ ప్రజాబలం ప్రతినిధి:**హైదరాబాద్: తార్నాక ఎక్స్ రోడ్ ఓపెనింగ్ పనులను గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి , టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి , జిహెచ్ఎంసి సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్ మరియు ఇతర జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ పనుల పురోగతి, వినియోగదారుల అవసరాలు, రోడ్డు డిజైన్, పాదచారుల సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. పనుల ప్రాముఖ్యతను చర్చిస్తూ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ఇకపై ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గడానికి, రోడ్డు ప్రక్కన వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. పునరుతం ఏర్పాటు చేయబోతున్న స్మార్ట్ సిగ్నలింగ్ సిస్టమ్, సెంట్రలైజ్డ్ ట్రాఫిక్ మానిటరింగ్ చర్యలు వేగవంతం చేయాలని కూడా ఆదేశాలు జారీ చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీల వాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రజల సహకారం మరియు అధికారుల కృషితో ఈ పనులు త్వరగా పూర్తి కానున్నాయి.

## ప్రతి రైతు కి ఎకరానికి 15,000/- రూపాయల చెల్లించాలి

## మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 06 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మంచిర్యాల నియోజకవర్గంలోని లక్షెట్టిపేట అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు నడిపల్లి దివాకర్ రావు ఆధ్వర్యంలో మాట్లాడుతూ...అర్హులైన ప్రతి రైతుకి ఎకరానికి 15,000/- చెల్లించాలని నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పదివేలు బిచ్చం అన్నరు మరిప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్నదేమిటి? నువ్వు పెంచిన రెండు వేలు ఏమిటి? ముష్టి వేస్తున్నవా తెలంగాణలో పెద్ద ఎత్తున రైతు సంక్షేమ పథకాలు అమలుచేసి కేసీఆర్ రైతుబంధుగా నిలిస్తే హామీలకు కోతపెడుతూ రేవంత్‌రెడ్డి రాబందుగా మారాడు.కాంగ్రెస్ అంటేనే మోసం,దగా,నయవంచన అని మరోసారి రుజువైంది. రైతుభరోసా ఎకరానికి 15 వేలు రూపాయల ఇస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించి,12 వేలకు కుదించడమంటే రైతులను నిలువునా వంచించడమే.స్థానిక సంస్థల ఎన్నికల గండాన్ని దాటేందుకే రైతు భరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటన చేసింది. ఈ ద్రోహాన్ని రైతులు ఎప్పటికీ క్షమించరు అని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పట్టణ అధ్యక్షుడు చుంచు చిన్నయ్య,పాదం శ్రీనివాస్,పోడేటి శ్రీనివాస్ గౌడ్ డిసీఎమ్ఎస్ చైర్మన్ తిప్పని లింగన్న, ఎస్ సెల్ మండల అధ్యక్షులు చిప్పకుర్తి నారాయణ, చంద పాషా,ఎండీ అన్వార్ చతరాజీ రాజన్న, యూత్ అధ్యక్షులు అంకతి గంగాధర్ శనిగరపు వెంకటేష్ తోటపల్లి మహేందర్ పార్టీ నాయకులు, రైతులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అదేశాలతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



**ప్రజాబలం బెల్లంపల్లి నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 06:** బెల్లంపల్లి నియోజకవర్గంలోని కాసిపేట మండలం లో వివిధ లబ్ధిదారులకు 4 లక్ష 13 వేల రూపాయల తో లబ్ది దారులకు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సెక్రటరీ కాసిపేట మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్ చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రిటైర్డ్ కార్మికుని పరామర్శించిన రిటైర్డ్ కార్మిక సంఘం



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 6 :**మందమర్రి పట్టణంలోని మొదటి జోన్ కు చెందిన సింగరేణి మాజీ కార్మికుడు కలవల లచ్చన్న ఇటీవల అనారోగ్యానికి గురై రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మందమర్రి ఏరియా రిటైర్డ్ కార్మిక సంఘం అధ్యక్షుడు వాసాల శంకర్ సారధ్యంలో సోమవారం నాయకులు ఏరియా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈసందర్భంగా లచ్చన్న ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందిచాలని వైద్యులను కోరారు. వీరి వెంట సంఘం నాయకులు పోల్ సంపత్, జక్కం రాజన్న, ఆసం కొమురయ్య లు ఉన్నారు.

## కళ్యాణి ఖని ఓసి ని సందర్శించిన సింగరేణి అధికారులు



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 6** :మందమర్రి ఏరియా జీ.ఎం జి.దేవేందర్ తో కలిసి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ ) జి.వెంకటేశ్వర్ రెడ్డి ఏరియాలోని కేకే ఓసీపీ సందర్శించి పని ప్రదేశాలు పరిశీలించడంతో పాటు ఉత్పత్తి, ఉత్పాదకత పై సమీక్షించారు. రవాణాకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు,

ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

ప్రతి ఒక్కరు అంకిత భావంతో పనిచేసినప్పుడే నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి మార్గం సులువుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ వెంకటరమణ, కే.కే ఓ.సి ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, కే.కే ఓ.సి గని మేనేజర్ రామరాజు , సేఫ్టీ అధికారి కుష్వా పాల్గొన్నారు.

# ఎం ఆర్ పి ఎస్ జిల్లా ఉపాధ్యక్షులుగా కాశిపురం ఆంజనేయులు మాదిగ



**సంగారెడ్డి జనవరి 06 ప్రజ బలం ప్రతినిధి:** మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిలాలో విశ్రుతంగా దూసుకుపోతున్న ఎం ఆర్ పి ఎస్ ఉద్యమమును, ఇంక బలోపేతం చెయడంలో భాగంగా పిబ్రవరి 7న హైదరాబాద్ లో జరిగే వేయి గొంతులు – లక్ష డప్పులు విజయవంతం చేయడం లో భాగంగా జిల్లా ఉపధ్యక్షులుగా ఆంజనేయులు ను ఏనుకోవడం జరిగిదని, జిల్లా ఇంచార్జ్ కోళ్ళ శివ, జిల్లా అధ్యక్షులు బుచ్చంద్ర లు ఒక ప్రకటన లో తెలిపారు.

ఈ సందర్బంగా ఆంజనేయులు మాట్లాడుతూ నా పై నమ్మకం ఉంచి నాకు బాధ్యత ను అప్పగించినా కోళ్ళ శివ మాదిగ ఎం ఆర్ పి ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కి మరియు జిల్లా అధ్యక్షులు మైసగళ్ళ బుచ్చేంద్ర మాదిగ, మరియు పెద్ద గీత మాదిగ ఎం ఎం ఎస్ రాష్ట్ర నాయకురాలు కు ,అబ్రాహాం మాదిగ ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూన్నాను. అలాగే అనుబంధం సంఘాల జిల్లా కమిటీ లకు ప్రత్యేక దన్యవాదాలు తెలియజేస్తూన్నని అన్నారు.

# ప్రజావాణికి 85 దరఖాస్తులు

## తక్షణమే పరిష్కరించలని సంబంధిత అధికారులను ఆదేశించిన .... జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి



**సంగారెడ్డి, జనవరి 06 ప్రజ బలం ప్రతినిధి:** ప్రజల సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా అధికారులు విధులు నిర్వహించాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి 85 మంది సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో న్యాయం పొందేందుకు ఈ కార్యక్రమం మంచి వేదికగా మారిందని పేర్కొన్నారు. అర్జీలు అన్నింటినీ తక్షణమే పరిష్కరించి సంబంధిత అధికారులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజల ప్రధాన సమస్యలపై అధికారులు దృష్టి సారించి సమస్యల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.



ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి,, డిఆర్ ఓ పద్మజా రాణి, ఆర్డీవో రవీందర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com